# సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు, డీకే ఎస్‌జడ్‌సీ కార్యదర్శి కామ్రేడ్ రావుల శ్రీనివాస్ (రామన్న)కు విప్లవ జోహార్లు! అమరుల కలల్ని నిజం చేసేందుకు తుదిశ్వాస వరకు పోరాడుదాం!



ప్రియమైన విప్లవ ప్రజలారా,

పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు దండకారణ్య విప్లవోద్యమ ప్రతీక, ఒక ఉజ్వల చరిత్రకు మార్గదర్శి, పాలకవర్గాలకు సింహస్వప్నం కామ్రేడ్ రావుల శ్రీనివాస్ (రామన్న, నరేందర్) తీవ్ర అనారోగ్యంతో 2019 డిసెంబర్ 7నాడు రాత్రి 10గంటల సమయంలో తుదిశ్వాస విడిచాడు. దాదాపు మూడున్నర దశాబ్దాలకు పైగా దండకారణ్య ప్రజల మధ్య విప్లవోద్యమ నిర్మాణ కృషిలో దళ సభ్యుడి నుండి అంచెలంచెలుగా కేంద్రకమిటీ స్థాయికి ఎదిగిన కామ్రేడ్ రావుల శ్రీనివాస్ భౌతికంగా మనకిక లేడు. 36 సంవత్సరాల విప్లవ జీవితంలో ఆయన ప్రజల, పార్టీ కేడర్ల, ప్రజా సైనికుల అపార ఆదరాభిమానాలను చూరగొన్నాడు. ఆ కామ్రేడ్ అమరత్వం భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమ పురోగమనంలో పెద్దలోటు. ఆ అమరుడి ఆశయాలను పరిపూర్తి చేయడానికి తుదివరకూ పోరాడుతామని శపథం చేద్దాం. ఆయన నిర్మించిన ప్రజా ఉద్యమాన్ని ప్రాణంలా కాపాడుకుంటూ నూతన ఎత్తులకు పురోగమింపజేస్తామని, ఆయన ఆదర్శాలను పాటిస్తూ ఆయనకు నిజమైన సహచరులుగా ముందు పీఠిన నిలిచి భావి తరాలకు వాటిని అందిస్తామనీ ప్రతినబూనుదాం. భారత ప్రజల ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని తుదకంటా నిర్మూలిస్తామని వేగిరపడుతున్న హిందుత్వ శక్తుల ఆటలు సాగనివ్వమనీ, నిర్దాక్షిణ్యమైన వర్గపోరాట ప్రతీక, విప్లవ ప్రజల గొప్ప నాయకుడైన కామ్రేడ్ రావుల స్మృతిలో క్రాంతి పత్రిక సంపాదకవర్గం వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తోంది.

## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| ట్రంప్ అభిశంసన ..... | 6 |
| ఇజ్రాయిల్ రాజకీయ ..... | 8 |
| ఆర్థిక మాంద్యం ..... | 9 |
| అయోధ్య ..... | 14 |
| పర్యావరణం ..... | 20 |
| ఎంగెల్స్ 200 వ జయంతి ..... | 23 |
| వ్యవసాయ విధానాలు-2 ..... | 26 |
| ఆర్టీసీ సమ్మె ..... | 35 |
| పోడు భూములు ..... | 37 |



# క్రాంతి

సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 44 సంచిక: 3 నవంబర్ - డిసెంబర్ 2019 వెల: పది రూపాయలు

దాదాపు 36 ఏళ్ల క్రితం దండకారణ్యంలోని బస్తర్ గడ్డపై అడుగు పెట్టిన నాటికి కామ్రేడ్ రామన్న నవయువకుడు. అప్పుడప్పుడే బాల్యం వీడుతున్న దశ. బస్తర్ మాత్రం అప్పటికి నివురు గప్పిన నిప్పు. ఆ నిప్పును ఊదాడాయన. ఆ గడ్డ రాజుకుంది. ఆ వెలుగు క్రమంగా దేశమంతటినీ ఆకర్షించింది. తరతరాలుగా దోపిడీ, పీడనలతో విసిగి వేసారిన పీడిత ప్రజలకు అది ఆశా కిరణంగా మారింది. పాలకవర్గాలకు సవాల్‌గా మారింది. ఇప్పుడు రామన్న ఒక గొప్ప నాయకుడు. దండకారణ్య ఉద్యమనికి ప్రతీక. ఒక ఉజ్వల చరిత్రకు మార్గదర్శి. పాలకవర్గాలకు సింహస్వప్నం.

కామ్రేడ్ రావుల శ్రీనివాస్ తొలుత రామన్నగా, తరువాత నరేందర్‌గా యావత్ దండకారణ్య విప్లవ ప్రజలకు సుపరిచితుడు. కామ్రేడ్ రామన్న తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా చేర్యాల మండలంలోని భైరాన్‌పల్లి గ్రామ పంచాయితీలోని బెక్కల్ గ్రామంలో తల్లి వరమ్మ, తండ్రి రామలింగంల ఆరవ సంతానంగా 1965 జులైలో జన్మించాడు. అది ఒక దిగువ మధ్యతరగతి రైతు కుటుంబం. తల్లిదండ్రులు ఆయనకు శ్రీనివాస్ అని పేరు పెట్టారు. కుటుంబంలో ముగ్గురు సోదరులతోపాటు ఇద్దరు అక్కాచెల్లెళ్ళను కలిగిన శ్రీనివాస్ తన తల్లిదండ్రులకు చివరి కొడుకు. తండ్రితోపాటుగా అన్నలు చేసే కుల వృత్తి (తాళ్ళు గీయడం) సహ వ్యవసాయ పనులలో లేలేత రెక్కల శ్రీనివాస్ పాఠశాల చదువు నుండే పాలుపంచుకునేవాడు. ఆయన శ్రామిక కుటుంబంలో పుట్టడంతో, శ్రమను గౌరవిస్తూ, శ్రామిక వర్గదృక్పథాన్ని అలవర్చుకోవడానికి అది ఎంతో దోహదపడింది. నైజాం పాలనలో రజాకార్లతో, ఆ తర్వాత నెహ్రూ-పటేల్ కిరాయి సైన్యంతో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన వీరతెలంగాణ రైతాంగం హోరాహోరీగా సాయుధంగా పోరాడిన గొప్ప విప్లవ సాంప్రదాయం గల ప్రాంతంగా జనగామ ప్రాంతం భైరాన్‌పల్లి తెలంగాణాలో ప్రసిద్ధి చెందింది. ఆ గడ్డలో గొప్ప ధైర్యసాహసాలతో పోరాడుతూ వందలాది వీరులు నేలకొరిగారు. అక్కడ అమరుల స్థూపం పెద్దది నిర్మించారు. అది ఇప్పటికి భైరాన్‌పల్లిలో ఉంది. ఆ వీరోచిత పోరులో శ్రీనివాస్ తాతలు, తండ్రులు సైతం భాగస్వాములే. ఆయన తోబుట్టువు కామ్రేడ్ సత్తెన్న అప్పటికే విప్లవోద్యమంలో పూర్తికాలం విప్లవకారుడిగా పని చేస్తూండడం ఆయనపై ఎంతగానో సానుకూల ప్రభావాన్ని వేసింది. రామన్న అన్న పరశురాం (సత్తెన్న), వదిన శాంతక్క ఇద్దరూ ఉద్యమ క్రమంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులు అయ్యారు.

1980ల నాటికే తెలంగాణలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటుగా వరంగల్, నిజామాబాద్ తదితర జిల్లాలలో విప్లవోద్యమం బలపడుతూ, గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక వ్యవసాయ విప్లవ కార్యక్రమాలు, పట్టణాలలో రాడికల్ విద్యార్థి యువజన సంఘాల కార్యక్రమాలు రైతాంగాన్ని, యువకులను ఉగ్రూతలూగిస్తూ సంఘటితపర్చాయి. ఆ విప్లవ గడ్డన పుట్టిన శ్రీనివాస్ సమీపంలోని దూల్‌మెట్ట హైస్కూల్‌లో చదువుతూ విప్లవ విద్యార్థి రాజకీయాలను పరిచయం చేసుకున్నాడు. విప్లవాల గడ్డలో పుట్టడం, తనది విప్లవ వారసత్వం వున్న కుటుంబం కావడం ఆయనకు ఎంతగానో తోడ్పడింది. 1981-82లో రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు)లో చేరాడు. స్కూల్ ఆర్ఎస్‌యు యూనిట్ కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తూ పలు విద్యార్థి పోరాటాలలో భాగస్వామి అయ్యాడు. 1982, 83 సంవత్సరాల్లో 'విద్యార్థి-యువజనులారా! గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో తన విప్లవ చైతన్యాన్ని పెంచుకున్నాడు. 1983 ఏప్రిల్‌లో పార్టీ సభ్యత్వాన్ని పొందిన వెంటనే వరంగల్ జిల్లా పార్టీ కమిటీ ఉద్యమ అవసరాలను ఆయనకు అర్థం చేయించి పూర్తికాలం కార్యకర్తగా దండకారణ్య ప్రాంతానికి వెళ్ళాలని కోరింది.

రాడికల్ విద్యార్థిగా ఎదిగిన రావుల శ్రీనివాస్ అనతికాలంలోనే పార్టీ పిలుపుపై అడవికి పయనమయ్యాడు. 18 సంవత్సరాల నూనూగు మీసాల నవయవ్వన ప్రాయంలోనే బస్తర్ విప్లవోద్యమంలో శ్రీనివాస్ చేరిపోయి కామ్రేడ్ రామన్నగా మారిపోయాడు. 1983 నుండి 2019 చివరివరకు ఆయన ప్రజల మధ్యనే అలుపెరుగని కృషి చేస్తూ దండకారణ్య సమరశీల వర్గ పోరాటాల ప్రతీకగా నిలిచిపోయాడు. ఆయన అరుణారుణ స్మృతులు విప్లవ ప్రజలకూ చిరస్మరణీయం.

ఆయన రామన్న పేరుతో 1983 జూన్‌లో దండకారణ్యంలోని భద్రాచలం గెరిల్లా దళ సభ్యుడిగా గెరిల్లా జీవితం ఆరంభించాడు. డిసెంబర్‌లో భద్రాచలం నుండి కుంట దళసభ్యుడిగా బదిలీ అయ్యాడు. 1985లో దళం డిప్యూటీగా, ఆ తర్వాత 1987లో ఆ దళ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. 1992లో కుంట దళం ఏరియా కమిటీ (ఎస్ఎసి) కార్యదర్శిగా ఎదిగి బస్తర్ ప్రాంతంలోని కుంట, సుక్మా, గొల్లపల్లి, దోర్నపాల్, కిష్టారం ప్రాంతాలలో ఆదివాసీ ప్రజలను సంఘటితం చేస్తూ ఫారెస్టు, రెవెన్యూ అధికారుల దోపిడీ, పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా అనేక రాజకీయ-ఆర్థిక ప్రజా పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. భూపోరాటాలు నిర్వహించడంలో ముందున్నాడు. కల్ము దేవాల్, బురద వడ్డె లాంటి క్రూరమైన భూస్వాములను అంతమొందించడంలో, శత్రు కిరాయి పోలీసు బలగాల దాడులను తిప్పికొట్టడంలో ధైర్యంగా నాయకత్వం వహించిన వీర కమ్యూనిస్టు గెరిల్లా కమాండర్ కామ్రేడ్ రామన్న. 1993లో సహచర ఆదివాసీ మహిళా కామ్రేడ్‌తో వివాహం జరిగింది. దానితో ఆదివాసీ సమాజంతో మరింత విడదీయరాని అనుబంధం ఏర్పదింది. వారికి ఒక కొడుకు ఉన్నాడు. అతను తల్లితండ్రుల బాటలో నడుస్తున్నాడు.

1993లో డివిజన్ కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయి, సైనిక శిక్షణా శిబిరంలో పాల్గొని వచ్చి అక్కడి తొలి మిలటరీ దళానికి కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 1995 మార్చిలో ఉద్యమావసరాలను దృష్టిలో పెట్టుకుని ఉత్తర బస్తర్ డివిజన్‌కు

బదిలీ అయి కేశ్‌కల్, కొండగావ్, కోయిలీబేడ, మాడ్ ప్రాంతాలలో నరేందర్ పేరుతో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. శత్రు దాడులను తిప్పికొడుతూ అక్కడి ఉద్యమాన్ని పురోగమింపజేసాడు. 1998 సెప్టెంబర్‌లో తిరిగి దక్షిణ బస్తర్ డివిజన్‌కి బదిలీ అయ్యాడు. 2000 సెప్టెంబర్‌లో జరిగిన బస్తర్ డివిజన్ 3వ మహాసభలో దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ డివిజన్లుగా ఉద్యమం బలపడడం, ఆయన దక్షిణ బస్తర్ డివిజన్ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. 2000 డిసెంబర్‌లో దండకారణ్య స్పెషల్ జోన్ పార్టీ 3వ మహాసభలో కామ్రేడ్ రామన్న ఎస్‌జడ్‌సీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2003 మార్చిలో డీకే ఎస్‌జడ్‌సీ సెక్రెటేరియట్ సభ్యుడిగా, స్టేట్ మిలటరీ కమీషన్(ఎస్ఎమ్‌సి)సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాడు. 2005లో కంపెనీ-2 పార్టీ కమిటీ (సీవైపీసీ) కార్యదర్శి బాధ్యతలు సైతం చేపట్టాడు. 2006లో డీకే స్పెషల్ జోన్ పార్టీ 4వ మహాసభలో కమిటీ సభ్యుడిగా తిరిగి ఎన్నికై సెక్రటేరియట్ సభ్యుడిగా కొనసాగాడు. 2007 డిసెంబర్‌లో దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. 2011 అక్టోబర్‌లో డీకే స్పెషల్ జోన్ 4వ మహాసభ మొదటి ప్లీనంలో ఆయన ఎస్‌జడ్‌సీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. జోన్ క్రాంతికారీ జనతన సర్కార్ తయారీకమిటీ అధ్యక్షుడి బాధ్యతలు కూడా చేపట్టాడు. 2013 మార్చిలో పార్టీ కేంద్ర కమిటీలోకి కో-ఆప్టు అయినప్పటి నుండి దేశవ్యాప్త విప్లవోద్యమానికి నాయకత్వం అందించడంలో భాగస్వామి అయ్యాడు.

దండకారణ్య యుద్ధభూమిలో ఉద్యమావసరాల రీత్యా ఏనాటికానాడు ఉన్నత స్థాయిలో రూపొందుతూ వచ్చిన ఉన్నత సైనిక నిర్మాణాలకు తొలుత నాయకత్వం వహిస్తూ వాటిని పటిష్ట పర్చడంలో ఆయన సలిపిన కృషి ఆదర్శవంతమైనది. తొలుత 1993లో మిలిటరీ దళం, ఆ తర్వాత 1995లో ప్లాటూన్, 2004లో ప్రారంభమైన కంపెనీ నిర్మాణాల నుండి 2009లో ఏర్పడిన బెటాలియన్ వరకూ ఆయన అన్ని ఉన్నత సైనిక నిర్మాణాలకు ఆయా సందర్భాలలో నాయకత్వం అందించి ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేయడంతో పాటుగా వాటిని తీర్చి దిద్దడానికి ఎంతగానో కృషి చేశాడు. 2009 ఆగస్టులో డీకేలో ఏర్పడిన పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ పార్టీ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి అనేక మిలటరీ చర్యలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. ఈ క్రమంలో జన్‌జాగరణ్ అభియాన్లు (1990,1997), సల్వాజుడుం (2005-2009) దాడులను ప్రతిఘటించి ఓడించడంలో, ఆపరేషన్ గ్రీన్ హంట్ (2009-2017)ను, ఆ తర్వాత 'సమాధాన్ దాడులను' తిప్పికొట్టడంలో కామ్రేడ్ రామన్న ముఖ్య పాత్ర పోషించాడు.

గెరిల్లా జీవితంలోని అనేక కష్టాలను, ఒడిదుడుకులను దృఢంగా ఎదుర్కొన్నాడు. పార్టీ పంథాపై, ప్రజలపై అపార విశ్వాసంతో గ్రామ స్థాయి నుండి ప్రజలను సమీకరించి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో వర్గ పోరాటాన్ని కొనసాగిస్తూ వారితో ప్రజాసంఘాలు, మిలీషియా, పార్టీ సెల్స్, గ్రామ పార్టీ కమిటీలు, బ్రాంచీలు నిర్మాణం చేయడంలో, ప్రజా రాజ్యాధికార అంగాలుగా తొలుత గ్రామ రాజ్య కమిటీలు, ఆ తర్వాత పంచాయితీ, ఏరియా, డివిజన్ స్థాయి క్రాంతికారీ జనతన సర్కార్లను (విప్లవ ప్రజా కమిటీలు), దండకారణ్య క్రాంతికారీ జనతన సర్కార్ సమన్వయ కమిటీని ఏర్పరచడంలో ముఖ్య పాత్ర వహించాడు. లక్షలాది ప్రజలను విస్థాపితులను గావించే బైలడిల్లా, నంద్‌రాజ్ పహాడ్, రావుఘాట్, హాహ్లాది, కువ్వెమారి, సూర్జాగఢ్ వంటి గనుల తవ్వకాన్ని, లోహండిగూడా, ధుర్లి వంటి స్టీల్ ప్లాంట్లు, బోధ్‌ఘాట్ డ్యాం మొదలైన వాటితో కూడిన సామ్రాజ్యవాద ప్రాయోజిత కార్పొరేట్ బూటకపు అభివృద్ధి మోడల్‌ను బహిర్గతం చేస్తూ వాటికి వ్యతిరేకంగా దండకారణ్య ఆదివాసీ ప్రజలను కూడగడుతూ మిలిటెంట్ పోరాటాలకు నాయకత్వం అందించాడు. ప్రజా నిర్మాణాలలో సంఘటితమైన వందలాది యువతీ, యువకులకు ప్రేరణ కల్పించి పీఎల్‌జీఏలోకి రిక్రూట్ చేసి పీఎల్‌జీఏ ఫార్మేషన్స్‌ను పెంచడం, బలోపేతం చేయడంలో ప్రధాన భూమిక నిర్వహించాడు. భారత దోపిడీ పాలకవర్గాలు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ఎల్ఐసీ వ్యూహంతో వరుసగా కొనసాగిస్తూ వస్తున్న బహుముఖ అణచివేత క్యాంపెయిన్లలో భాగంగా బూటకపు సంస్కరణలను, మానసిక యుద్ధాన్ని, బలవంతపు సరెండర్ పాలసీని తిప్పికొట్టడంలో, ఇన్‌ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను పసిగట్టి దెబ్బతీయడంలో, ప్రజా ఇంటెలిజెన్స్ వ్యవస్థను నిర్మించి శత్రు దాడులను తిప్పికొట్టడంలో ముందున్నాడు. 1987లో కుర్నపల్లి, 1992లో లింగాన్‌పల్లి ఆంబుష్‌ల నుండి మొదలుకొని ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, తోంగూడ, భట్టిగూడ, సింగన్‌మడుగు, ముకరం, కసల్‌పాడ్, 2018లో ఏలాడ్‌మడుగు, కాసారం, 2019లో కొండసావలి, కేశ్‌కుతుల్ ఆంబుష్‌లు, కలిమెల, మోటు, బైలడిల్లా రెయిడ్ల వరకు ప్రత్యక్ష-పరోక్ష నాయకత్వం వహించి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడంలో, ప్రత్యేకించి మొబైల్ యుద్ధ లక్షణాలు కలిగిన ముకరం ఆంబుష్‌కు, రాణిబోదిలీ రెయిడ్‌కు రూపకల్పన చేయడంలో, శత్రు బలగాల నుంచి పెద్దెత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకొని పీఎల్‌జీఏను సాయుధం చేయడంలో, దాని పోరాట సామర్థ్యాన్ని పెంచడంలో ప్రముఖ పాత్ర వహించాడు. 2011 అక్టోబర్‌లో జరిగిన డీకే ప్లీనం దండకారణ్య విప్లవోద్యమం గడ్డు పరిస్థితుల్లో ఉందని అంచనా వేసింది. ఆ గడ్డుస్థితిలో సైతం ఎటువంటి శషబిషలకు తావులేకుండా డీకే ఎస్‌జడ్‌సీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టి ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు కృషి చేసాడు.

ప్రత్యామ్నాయ విప్లవ ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పడంలో కా. రామన్న అత్యంత పట్టుదలగా కృషి చేశాడు. 'విప్లవం అంటేనే రాజ్యాధికార స్థాపన' అనే లెనినిస్టు అవగాహనతో ఆయన పార్టీ విధానాలను అమలు చేయడంలో భాగంగా విప్లవ ప్రజలను సంఘటితపరిచే కృషికి మొదటి సర్కార్‌ను స్థాపించడంలో ఆయన చూపిన చొరవ, తెగువ అసాధారణమైనవి. డివిజనల్ జనతన

సర్కార్ల నిర్మాణ కృషిలో రామన్న ఒక ముఖ్య పాత్రను పోషించాడు. 2009 జనవరిలో జరిగిన దండకారణ్య జనతన సర్కార్ల కార్యశాలలో ఆయన పాల్గొని 'జోన్ జనతన సర్కార్ తయారీ కమిటీ' నిర్మాణంలో పాలుపంచుకున్నాడు. ఆ తరువాత 2012 నుండి చివరి వరకూ ఎనిమిది సంవత్సరాలు రామన్న ఆ కమిటీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తూ జనతన సర్కార్లను నడపడంలో అపార అనుభవం గడించాడు. జనతన సర్కార్లు చేపట్టిన అన్ని విప్లవ సంస్కరణల అమలులో కా. రామన్న గురుతరమైన పాత్ర పోషించాడు. యేటేటా జనతన సర్కార్ల స్థాపనా దినం ఫిబ్రవరి 10 (భూంకాల్ దివాస్) సందర్భంగా ప్రజలకు పరిస్థితులకు తగినవిధంగా సందేశాన్ని అందిస్తూ ప్రజా రాజ్యాధికార ఆవశ్యకతను గుర్తింపజేసేవాడు. జనతన సర్కార్ల అధికార పత్రిక 'జనతనరాజ్'ను క్రమం తప్పకుండా తీసుకురావడానికి ఎంతో శ్రద్ధ పెట్టేవాడు. ఆదివాసీ-గైరాదివాసీ ప్రజల ఐక్యతకు ప్రతీకగా సర్కార్ జెండాపై నిలుపుకున్న రెండు నక్షత్రాలకు వన్నె తెస్తూ నూతన చరిత్రను ఆవిష్కరిస్తున్న ఆ జెండా నీడలో అసువులు బాసిన ఉన్నత స్థాయి సర్కార్ మలి అధ్యక్షుడిని ప్రజలెన్నటికీ మరువరు. ఆయన స్మృతులు అజరం-అమరం.

కా. రామన్న మార్క్సిస్టు విద్యను అభ్యసించడం పట్ల ఎంతగానో పరిశ్రమించేవాడు. ఆయన నిరంతరం సిద్ధాంతాన్ని అధ్యయనం చేస్తూ ప్రజల నుండి నేర్చుకోవడంలో వినయంగల విద్యార్థిగా ముందుండేవాడు. డీకే ఎస్‌జెడ్‌సీ కార్యదర్శిగా ఆయన పార్టీ అధికార పత్రిక 'ప్రభాత్'ను రెగ్యులర్‌గా తేవాలని ఎంతో పట్టుదలగా కృషి చేసేవాడు. కమిటీ సిద్ధాంత-రాజకీయ గోండీ పత్రిక 'వియుక్క' (వేగుచుక్క)ను కనీసం యేటా ఒక సంచికనైనా తీసుకురావడానికి సహచర కామ్రేడ్స్‌ను రచనలు, అనువాదాలు చేయడానికి ఎంతగానో ప్రోత్సహించేవాడు. ఉద్యమ అవసరాలకు తగినట్టుగా పార్టీ లేఖలను, సర్క్యులర్‌లను రూపొందించడంలో, పంపిణీ చేయడంలో, వాటిపై అభిప్రాయాలను తీసుకురావడంలో చాలా బాధ్యతగా వ్యవహరించేవాడు. కమిటీ సమావేశాలను ఒక కార్యదర్శిగా ఆయన ఎంతో దక్షతతో నిర్వహించేవాడు.

కా. రామన్న మావోయిస్టు కార్యశైలికి ప్రాణప్రదమైన విమర్శ-ఆత్మవిమర్శలో ఎంతో వినయంతో ఉంటూ ప్రతి విమర్శను ఒక టీకాగా భావిస్తూ తనలోని లోపాలను, కొరవలను గుర్తించి వాటినుండి బయటపడడానికి తీవ్రమైన కృషి చేసేవాడు. పార్టీ చేపట్టిన దిద్దుబాటు ఉద్యమాలన్నింటిలో ఆయన ఒక నాయకుడిగా, విద్యార్థిగా పాల్గొని తననుతాను సంస్కరించుకోవడానికి, బాగు చేసుకోవడానికి చేసిన కృషి అనుసరణీయమైనది. పార్టీలో తలెత్తే సమస్యలను, కమిటీలలో ప్రస్ఫుటమయ్యే భిన్నాభిప్రాయాలను ఓపికగా అర్థం చేసుకోవడానికి, పరిష్కరించడానికి పూనుకునేవాడు.

కామ్రేడ్ రావుల శ్రీనివాస్ ఒక శ్రామిక కుటుంబంలో, పెద్ద కుటుంబంలో జన్మించినవాడు కావడంతో ఆయన ఎదుగుదలలో పోషకాహారలోపం కొట్టొచ్చినట్టు వ్యక్తమయ్యేది. దానికితోడు ఆయన గృహ జీవితంకన్నా రెట్టింపు జీవితం అడవిలో ఎంతో కష్టభరితమైన గెరిల్లాగానే గడిచింది. నిరుపేద ఆదివాసీ ప్రజల మధ్య బస్తర్‌లో విప్లవకారులు చాలావరకు (జనతన సర్కార్ల నిర్మాణానికి ముందు) కేవలం పచ్చిపులుసుతోనే కడుపు నింపుకోవాల్సి వచ్చిందనడం ఆనాటి ప్రజా జీవితాలను ఈ సందర్భంగా మరోమారు గుర్తుచేసుకోవడమే అవుతుంది. అలాంటి జీవితం అనివార్యమైన చోట రోగనిరోధక శక్తి సహజంగానే తగినంత పెంపొందకపోవడంతో తరచుగా ఆయన మలేరియా బారినపడి మరింత బలహీనతకు గురయ్యేవాడు. నాలుగు పదుల వయసైనా నిండకముందే ఆయనను మధుమేహ వ్యాధి ఆవహించింది. ఆ తరువాత బీపీ మొదలైంది. వాటికి తోడు మరిన్ని జబ్బులు వెంటాడుతూ ఆయనను అడుగడుగునా పరీక్షించసాగాయి. శతృదాడుల మధ్య అనేక సందర్భాలలో ఆయన్ని రక్షణ సిబ్బంది ప్రాణంలా కాపాడుకున్నారు. ప్రజలు తమ నాయకున్ని కంటికి రెప్పలా రక్షించుకున్నారు. గెరిల్లా జీవితంలో మృత్యువుతో దోబూచులాడుతూనే దానికి అందకుండా శతృవును దెబ్బతీసే యుద్ధచర్యలలో రామన్న ఎంతో చాకచక్యంగా మెలిగేవాడు. 2016 వేసవిలో ఆయన పార్టీ పనిమీద దండకారణ్యానికి బయటి ప్రాంతంలో శతృదాడుల మధ్య సహచర కామ్రేడ్స్‌ను కోల్పోతూ కర్తవ్య నిర్వహణలో గడిపిన కొద్దికాలం ఆయన ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేసింది. అయినప్పటికీ మావో చెప్పినట్లు తుదిశ్వాస విడిచే వరకు నమ్మిన ఆశయాల కోసం నిజాయితీగా నిలిచి పోరాడిన గొప్ప కమ్యూనిస్టు విప్లవకారుడు మన రామన్న. కార్మికవర్గ భావజాలమే పునాదిగా, విప్లవ సైద్ధాంతిక స్పష్టతే ఇంధనంగా, ప్రజా బలమే ఆయుధంగా తన పూర్తికాలాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన మన రామన్న నిబద్ధత గల పరిపూర్ణ విప్లవకారుడు.

కా. రామన్నలోని విప్లవతత్వం, సాహసం, సాదాసీదా-కఠిన జీవనశైలి కమ్యూనిస్టు విప్లవకారులకు, గెరిల్లాలకు ఆదర్శనీయం. ఉద్యమంలోని ప్రతి మలుపులో ఆయన ప్రజలతో, కేడర్లతో మమేకమవుతూ వచ్చాడు. వారిలో రాజకీయ చైతన్యాన్ని కలిగిస్తూ, వర్గకసిని రేకెత్తిస్తూ పార్టీని, పీఎల్‌జీఏని, విప్లవకర ఐక్యసంఘటనను అభివృద్ధి చేస్తూ ప్రజా ప్రతిఘటనను, గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో దూరదృష్టితో రామన్న చేసిన కృషి నుంచి కామ్రేడ్స్ అందరూ నేర్చుకోవాలి. కార్మికవర్గ పుత్రుడిగా, మంచి కమ్యూనిస్టుగా దృఢంగా నిలబడుతూ, నాయకత్వాన్ని అందిస్తూ పలాయనవాదాన్ని, సరెండర్లను అసహ్యించుకుంటూ, వాటికి వ్యతిరేకంగా పార్టీ కేడర్ల, ప్రజల చైతన్యాన్ని నిలబెట్టిన ఈ విప్లవ ఆదర్శాలు విప్లవోద్యమానికి సదా ప్రేరణను అందిస్తూనే ఉంటాయి.

2011నాటికి దండకారణ్యం, 2013 నాటికి యావత్ దేశ విప్లవోద్యమం గడ్డు స్థితికి చేరిన సమయంలో కామ్రేడ్ రామన్న ఎంతో ధైర్యంగా ఉన్నత బాధ్యతలు చేపట్టాడు. దండకారణ్య పార్టీ

కార్యదర్శిగా ఉంటూనే కేంద్ర కమిటీ సభ్యుడిగా చేపట్టిన బాధ్యతలలో ఎంతో నిబ్బరంగా కొనసాగుతూ వాటికి న్యాయం చేకూర్చాడు. కేంద్రకమిటీ సభ్యుడిగానే ఆయన ప్రజాసేవలో, విప్లవోద్యమ నిర్మాణంలో తుదివరకూ నిలిచి తనకు ఎంతో అపురూపమైన, విశ్వసనీయమైన కేడర్ల మధ్యనే కా. రామన్న గెరిల్లాబేసులో కన్ను మూశాడు. దండకారణ్య సమర భూమిలో అనారోగ్యంతో అసువులుబాసిన కేంద్ర కమిటీ సభ్యుడాయన. ఆయన అమరత్వ వార్త విన్న వెంటనే సమీప గ్రామాలనుండి వేలాది మంది విప్లవ ప్రజలు వచ్చి ఆయన పార్థివ దేహాన్ని కడసారి కన్నుల నిండా చూసుకొని గుండెలవిసేలా రోదిస్తూ అశ్రునయనాలతో ఆయనకు విప్లవ సంప్రదాయాల మధ్య అంత్యక్రియలు జరిపారు. బిగించిన పిడికిళ్లతో చేతులెత్తి 'జోహార్ కామ్రేడ్ రామన్న', 'కామ్రేడ్ రామన్న అమర్ రహే' అంటూ నినదిస్తూ వారు తమ ప్రియమైన నాయకుడికి అంతిమ వీడ్కోలు చెప్పారు. ఆయన అమరత్వం వారి హృదయాలలో సదా నిలిచిపోతుంది.

పోలీసులు, వారి మీడియా సైతం ప్రజాయుద్ధంలో ఆయన విజయాలను ఒప్పుకోక తప్పలేదు. రామన్న తయారుచేసిన వారసులు అనేక మంది ఉద్యమంలో ఉన్నారంటూ, వారు అనేక సమరాలలో రాటుదేలి శతృవును దునుమాడారనీ నిజాలు చెప్పక తప్పడం లేదు. శత్రు పక్షం చేరిన తెగ పెద్దలు, ప్రజాద్రోహులు ఆయన ఇకలేడని ఏమాత్రం విర్రవీగినా ఆ నాయకుని వీరోచిత వారసులంతా వారికి నిస్సందేహంగా చుక్కలు చూపిస్తారు, భారత ప్రజల ప్రజాస్వామిక విప్లవాన్ని విజయపథంలో పురోగమింప చేసి తీరుతారు.

సుక్మా, బీజాపూర్, దంతెవాడ జిల్లాలలోని వందలాది పోరాట గ్రామాలలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రామన్న నెరుగని వారు బహు అరుదనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదేమో! ఆయన వారి మధ్య దాదాపు నాలుగు దశాబ్దాలు గడిపి వారి జీవితాల నుండి విడదీయరాని భాగమైనాడు. వారంతా ఆయనను ఎంతగానో గుర్తుచేసుకుంటూ గ్రామగ్రామాన సంస్మరణ సభలు జరుపుతున్నారు. ఆయన కుటుంబీకులకు, బంధు మిత్రులకు ఆయన ఇక భౌతికంగా లేడన్న వార్త ఎంతో వేదనను కలిగిస్తుంది. తెలంగాణ ప్రజా పోరాటాల ఓరుగల్లు మరో భూమి పుత్రున్ని కోల్పోయిన బాధననుభవిస్తుంది. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, మధ్య రీజియన్ బ్యూరో, డీకే స్పెషల్‌జోనల్ కమిటీలు వారందరితో దుఃఖాన్ని పంచుకుంటూ, వారికి సాంత్వన చేకూరాలని కోరుకుంటూ రామన్న ఆశయాలను పరిపూర్తి చేయడానికి దృఢంగా తుదివరకు పోరాడుతాయని వేరు వేరు ప్రకటనలలో తెలియజేసాయి.

కా. రామన్న జీవితం ఒక అమూల్యమైన పాఠం వంటిది. ఆయన చేసిన రాజకీయ, సైనిక, నిర్మాణాత్మక కృషితో పాటు మరెన్నో విషయాలు ఆయన నుండి నేర్చుకోవాల్సినవి వున్నాయి. ప్రజలతో ఆయన మమేకమైన తీరు ఆదర్శనీయం. ఆయన జ్ఞాపకశక్తి అమోఘం. దండకారణ్యానికి సంబంధించి ఆయనొక సమాచార భాండాగారం. అన్ని స్థాయిల క్యాడర్‌కు ఆయన ఆత్మీయుడు. ఆయనది సాదాసీదా జీవన శైలి. తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నప్పటికీ తన బాధ్యతలను నిర్వర్తించడానికి, సకాలంలో పనులను పూర్తి చేయడానికి ఎంతో శ్రమించేవాడు.

**కాకలు తీరిన యోధుడు మన రామన్న**

పోరాటాల ఖిల్లా వరంగల్ జిల్లాలో భైరన్‌పల్లి అమరుల స్ఫూర్తితో విప్లవ రాజకీయ పాఠాలు నేర్చిన విద్యార్థి రావుల శ్రీనివాస్, దండకారణ్య వర్గపోరాట కొలిమిలో కాకలు తీరిన యోధుడు రామన్న. పీడిత ప్రజల అభిమానాన్ని అపారంగా చూరగొన్న విప్లవ నాయకుడు. వర్గపోరాటాన్ని సమర్థవంతంగా ఆర్గనైజ్ చేసిన గెరిల్లా కమాండర్ రామన్న అంచలంచలగా ఎదిగి జిల్లా, జోన్, కేంద్ర స్థాయిల్లో నిర్వహించిన భూమిక గొప్ప ప్రేరణని ఇస్తుంది. ప్రజాపోరాటాల్లో, ప్రతిఘటనల్లో, పార్టీ నిర్మాణంలో, జనతన్ సర్కార్ల ఏర్పాటులో, క్యాడర్ బర్తీలో, మిలిటెన్సీని పెంపొందించడంలో, ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌లో బహుముఖంగా రామన్న కృషి, ప్రత్యక్ష సారథ్యం ఉన్నాయి. వర్గ శత్రువు నిర్మూలనలో, ఆయుధాల స్వాధీనంలో రామన్న నేతృత్వం ఉత్తేజకరమైనది. మిలటరీ వ్యూహాల్లో, ఎత్తుగడల ఎదురుదాడుల్లో కమాండ్ బాధ్యతలు నిర్వహించిన రామన్న అన్నిటా తానై దండకారణ్య ఉద్యమానికి, భారత విప్లవోద్యమానికి వెలుగురేఖగా సర్వత్రా వెలుగులందించిన రామన్న జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయం. కా. రామన్న లేడు. ఆయన విప్లవ ప్రయాణం ముగిసింది. కానీ, ఏ లక్ష్యం కోసం ఆయన అహర్నిశలూ కృషి చేశాడో ఆ లక్ష్యం మిగిలే వుంది. ఆ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ఆయన నేతృత్వంలో పని చేసిన కమిటీలున్నాయి, క్యాడర్ వుంది. ఆయన చేసిన బోధనలున్నాయి. ఆయన ఇచ్చిన మార్గదర్శకత్వం వుంది. ఆయన అందించిన అనుభవం వుంది. ముఖ్యంగా ఆయనను ప్రేమించిన, విశ్వసించిన ప్రజలున్నారు. దండకారణ్య విప్లవోద్యమంపై ఆయన వేసిన ముద్ర, క్యాడర్‌పై, ప్రజలపై పడిన పాజిటీవ్ ప్రభావం గొప్పవి. అనుసరణీయమైనవి.

ఆయన మరణం దండకారణ్య విప్లవోద్యమానికే కాదు, భారత విప్లవోద్యమానికీ, ప్రపంచ విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం.

దండకారణ్యంలోని పార్టీ కేడర్లు, గెరిల్లాలు తమకు ఏ సమస్య ఉత్పన్నమైనా మన 'రామన్న ఉన్నాడన్న' భరోసాతో, చొరవతో ముందుకుపోయేవారు. వారికి ఆయన లేని లోటు తక్షణమే పూడ్చలేనిది. రామన్న ఆదర్శాలను ఎత్తిపడుతూ పోరు జనసంద్రం నుండి నవతరం యువత మునుపెన్నటికన్నా ఎక్కువ సంఖ్యలో భర్తీ అయ్యి, నాయకత్వంగా ఎదిగి నూతన ఎత్తులకు ఉద్యమాన్ని వికసింపచేస్తారనీ ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అదే ఆయన స్మృతికి మనం అందించే నివాళి అవుతుంది. ★

# ట్రంప్ అభిశంసన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిశంసన ప్రక్రియపై అక్కడి కాంగ్రెస్‌లో మల్లగుల్లాలు పడుతున్నారు. 2020లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా నిలబడే అవకాశాలున్న డెమోక్రటిక్ అభ్యర్థి, మాజీ ఉపాధ్యక్షుడు జో బైడెన్, అతడి కుమారుడు హంటర్‌లను దెబ్బతీసేందుకు, తన అవకాశాల్ని మెరుగు పరచుకునేందుకు 2016లో తీవ్ర చర్చనీయాంశమైన ట్రంప్ ఉక్రెయిన్ సాయం కోరాడనే ఆరోపణలు ఎట్టకేలకు అభిశంసనకు దారి తీశాయి.

అమెరికా చరిత్రలో ప్రతినిధుల సభ చేత అభిశంసనకు గురైన మూడవ అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచారు. ఇంతకు ముందు ఆండూ జాన్సన్, బిల్ క్లింటన్‌లు అభిశంసనను ఎదుర్కొన్నారు.

రష్యా అండదండలున్న తిరుగుబాటుదారులతో పోరాడుతూ ఇబ్బందికర పరిస్థితుల్లో నలుగుతున్న ఉక్రెయిన్‌ను ట్రంప్ గతంలో అంతిమక్షణాలలో తన ఎన్నికల విజయానికి ఉపయోగించుకున్న తీరు ఇపుడు తెరకెక్కింది.

ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడ్మిర్ జెలెన్స్కీకి జూలై 25న ట్రంప్ ఫోన్ చేశాడు. అప్పుడు జోబైడెన్, హంటర్‌లను దెబ్బతీసే సమాచారం తవ్వితీయాలని ఒత్తిడి తెచ్చినట్లు వెలువడిన వార్తలు తక్షణం అభిశంసనకు రంగం సిద్ధం చేశాయి. బైడెన్ అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆయన కుమారుడు హంటర్ ఒక ఉక్రెయిన్ కంపెనీ కోసం పనిచేశాడు. ప్రస్తుత వార్తల నేపథ్యంలో ట్రంప్ తన స్వప్రయోజనాల్ని పరిరక్షించుకునేలా నడచుకుంటాడనే ఆరోపణలకు బలం చేకూర్చే వివరాలు ఒక్కొక్కటీ బయట పడుతున్నాయి. అమెరికా దౌత్యనీతికి సంబంధించిన మౌలిక సూత్రాలను, సిద్ధాంతాలను సైతం దెబ్బతీశాడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ, ట్రంప్ తన తప్పులు బయటపడుతున్నా, అహంతో ఆయన ప్రతిపక్షాలను నిందిస్తుండటం గమనార్హం.

తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఆయన ఎలాంటి నీచానికైనా దిగుతాడనే విషయాల్ని అభిశంసన ప్రక్రియ తెలియజేస్తోంది. ఉక్రెయిన్‌కు అందించిన అత్యవసర సైనిక సహాయాన్ని అందుకోసం ఆయన ఎలా ఉపయోగించుకున్నాడనేది అభిశంసన ప్రక్రియ ద్వారా స్పష్టమవుతోంది. జో బైడెన్, హంటర్‌లను ఇబ్బంది పెట్టేందుకు, వారిపై మోసపూరిత దర్యాప్తు చేపట్టేలా ఆదేశాలివ్వాలనే షరతుకు, ఉక్రెయిన్‌కు 40 వేలకోట్ల డాలర్ల సాయం విడుదలకు లంకె పెట్టాడు. వారిపై అవినీతి ముద్ర వేసేందుకు శతధా ప్రయత్నించాడు. ఇందుకోసం రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ సైన్యాన్ని సమర్థించే అమెరికా దీర్ఘకాలిక విధానాన్ని సైతం ఆయన ఉపసంహరించుకున్నాడు. ఉక్రెయిన్‌లో అధికారంలో ఉన్న అవినీతి పరులైన నేతలకు మద్దతు ఇచ్చాడు. అమెరికా దౌత్య ప్రతినిధుల బాధ్యతల్ని తన ప్రైవేటు న్యాయవాది, న్యూయార్క్ మాజీ మేయర్ రూడీ గియులియానికి అప్పగించాడు. ఇందుకోసం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అమెరికా రాయబారిని సైతం తప్పించాడు. ఇవన్నీ అభిశంసన ప్రక్రియలో భాగంగా తొలిరోజు చేపట్టిన బహిరంగ విచారణలోనే బయటకొచ్చాయి.

అమెరికా ప్రతినిధుల సభలో అభిశంసన ప్రక్రియ తీరును పరిశీలిస్తే ట్రంప్ ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడే! కాని, మొండిఘటంగా పేరున్న ఆయన నానాగడ్డికరిచి పొందిన ఆ పదవిని వదలడు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడైన తాను దాన్ని ససేమిరా వదలడనే ఆయన రోజూ చేస్తున్న ట్వీట్లే వెల్లడిస్తున్నాయి.

అభిశంసన విచారణ రెండోరోజున, అమెరికా మాజీ రాయబారి మేరీ యొవనోవిచ్ ఉక్రెయిన్ రాజధాని కీవ్ నుంచి తనకు ఏ స్థాయిలో వేధింపులు ఎదురయ్యాయో వివరించాడు. తప్పుడు ఆరోపణలతో బైడెన్‌పై దర్యాప్తు ప్రారంభించే విషయంలో రూడీ పన్నిన కుట్రలో పాలు పంచుకోకపోవడమే ఇందుకు కారణమని వాపోయాడు. అధ్యక్షుడు చేసిన సంస్థాగతమైన నష్టానికి మేరీ ఇచ్చిన సాక్ష్యమే ప్రాతిపదికగా నిలిచింది. అంతేకాదు, సమర్థులైన, అనుభవంగల దౌత్యవేత్తల్ని రక్షించే విషయంలో విదేశాంగ మంత్రి మైక్ పాంపియో వైఫల్యమూ బయటపడింది. ఈ విషయంలో ట్రంప్ చేసిన ట్వీట్ సైతం బెదిరింపు చర్యగానే ఉంది. దాన్ని సాక్షుల్ని ప్రభావితం చేసే చర్యగా డెమోక్రటిక్ కమిటీ చైర్మన్ అభివర్ణించాడు. అభిశంసనకు ఇది మరో నిర్దిష్ట అంశంగా మారింది. ఉక్రెయిన్ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి ఏప్రిల్‌లో అతడితో ట్రంప్ జరిపిన తొలి సంభాషణల (లిప్యంతరీకరణ)ను శ్వేతసౌధం విడుదల చేసింది. ఇది ట్రంప్ సమస్యల్ని మరింతగా పెంచింది.

2016 అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకున్నారనే ఆరోపణలను రష్యాకు బదులుగా ఉక్రెయిన్‌పై సంధించడమే ట్రంప్ ఉద్దేశం. దీనికి తోడు, రష్యా ఆక్రమణలకు వ్యతిరేకంగా భౌగోళిక సమగ్రతను పరిరక్షించడంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచేందుకు ఆయన ఎన్నడూ ఉత్సాహం చూపలేదు. మొత్తంగా ట్రంప్ విషయంలో ఏం జరుగుతుందనేది పాలక ముఠాల మధ్య అంత్యంత ఆసక్తికరమైన విషయంగా మారింది. ట్రంప్ 'ప్రచ్ఛన్న యుద్ధం' తరవాతి ప్రపంచాన్ని 'అమెరికా ఫస్టు విధానాలతో' తన జాత్యాహంకారాన్ని చాటుకుంటున్నాడు. వాణిజ్యపర అంశాల్లో నూతనంగా వాణిజ్య యుద్ధాలకు తెర లేపాడు. ఈ నేపథ్యంలో ట్రంప్ భవిష్యత్తు ఏమిటన్నది అమెరికా ప్రజలు ఆసక్తికరంగా గమనిస్తున్నారు. ఆయన కొనసాగింపు ప్రపంచీకరణపై ప్రతికూల భావనల్ని రేకెత్తిస్తుందని సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రమవుతున్న వైరుధ్యాలు స్పష్టం చేస్తున్నవి.

## ట్రంప్ దుందుడుకు చర్యలు అమెరికాను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి:

అమెరికా సామ్రాజ్యవాదం దృష్టి ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పై పడింది. ఇరాన్ సహజ ముడి చమురు సంపదతో పాటు ఆసియా, సెంట్రల్ ఆసియా, యూరప్ ఖండాలకు వ్యూహాత్మకంగానూ, భౌగోళికంగా విశిష్ఠ స్థానాన్ని కలిగివున్నది. ప్రపంచ చమురు రిజర్వులతో వెనిజులా, సౌదీ అరేబియా, కెనడాల తర్వాత 16 వేల కోట్ల బారెళ్ల చమురు నిల్వలను ఇరాన్ కల్గివుండి నాల్గవస్థానంలో ఉంది. ప్రపంచ చమురు నిల్వలలో ఇరాన్ వద్ద 10 శాతంపైగా ఉన్నాయి. చమురుపై ఆధిపత్యం కల్గివుంటే ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించవచ్చునన్నది అమెరికా విదేశాంగ విధానంలో ముఖ్య భాగం. మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయిల్‌ను అందుకే ప్రతిష్ఠించారు.

ఇరాన్‌ను లొంగ దీసుకోవాలని అమెరికా కుట్ర చేస్తోంది. ఇరాన్‌కు ఆదాయం సమకూర్చి పెట్టే మూడు ప్రధాన రంగాలు చమురు, పెట్రో కెమికల్స్, ఇనుము, అల్యూమినియం, ఉక్కు, రాగి ఎగుమతులపై ఆంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2019 మే 9న ఆదేశాలు జారీ చేశాడు. ఇరాన్ నుంచి తమ మిత్రదేశాలు చమురు కొనకూడదని అమెరికా హుకుం జారీ చేసింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య రోజురోజుకు తీవ్రమవుతున్న వైషమ్యాలు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. చమురు ఆధారంగా నడుస్తున్న ఇరాన్ ఆర్థిక వ్యవస్థ అమెరికా చర్యలతో దెబ్బతింది.

ఇటీవలి కాలంలో అమెరికా జోక్యంతో ప్రపంచ వ్యాపితంగా తలెత్తిన ఉద్రిక్తతలు అమెరికా దుస్సాహసాన్ని వెల్లడిస్తున్నాయి. వెనిజులా, క్యూబాలపై అమెరికా ఆంక్షలు విధించింది. వెనిజులాలో ప్రజలచే ఎన్నుకోబడిన మాదురో ప్రభుత్వాన్ని మార్చడానికి కుట్రలు, హింసాకాండ, చివరికి యుద్ధ సన్నాహాలు ప్రారంభించింది. ప్రపంచ చమురు నిల్వల్లో అగ్రగామిగా ఉన్న వెనిజులా నేడు ట్రంప్ ప్రభుత్వ కుట్రల వల్ల తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది.

మధ్య ప్రాచ్యంలో మరో మారు యుద్ధాన్ని రగిలించడం కోసం ఇజ్రాయిల్-పాలస్తీనాల మధ్య అమెరికా రాజేసిన అగ్గి అక్కడ మళ్లీ ఉద్రిక్తతను రగిలించింది. ఇప్పటి వరకు తటస్థంగా ఉన్న జెరుసలేంను ప్రపంచ దేశాల అభిష్టానికి భిన్నంగా ఇజ్రాయిల్ రాజధానిగా మార్చి ట్రంప్ అక్కడకు అమెరికా రాయబార కార్యాలయాన్ని తరలించాడు. దాంతో ఇజ్రాయిల్‌కు, పాలస్తీనా ప్రజలకూ మధ్య నిత్యం ఘర్షణలు మరింత పెరిగి ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో నిత్యం అనేక మంది పాలస్తీనియన్లు మరణిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో ప్రస్తుతం ఇరాన్‌లో అంతర్యుద్ధానికి సౌదీ అరేబియాతో కలిసి అమెరికా అనేక కుట్రలు పన్నుతోంది. ఇంకోవైపు సిరియా ప్రభుత్వ దళాలకు ఇరాన్-రష్యాలు మద్దతిస్తున్నాయి. యెమన్ అంతర్యుద్ధంలో విమాన దాడుల్లో వేలాది మంది పౌరులను చంపేస్తున్న సౌదీ అరేబియాకు అమెరికా వెనుక నుండి కథ నడుపుతోంది.

ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహూ కోసం ఇరాన్ మీద విరుచుకుపడుతూ దేశ ప్రయోజనాలను ట్రంప్ ప్రమాదంలో పడేస్తున్నాడని అక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు. అణుబాంబు తయారీ సహా ఇరాన్ మీద ట్రంప్ చేస్తున్న ఏ ఆరోపణలోనూ నిజం లేదని ఇప్పటికే అమెరికన్ ఇంటలిజెన్స్ విభాగమే తేల్చింది. అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందంలోని అంశాలన్నింటినీ ఇరాన్ తూ.చ. తప్పకుండా పాటిస్తున్నదని కూడా తెలిపింది. అయినప్పటికీ అవేవీ ట్రంప్‌కు రుచించడం లేదు. అన్ని రకాల ఆంక్షలు విధించి ఇరాన్‌ను శక్తిహీనంగా మార్చివేసి, అక్కడ అధికార మార్పిడి జరుపాలనేదే ఆయన అసలు పథకం.

ఈ రోజు ట్రంప్ తెంపరితనాన్ని ఎదిరించి స్వపక్షమే విమర్శిస్తోంది. ఇరాన్ పై ఆంక్షలను తాము అంగీకరించబోమని టర్కీ, చైనా, రష్యాలు ప్రకటించాయి. ఇరాన్ నుండి చమురు దిగుమతి చేసుకునే పెద్ద దేశాల్లో చైనా, భారత్‌లు ఉన్నాయి. అమెరికా ఆంక్షలు పెట్టినా తను ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేస్తానని చైనా కరాఖండిగా చెప్పింది. విశేషమేమంటే అమెరికా నేతృత్వంలోని నాటో సైనిక కూటమిలో భాగస్వామిగా ఉన్న టర్కీ కూడా ఇరాన్‌పై ఆంక్షలకు ధిక్కార స్వరం వినిపించింది. ఒకరకంగా అమెరికా దుందుడుకు చర్యలను ఎదిరించడంలో చైనా, రష్యాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీలో అమెరికా భాగస్వాములైన ఐరోపా కూటమి కూడా ఊగిసలాట ప్రదర్శిస్తోంది. వెనిజులా, ఉత్తర కొరియా వంటి వాటి విషయంలో అమెరికాతో పయనించే ఈ దేశాలు ఇరాన్, పర్యావరణం వంటి ఇతర అంశాల్లో దాన్ని ఎదిరిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్యారిస్ ఒప్పందం నుండి అమెరికా వైదొలగడాన్ని ప్రపంచమంతా వ్యతిరేకించింది.

అసలే 2008 సంక్షోభం నుండి తేరుకోలేకపోతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ట్రంప్ సర్కారు సామ్రాజ్యవాద దుందుడుకు చర్యలు మరింత తీవ్రమైన సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఇరాన్ ఒప్పందం నుండి తప్పుకుని దాని చమురు ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలు చమురు మార్కెట్లను అస్తవ్యస్తం చేస్తున్నాయి. చైనాతో వాణిజ్య యుద్ధం మొత్తం ప్రపంచ మార్కెట్లనే కుదిపేస్తున్నాయి. జూన్‌లో జపాన్‌లోని ఒసాకా పట్టణంలో జరిగిన 'జి 20' శిఖరాగ్ర సమావేశం వారు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలే ఎజెండాగా చర్చించింది. కానీ, అంతర్గతంగా అమెరికా, చైనా దేశాల మధ్య రగులుతున్న వాణిజ్య యుద్ధానికి తాత్కాలిక విరామం పలకడం మినహా సాధించింది పెద్దగా ఏమీ లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కార్పొరేట్ లాభాలు కొనసాగించడానికి పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేయడమే కాకుండా ద్రవ్య మార్కెట్లలో చట్టా వ్యాపారాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాయి. దీనివల్ల మరోమారు కృత్రిమ బుడుగ పగిలిపోయి తీవ్రమైన ఆర్థిక పతనం జరిగే ప్రమాదం ఉందని బూర్జువా ఆర్థికవేత్తలే హెచ్చరిస్తున్నారు. పాలకవర్గాల వైరుధ్యాల నుండి ముందుకు వచ్చిన ట్రంప్ అభిశంసన ప్రక్రియ అక్కడితోనే ముగియకుండా మొత్తం సామ్రాజ్యవాదుల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ అమెరికాలోను, ప్రపంచంలోను ప్రజా ఉద్యమాలు మరింత ప్రజ్వరిల్లినప్పుడే అంతిమంగా సామ్రాజ్యవాదాన్ని మట్టుబెట్టగలుగుతాం. ★

### యూదు దురహంకార నేత నెతన్యాహూ అధికారం ముగిసినట్టే!

# ఇజ్రాయిల్‌లో రాజకీయ సంక్షోభం

2009 నుంచి ఇజ్రాయిల్ ప్రధానిగా ఉన్న బెంజిమన్ నెతన్యాహూ నేతృత్వంలోని లికుడ్ పార్టీ సెప్టెంబర్ 17న జరిగిన పార్లమెంట్ (నెస్సెట్) ఎన్నికల్లో మెజారిటీని కోల్పోవడం యూదుల ప్రాబల్యం ఉన్న దేశంలో ముఖ్యమైన పరిణామం.

పశ్చిమాసియాలో అమెరికా చేస్తున్న యుద్ధాలన్నిటికీ ఇజ్రాయిల్ కీలకమైంది. పాలస్తీనా ప్రజలను అణచివేయడానికి ఇజ్రాయిల్ ఎన్నో దాడులు చేసింది. ఇప్పటికీ చేస్తోంది. పాలస్తీనాతో ఇజ్రాయిల్ అనుసరించే విధానం ప్రభావం కూడా ఇజ్రాయిల్ ఓటర్లపై ఉండకపోదు.

ఇజ్రాయిల్‌కు సుదీర్ఘకాలం ప్రధానిగా పని చేసిన యూదు దురహంకార నేత నెతన్యాహూకు పార్లమెంట్ (నెస్సెట్) ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయిల్ రాజకీయాల్లో మళ్లీ అనిశ్చిత పరిస్థితే తలెత్తింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. ఈ ఏడాది అక్కడ ఎన్నికలు జరగడం ఇది రెండోసారి. గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లోనూ స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. ఈ ఏడాది అక్కడ ఎన్నికలు జరగడం ఇది రెండవసారి. గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లోనూ స్పష్టమైన మెజారిటీ రానందున నెతన్యాహూ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. ఈ కూటమి నుంచి లిబర్మన్ నాయకత్వంలోని బిటెన్యూ పార్టీ వైదొలగడంతో ఐదునెలల వ్యవధిలోనే మళ్లీ ఎన్నికలు జరిగాయి. తుది ఫలితాల ప్రకారం నెతన్యాహు నేతృత్వంలోని మితవాద కూటమి మెజారిటీకి 6 స్థానాలు తక్కువగా అంటే 55 స్థానాల వద్ద చతికిలపడింది.

ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత నెతన్యాహూకు ఎంతో అండగా నిలిచాడు. దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న విధానాల కొనసాగింపులో భాగంగానే నెతన్యాహూ కోసం ఆయన జెరుసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్లు ప్రకటించాడు.

మరోవైపు నెతన్యాహూపై దేశంలోనే అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. జర్మనీతో చేసుకున్న రక్షణ ఒప్పందాల్లో ఆయన కుటుంబ సభ్యులు లబ్ధిపొందారనే ఆరోపణలు వచ్చాయి. ఆయన భార్య సారా మీదా ఉన్న అవినీతి ఆరోపణల కేసులను కొట్టివేయడానికి అటార్నీ జనరల్‌కు లంచం ఆశచూపడం తదితర ఆరోపణలు నెతన్యాహూ మీద వచ్చాయి. మరోవైపు తనకు అనుకూలంగా మీడియాలో ప్రచారానికి లంచాలివ్వడం సంచలనం కలిగించింది. ఈ ఆరోపణల కేసులు కొన్ని న్యాయస్థానాల్లో విచారణ దశలో ఉండగా, మరికొన్నింటిలో దర్యాప్తు కొనసాగుతున్నది. వివిధ కేసుల్లో ఇరుక్కున్న నెతన్యాహూ ఈ ఎన్నికల్లో విజయం సాధించి ప్రధాని పదవి చేపట్టాలని ఎంతగానో ఆశించాడు. తద్వారా ప్రాసిక్యూషన్ నుంచి బయటపడాలని ఆయన ఆరాటం. ఫలితాలు ప్రతికూలంగా ఉండడంతో ఏదో విధంగా ప్రధాని అయ్యేందుకు ఆయన విశ్వప్రయత్నాలు చేశాడు.

సెంటరిస్ట్ గాంట్జ్ నేతృత్వంలో బ్లూ అండ్ వైట్, లికుడ్ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కావాలని, నెతన్యాహూ కూటమిలో ఉన్న మతవాద పార్టీలను పక్కన పెట్టాలని లిబర్మన్ కోరుకుంటున్నాడు. గత డిసెంబర్ నుండి అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న నెతన్యాహూ నిజానికి జైలు ఊచలు లెక్కబెట్టాల్సిందే!.

ఇజ్రాయిల్‌కు రక్షణ రంగంలోనే కాకుండా, సాంకేతిక రంగంలో అమెరికా సహకారం అవసరం. అయితే, ఇజ్రాయిల్ అమెరికాతో అతి సన్నిహితంగా ఉండడాన్ని స్వదేశంలో ట్రంప్ వ్యతిరేక కూటమి వ్యతిరేకిస్తున్నది. పాలస్తీనీయులపై దాడుల విషయంలో ఇజ్రాయిల్ నాయకులందరిదీ ఒకే పంథా... అందుకే, పాలస్తీనా బూచి చూపి అందరినీ తనవైపు తిప్పుకునేందుకు రాజకీయ దురంధరుడైన నెతన్యాహూ ప్రయత్నిస్తున్నాడు.

నెతన్యాహూకు గతం కన్నా ఓట్లు, సీట్లు తగ్గడం ఆయన పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పుగా మిగిలిన పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. ఈ ఫలితాలు నెతన్యాహూను మరింత అప్రదిష్ట పాల్జేశాయి. ఇజ్రాయిల్ రాజకీయాల్లో నెతన్యాహూ శకం ముగిసినట్టేనని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ రక్షకుడిగా, యుద్ధోన్మాదిగా పేరొందిన ఆయనకు ఓటర్లు గట్టి దెబ్బకొట్టారు.

ఇజ్రాయిల్ ఎన్నికల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు నెతన్యాహూను నిరాశ పరిచేవిగా ఉన్నాయి. అమెరికా సంబంధాలు ఇజ్రాయిల్‌తోనేననీ, వ్యక్తులతో కాదని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

ఇజ్రాయిల్ అధ్యక్షుడు రెవిన్ రివ్లిన్ సమైక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 28 రోజుల గడువు ఇస్తూ సెప్టెంబర్ 25న నెతన్యాహూను సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బాధ్యత అప్పగించారు. అయితే గడువు ముగిసేలోగా ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత మెజారిటీ సాధించలేకపోతున్నానని అధ్యక్షుడు రివ్లిన్‌కు అక్టోబర్ 23 తెలిపాడు. మధ్య ప్రాచ్యంలో అమెరికా పెంచిపోషించిన ఇజ్రాయిల్ నేత నెతన్యాహూ ఓటమి, ఒకరకంగా అమెరికా యూదు అహంకార ఓటమే. ★

## కార్పొరేట్ అనుకూల మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితమే

# ఆర్థిక మాంద్యం

సామ్రాజ్యవాద దోపిడీకి దేశాల సరిహద్దులు అడ్డురాకుండా చూడటమే ప్రపంచీకరణ. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట పేద, సంపన్న దేశాలను సమాన షరతులపై పోటీపెట్టి సంపన్న దేశాలు లాభపడుతున్నాయి. పెట్టుబడి అనుకూల విధానాలను అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వం ప్రపంచీకరణ విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలు అనుసరిస్తూ భారత ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి తీసుకుని వెళ్ళింది.

పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో అరాచకం వుంటుంది. మార్కెట్ ఆటు పోట్లు వుంటాయి. ఉత్పత్తిలో సంక్షోభం, మాంద్యాలు తప్పని సరిగా వుంటాయి. పెట్టుబడిదారీ విధానం అంటేనే లాభాల వేట. ఉత్పత్తి ఒక క్రమపద్ధతిలో ప్రణాళిక ప్రకారం జరగదు. ప్రజల అవసరాలను, ప్రయోజనాలను, కొనుగోలు శక్తిని పెట్టుబడిదారుడు దృష్టిలో పెట్టుకోడు. ఉత్పత్తి పెరిగి మర్కెట్‌లో డిమాండ్ తగ్గితే వెంటనే ఉత్పత్తిని తగ్గిస్తాడు. కార్మికులని తొలగిస్తాడు. నిరుద్యోగం పెరుగుతుంది. ప్రజలకు అవసరాలున్నా కొనుగోలుశక్తి ఉండదు. మార్కెట్‌లో డిమాండ్ కంటే వస్తువుల సరఫరా ఎక్కువగా వుంటుంది. ఉత్పత్తి అయిన సరుకులు అమ్మకం కాని కారణంగా ఉత్పత్తి సామర్ధ్యాన్ని కుదించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. దీనినే ఆర్థిక మాంద్యం అంటారు. ఆర్థిక మాంద్యం కారణంగా పరిశ్రమలు మూతపడతాయి. మాంద్యం పెరిగితే వచ్చేది సంక్షోభం.

భారత దేశానికి చెందిన అన్ని సహజ, మానవ వనరులను కార్పోరేట్ రంగం యద్ధేచ్ఛగా కొల్లగొట్టేందుకు, పూర్తిగా వినియోగించుకొనేందుకు వీలుగా తలుపులు తెరిచి భారతదేశాన్ని పెట్టుబడిదారుల అనుకూల ఆర్థిక వ్యవస్థగా మారుస్తున్నారు. రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక వర్గ స్వభావాన్ని పాలకులు అనుసరిస్తున్నారు.

1990 నుంచి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలుతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను శాసించే నిర్ణయాత్మక శక్తిగా రూపాంతరం చెందింది. ఉపాధి రహిత వృద్ధి నుండి అవిరామంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం వరకు, కార్పొరేట్ రంగం దేశ వనరులను పెద్ద ఎత్తున లూటీ చేయడం వలన ఆర్థిక అస్థిరత, సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భారత ప్రజలు ఈనాడు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలన్నీ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల నుండే ఉత్పన్నమవుతున్నాయి.

2014 నుండి ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోదీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ వర్గాలకు దాసోహం అయ్యింది. క్రోనీకాపిటలిజం అక్రమ లావాదేవీలతో సంచిత పెట్టుబడితో చెట్టాపట్టాలేసుకుంటూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలతో మోదీ ప్రభుత్వం మాంద్యం వలయంలో కూరుకుపోతుంది. ప్రభుత్వం కార్పొరేటు లాభాలకోసం అహర్నిషలు పాటుపడుతూ, వారి పట్ల నిబద్ధతతో పని చేస్తుంది. గత ఆరు బడ్జెట్లను పరిశీలిస్తే ప్రభుత్వం ఎవరి కొమ్ముకాస్తుందో సులువుగానే బోధపడుతుంది. మొత్తం ద్రవ్య రంగం పతనానికి గురైన ప్రస్తుత ద్రవ్యసరఫరా పరిస్థితి గత 70 యేళ్ళలో ఎప్పుడూ ఎదుర్కోలేదు అని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్ స్వయంగా అంగీకరించాడు.

భారత ఆర్థిక వ్యవస్థ రోజురోజుకీ సంక్షోభంలోకి కూరుకుపోతోంది. ఉత్పత్తి, ఉపాధి రంగాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. నిరుద్యోగం 45 సంవత్సరాల కిందటి శాతానికి గరిష్టానికి చేరింది. ఆర్థికాభివృధి రేటు 6 ఏండ్ల కనిష్టానికి 5.2 శాతానికి పడిపోయింది.

సమస్య కొనుగోలులో ఉంటే ప్రభుత్వం పరిష్కారం సరఫరాలో చూస్తుంది. దీని ద్వారా సమస్య మరింత జటిలమవుతుంది. ప్రజల కొనుగోలు శక్తి పెంచి డిమాండ్ పెరగడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కీలక రంగాల్లో పెట్టుబడులు, డిమాండ్, వృద్ధి రేటు మందగించడంతో 2019-20లో భారత జీడీపీ వృద్ధి రేటు 5 శాతానికి మించకపోవచ్చని ఎస్‌పీఐ ఆర్థిక పరిశోధనా విభాగానికి చెందిన ఎకో ర్యాప్ తన తాజా నివేదికలో తెలిపింది. ఇది 2019-20 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 6.1 శాతాని కంటే తక్కువ. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆసియన్ డవలప్‌మెంట్ బ్యాంక్, ప్రపంచ బ్యాంక్‌లతో పాటు ప్రఖ్యాత రేటింగ్ సంస్థలు మూడీస్, క్రిసిల్‌లు కూడా ఇటీవల కాలంలో భారత వృద్ధి అంచనాలకు కోత పెట్టడమే ఆర్థిక సంక్షోభం ముంచుకోస్తుందనడానికి నిదర్శనం.

అధికారిక గణాంకాల ప్రకారం వరుసగా ఆరు త్రైమాసికాలలో భారతదేశపు స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పతనం 8.0, 7.0, 6.6, 5.8, 5.5, 4.5 శాతంగా ఉన్నది. జీడీపీ వృద్ధి రేటు పడిపోతున్నదని ఈ సంఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. నాలుగు ఆర్థిక సంవత్సరాలలో వరుసగా వివిధ రంగాలలో పతనం ఇలా ఉంది. 2016-17, 2017-18, 2018-19, 2019 అక్టోబర్ వరకు వ్యవసాయ రంగంలో 6.3, 5.0, 2.9, 2.1; పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో 4.6, 4.4, 3.9, 2.4 ; కీలక రంగాలలో 4.8, 4.3, 4.4, 0.2; సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పరపతి సదుపాయం 0.9, 0.4, 2.3, 2.5; తయారీ రంగంలో 1.2, 1.7, 1.4, 0.7 ; ఈ లెక్కలు మన ఆర్థిక పురోగతి సక్రమంగా లేదని చెపుతున్నాయి. కుటుంబాల స్థాయిలో వినియోగం నేషనల్ సాంపుల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్) సర్వే ప్రకారం తగ్గిపోతున్నట్లు అర్థమవుతుంది. గ్రామీణ వేతనాలు పడిపోయాయి.

ఉత్పత్తిదారులకు ముఖ్యంగా రైతాంగానికి లభించే గిట్టుబాటు ధరలు ప్రభుత్వం చెప్పినట్లు ఒకటిన్నర రెట్లు పెరగకపోగా తగ్గిపోయాయి. రోజు కూలీలకు నెలలో 15 రోజులు మాత్రమే పని దొరుకుతుంది. మన్నికైనవి, మన్నిక కానివి రెండింటి అమ్మకాలు తగ్గిపోయాయి. టోకు ధరల ద్రవ్యోల్బణం సూచీ 1.92 శాతానికి పెరిగింది.

2019 అక్టోబర్ నాటికి కీలక రంగాల వృద్ధి 11 నెలల కనిష్టానికి చేరిందని ప్రభుత్వం ప్రకటించింది. పారిశ్రామిక రంగం వృద్ధి రేటు 7 నుంచి 2 శాతానికి, గనుల రంగం వృద్ధి రేటు 6.5 శాతం నుండి 1.6 శాతానికి, వ్యవసాయ రంగం 5 శాతం నుండి 2.7 శాతానికి ఒక సంవత్సరకాలంలో తగ్గినట్లు నివేదికలు చెపుతున్నాయి. నిర్మాణ రంగంలో స్టీలు, సిమెంట్, సర్వీసు రంగాల్లో కూడా వృద్ధి గతంతో పోల్చితే మందగించింది. ఆర్థిక వ్యవస్థలోని ఈ మందగమనం ఉపాధి రంగం పై ప్రతికూల ప్రభావం చూపి నందువలన 95 లక్షలకు పైగా కార్మికులు ఉపాధి కోల్పోయారు. భారీయంత్ర పరికరాల విక్రయం చాలా కాలంగా మందకొడిగానే వుంది. అంటే దేశంలో కొత్త పరిశ్రమల స్థాపన పెరగడం లేదు. ప్రపంచీకరణ విధానాలు అమలైన తరువాత పారిశ్రామిక వృద్ధి తగ్గింది. చిన్న, మధ్య తరగతి వ్యాపారులను, కుటీర పరిశ్రమలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంచేసే విధంగా, వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి) అమలు చేయటంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. వారంతా మనుగడ కోసం బడా పరిశ్రమల్లో కార్మికులుగా మారారు.

దేశంలో ధరలు వేగంగా పెరుగుతున్నాయి. నిత్యావసర సరుకులు కూరగాయలు, పప్పులు, చేపలు, మాంసం ధరలు అనేక రెట్లు పెరిగాయి. వినియోగదారుల రీటైల్ ద్రవ్యోల్బణం సూచి 3.21 శాతంగా నమోదయ్యింది.

మోదీ ప్రభుత్వం గత 6 ఏళ్ళలో ప్రభుత్వ రంగ సంస్థలను, బ్యాంకులని నిర్వీర్యం చేసింది. దేశంలో దాదాపు 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పించే ఆటోమొబైల్ రంగంలో రెండు దశాబ్దాలుగా అమ్మకాలు తగ్గిపోయాయి. ఈ సంవత్సర కాలంలోనే 26 శాతం అమ్మకాలు తగ్గాయి. చాలా పరిశ్రమల్లో తమ ఉత్పాదక శక్తిలో 70 శాతం మాత్రమే ఉపయోగించుకుంటున్నాయి. వాహనాలు తయారు చేసేవారు, విడి భాగాలు తయారు చేసేవారు, డీలర్లు కలిసి గత 3 నెలల కాలంలోనే 3 1/2 లక్షల మందిని ఉద్యోగాల నుండి తొలగించారు.

ఆర్థిక మాంద్యం వాస్తవమేనని రిజర్వ్ బ్యాంకు వార్షిక నివేదికలో తెలిపింది. ఉత్పత్తి, వాణిజ్యం, హోటళ్ళు, రవాణా, నిర్మాణం, వ్యవసాయరంగాలలో ఆర్థికమాంద్యం నెలకొందని ఆర్.బి.ఐ విధాన సమీక్షలో తెలిపింది. ప్రజల ఆదాయాలు పెంచే చర్యలు తీసుకోకపోతే మాంద్యం మరింత పెరుగుతుంది. ఉత్పత్తి రంగం దెబ్బతినడానికి పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి ప్రధాన కారణం అని ఆర్.బి.ఐ మాజీ గవర్నర్లు సుబ్బారావు, రఘురామరాజన్, అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు అమర్త్యసేన్, పాల్‌క్రుగ్‌మన్‌లు స్పష్టం చేశారు. పెద్దనోట్ల రద్దుతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. ద్రవ్య కొరత వలన 6.8 లక్షల కంపెనీలు (36 శాతం) మూతపడ్డాయి. రైతులను, సాధారణ ప్రజలను కష్టాల్లోకి నెట్టింది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు కోలుకోని విధంగా దెబ్బతిన్నాయి.

మరో పక్క కార్పొరేట్లను ఆదుకోడానికి సంపన్న వర్గాల పై 14 వేల కోట్ల రూపాయల సర్ ఛార్జీని ఉపసంహరించింది. పెద్ద, పెద్ద కార్పొరేట్‌లు బ్యాంకులకు ఎగవేసిన వేలకోట్ల రూపాయలను రద్దు చేస్తూ, మరొక వైపు బ్యాంకులకి పెట్టుబడులు సమకూర్చడానికి 70 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం యిస్తుంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బ్యాంకుల ఏకీకరణ కార్పొరేట్లకు భారీ రుణాలు ఇచ్చేందుకే అనేది స్పష్టమే. “ప్రజల కోసం అన్ని బ్యాంకుల జాతీయకరణ” అన్న1969 నాటి లక్ష్యం వదిలేసి, పెద్దల కోసం నేడు ఏకీకరణ అమలు చేస్తున్నారు.

బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాల్లో వసూలుకు సాధ్యం కాని లేదా వసూళ్లు సంక్లిష్టంగా మారిపోయిన రుణాల వాస్తవ పరిమాణం సుమారు 10 లక్షల కోట్లను దాటిపోయింది. నిరర్థక ఆస్తులు 2014కు ముందుతో పోలిస్తే 8 రెట్లు పెరిగింది. బ్యాంకుల్ని నిండా ముంచే 525 మంది మొండి బకాయిదారులకు ఐదేళ్లలో రద్దు చేసిన అప్పుల మొత్తం విలువ 5.17 లక్షల కోట్లు ఉందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల బెయిలవుట్ల కోసం, ప్రభుత్వ ఆదాయం కొరతను తీర్చుకోవడం కోసం ఎల్‌ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర ఉన్న ప్రజల సొమ్మును, ప్రజల జీవిత కాల పొదుపు నిధులను దారి మళ్లించాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. లక్షలాది మంది ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, పింఛన్‌ను, ఇన్సూరెన్స్ పథకాల నిధులను తీసుకునే ప్రయత్నం చేస్తున్నది. ఎంప్లాయిస్ పాప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్) మొత్తం సుమారు రూ. 10 లక్షల కోట్ల కార్పస్ నిధి ఉంది. ప్రభుత్వం ఈ డబ్బును కూడా వాడుకోవడం మొదలెడితే దేశంలో కోట్లాది మంది ఉద్యోగుల భద్రతకు మునుపెన్నడూ లేనంత ముప్పు వాటిల్లుతుంది.

రైల్వే, ఎయిర్ ఇండియా ,ఎంటిఎన్ఎల్, డిఎస్ఎన్ఎల్, బిపిసిఎల్ వంటి ప్రధాన ప్రభుత్వ సంస్థలతో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించ పూనుకుంది. దీనివల్ల ఉద్యోగాల నుంచి తొలగింపు భారీగా సాగుతుంది. నిరుద్యోగం దారుణంగా పెరుగుతుంది. అంతకంటే ముఖ్యంగా ఈ తతంగం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తుంది. అది దేశానికి, దేశ ప్రజల సంక్షేమానికి కూడా నష్టదాయకం.

పాలకులు పెట్టుబడిదారులకు, భూస్వామ్య పెత్తందారి శక్తులకు బడ్జెట్‌లో నుంచి రాయితీల రూపంలో దోచిపెట్టడం కొత్తకాకపోయినా ఇప్పుడు స్పష్టంగా తమ అసలు ముఖాన్ని బయట పెట్టుకుంటున్నారు. విదేశీ, స్వదేశీ అప్పులు చేయడం, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రభుత్వ వాటాల్ని ఆశ్రితులకు తెగనమ్మడం చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం తన కార్పొరేట్ యజమానుల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగాఅమ్మేస్తోంది.

చివరికి రిజర్వుబ్యాంకు మిగులు నిధుల్ని తరలించుకెళ్లి మరీ వారికి కట్టబెడుతున్నారు.ఏదైనా అనిశ్చిత పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే భారత రిజర్వ్ బ్యాంకు మిగులునిధులను ఉపయోగించాల్సి వుంటుంది. కానీ, ఇప్పుడు మోడీ ఆ నిధులను (1.76 లక్షల కోట్ల రూపాయలను) ఉద్దీపనల కొరకు వాడుకుంటున్నాడు. ఇది సెంట్రల్ బ్యాంకు ప్రతిపత్తికి తీవ్రమైన విఘాతం. దాని స్వతంత్రతను క్రమంగా హరిస్తున్నారు. ప్రభుత్వం ఆర్‌బిఐ ని సొంత కోశాగారంగా చూడటం వలన దేశంలో అనేక ద్రవ్య సేవలు దారుణంగా అపాయంలో పడతాయి. బ్యాంకుల్ని విలీనం పేరుతో ప్రైవేటీకరణ వైపు నెట్టేశారు.

రూపాయ విలువ 2014 సెప్టెంబర్‌లో ఒక డాలర్‌కి 59.44 రూపాయలుగా ఉంటే, 2019 నవంబర్‌లో 72 రూపాయలకు చేరింది. పరోక్షంగా ప్రజలపైన ఈ రూపాయి భారం పెరుగుతూనే ఉంది. అయినా పాలకులు ప్రతి బడ్జెట్లో వడ్డించే పరోక్ష పన్నులు ఏమాత్రం తగ్గడం లేదు.

2004 సెప్టెంబర్ తర్వాత ప్రైవేటు పెట్టుబడులు ఇంత కనిష్ఠ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. 2017-18లో కొత్త పెట్టుబడి 10.15 శాతం క్షీణించి రూ. 1.65 లక్షల కోట్లకు దిగజారాయని ఆర్‌బిఐ తెలిపింది. 2004-05 నుంచి 2011-12 మధ్య కాలంలో ఈ వృద్ధిరేటు సగటున 10 శాతం ఉంది. పరిశ్రమలకు బ్యాంకుల రుణవితరణ 2010 సంవత్సరంలో 24.4 శాతం ఉండగా 2019 నాటికి 6.9 శాతానికి తగ్గిందని కూడా ఆ నివేదిక తెలిపింది. పారిశ్రామిక రంగంలో కొత్త పెట్టుబడుల నిరాసక్తత ఎంత తీవ్రంగా ఉన్నదో ఈ గణాంకాలు దర్పణం పడుతున్నాయి.

2010-11 లో జీడీపీలో 15.4 శాతం ఉన్న ప్రభుత్వ స్థూల పెట్టుబడులు 2018-19 నాటికి 12.2 శాతానికి తగ్గిపోయాయి. ఇదే కాలంలో రెవెన్యూ వ్యయాలు 13.4 శాతం నుంచి 10.6 శాతానికి క్షీణించాయి.

ప్రభుత్వ ఆదాయాలు 2010-11లో జీడీపీలో 10.1 శాతం నుంచి 2018-19 నాటికి 8.2 శాతానికి క్షీణించినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. ఆదాయంలో ప్రధాన భాగం అయిన పన్ను వసూళ్లు అదే సమయంలో 7.3 శాతం నుంచి 6.9 శాతానికి, పన్నేతర ఆదాయాలు 2.8 శాతం నుంచి 1.3 శాతానికి క్షీణించాయి.

వృద్ధిరేటు క్షీణత ప్రజల సంక్షేమం మీద తీవ్ర ప్రభావం చూపుతోంది. నిరుద్యోగాన్ని పేదరికాన్ని పెంచుతోంది. పెరుగుతున్న నిరుద్యోగం, పనిదినాల్లో కోత, వేతనాల్లో కోత, ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలో కోతతో రైతాంగం దివాలాతీయడం, కార్మికుల చట్టాల సరళీకరణతో కార్మికుల జీవితాలు నిరంతరం అభద్రతలోకి వెళుతున్నాయి.

వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణం గిరాకీ తగ్గడం. అది గత రెండు సంవత్సరాలుగా క్రమేపీ తగ్గుతోంది. ప్రభుత్వ వ్యయం పెరిగినా వినియోగం తగ్గడంతో వృద్ధిరేటు పతనావస్థలో ఉంది. ప్రైవేటు పెట్టుబడులు స్తంభించిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల మూలధన సమీకరణ మొదటి త్రైమాసికంలో 4 శాతం పెరిగితే రెండవ త్రైమాసికంలో 1 శాతం మాత్రమే పెరిగింది. కార్పొరేట్ సంస్థలు రుణాలు చెల్లించకపోవడం, బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడడం వల్ల, బ్యాంకింగేతర రంగంలో సంక్షోభం కారణంగా పెట్టుబడుల లభ్యత తగ్గింది. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఎటూ ఉంది. సుదీర్ఘకాలం పాటు గిరాకీ తగ్గితే దీర్ఘకాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం కూడా తగ్గుతుంది. పెట్టుబడులు పెట్టడంలో జాప్యం జరుగుతుంది. దీర్ఘకాలికంగా అభివృద్ధి కుంటుపడుతుంది.

సెట్టుబడిదారీ విధానంలో అనివార్యంగా ఏర్పడే 'శ్రమ విభజన' 'సంపద పంపిణీ'ల మధ్య ఏర్పడిన అంతరం కారణంగా ఉత్పత్తి, వినియోగం ప్రక్రియలో సహజంగానే సంక్షోభాలు తలెత్తుతాయి. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం పారిశ్రామిక పెట్టుబడి నుంచి ద్రవ్య పెట్టుబడిగా మారిన దశలో ద్రవ్య విధానాలే ప్రధాన పాత్ర వహిస్తోన్నాయి.అత్యధిక ప్రజానీకం కొనుగోలు శక్తి ఘోరంగా పడిపోవడం వల్ల ఈ ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. కనుక ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెంచాలి. దేశీయ గిరాకీ పెరిగితే మూతపడిన పరిశ్రమలు కోలుకుంటాయి. ఉత్పత్తిలో కార్మికుల వేతనాల వాటా పెంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించే పన్నుల విధానం ఉండాలి. ధనికుల మీద, కార్పొరేట్ కంపెనీల మీద అధిక పన్ను, సామాన్య ప్రజలపై నామమాత్రపు పన్ను ఉండాలి. కార్పొరేట్ కంపెనీలకు ఇస్తున్న పన్ను రాయితీలు ఉపసంహరించాలి. ప్రభుత్వం విద్య, వైద్యం పై అధికంగా ఖర్చు పెట్టాలి. ఉచిత విద్య, వైద్య సౌకర్యాలపై ప్రభుత్వం అధిక పెట్టుబడులు పెట్టాలి. రైతుకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం ద్వారా ఆహార ఉత్పత్తులను పెంచాలి. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి వాటి వద్ద ఉన్న నగదు నిల్వలతో ఉత్పత్తి కార్యకలాపాలను విస్తృతం చేసి ఉపాధి అవకాశాలు పెంచాలి. ఉపాధి కల్పనకు పెద్ద పీట వేయాలి. భూ సంస్కరణలు అమలు చేయాలి. ప్రజలకు కనీస సామాజిక పెన్షన్ సౌకర్యాలు కల్పించాలి. ఈ ప్రత్యామ్నాయ విధానాలను పాలక వర్గాలు అమలు చేయకుండా ఆర్థిక సంక్షోభం నుండి బయటపడలేదు.

దశాబ్దాలుగా భూసంస్కరణలు, ప్రభుత్వ భూముల పంపిణీ, భూదానోద్యమం, అటవీ భూముల గుర్తింపు, భూమి హక్కుకు రక్షణ కల్పించే ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ దేశంలో చేపట్టిన అనేక సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల ప్రకారం తెలంగాణలో 56 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 76 శాతం గ్రామీణ కుటుంబాలకు భూమి లేదు.

దేశవ్యాప్తంగా పిల్లల్లో మూడోవంతు పౌష్టిక ఆహార లోపంతో కునారిల్లుతున్నారన్న జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 37.5 శాతం బలహీనంగాను, 38.4 శాతం వయస్సుకి తగ్గ పెరుగుదల లేక, 21శాతం ఎత్తుకు తగ్గ బరువులేకుండా ఉన్నారని అర్థమవుతుంది. పిల్లల శారీరక, మానసిక, బుద్ధికుశలతల వికాశానికి ఆరోగ్య కరమైన సమతుల ఆహారం ఉండి తీరాలి. 19 కోట్ల జనావళి రోజువారీ పస్తులతో జీవిస్తున్న దేశం మనది. భావితరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే సూచనలు కానరావడం లేదు.

దేశంలో గిరాకీ సంక్షోభం ఉంటే సరఫరా సంక్షోభమన్నట్లు కేంద్రం నమ్మించే ప్రయత్నం చేస్తోంది. పన్నులు, రాయితీలు, డబ్బు రూపంలో కార్పొరేట్లకు మూడున్నర లక్షల కోట్ల రూపాయలను అందించింది.

2019 సెప్టెంబర్ 23న కార్పొరేట్ పన్ను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన స్టాక్ మార్కెట్లో నమోదయిన టాప్ ఒక వెయ్యి కంపెనీల పన్ను ఆదా మొత్తం 37 వేల కోట్ల రూపాయలు ఉంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థలోను మందగమనాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపడుతున్న ముఖ్యమైన చర్యల్లో ఇది ఒకటి. దీనితో పన్ను రేటు 35 నుంచి 25 శాతానికి తగ్గుతుంది. కొత్త ఉత్పత్తి కేంద్రాలకు సంబంధించి పన్ను రేటును 15 శాతంగా నిర్ధారించడం వలన గ్లోబల్ కాపిటల్‌ను ఆకర్షించడానికి, ఇన్వెస్ట్‌మెంట్ సైకిల్‌ను ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుంది అని ప్రభుత్వం చెబుతుంది.

వినియోగం పెరిగితేనే అందుకు అనుగుణంగా ఉత్పాదక రంగాలు బలపడ్తాయన్నది సహజ ఆర్థిక సూత్రం. ప్రస్తుత సంక్షోభానికీ, ప్రజల మధ్య అసమానతలు పెరగడానికీ ప్రధాన కారణం ప్రభుత్వ రంగాన్ని విస్మరించి అన్నింట్లో ప్రైవేటు పెట్టుబడులకు అనుమతించడమేనన్నది అనుభవం చెపుతున్న సత్యం. కొనుగోలు శక్తి పెంచకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా బూడిదలో పోసిన పన్నీరే. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల అవసరాలను బట్టిగాక, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యూహాలు, ప్రణాళికలు తయారు చేసుకుంటేనే ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది. కానీ ఆ రీతిన మోదీ ప్రభుత్వం ఆ పని చేస్తుందనుకోవడం అత్యాశే.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలులో 1991 నుండి భారత పాలక వర్గాలు ద్రవ్య పెట్టుబడికి దాసోహం చేస్తూ సంక్షేమానికి తిలోదకాలిచ్చి మార్కెట్ స్వేచ్ఛను ప్రోత్సహించాయి. ఫలితంగా ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరిగాయి. ప్రపంచంలోనూ, భారతదేశంలోనూ అతి కొద్ది మంది కుబేరులు కాగా అత్యధిక శాతం ప్రజలు దారిద్ర్యపు అంచుల్లోకి తోసివేయబడుతున్నారు. మహా ధనవంతుడుగా ఐఐఎఫ్ఎల్, వెల్త్ హొరూన్ ఇండియా రిచ్‌లిస్ట్ 2019లో గల మొత్తం 953 మంది లక్ష్మీపుత్రుల పేర్లలో ముఖేష్ అంబానీ టాప్‌లో వున్నాడు. ఇది 8వ సారి. 3 లక్షల 80 వేల 700 కోట్ల రూపాయల ఐశ్వర్యంతో ఇండియాలోనే అత్యంత ధనవంతుల్లో టాప్ పొజిషన్‌లో వున్నాడు.

పాలకులు అనుసరించిన కార్పొరేటు అనుకూల విధానాల వలన మాంద్యం పరిస్థితులు ఏర్పడ్డాయి. దాని నుండి బయట పడ్డానికి మౌలిక రంగంలో, సామాజిక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి. ఉపాధి అవకాశాలు పెంచాలి. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను అవలంభించాలి. పబ్లిక్ రంగంలో పెట్టుబడులు పెంచి ఆర్థిక వ్యవస్థకి చేయూతనివ్వాలి.

సేవా రంగంలో, పారిశ్రామిక రంగంలో పని చేస్తున్న కోట్లాది కార్మికుల, ఉద్యోగుల కొనుగోలు శక్తి పెంచడానికి వారి అతి తక్కువ ఆదాయాలకు కారణమైన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలి. జీఎస్టీ పేరుతో పరోక్ష పన్నులను తక్షణం తగ్గించాలి. అప్పుడే ధరలు దిగి వస్తాయి. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వ్యవసాయ ప్రధాన భారతదేశంలో ఉత్పత్తి పరికరాలపై రాయితీ, వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం వంటివి చేయాలి. పెద్ద పరిశ్రమల స్థానంలో శ్రమ ఆధారిత పరిశ్రమల్ని ప్రోత్సహించడం ద్వారా, శ్రమజీవుల నిజవేతనాలు పెంచి, ప్రజల వినియోగ సామర్థ్యాన్ని పెంచాలి. సంపద సృష్టికర్తలు ప్రజలే. సామ్రాజ్యవాద అనుకూల విధానాలను పక్కన పెట్టి నిజమైన ఆర్థికాభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన చేసేందుకు విధానపరమైన మార్పులు చేయడం నేటి తక్షణ కర్తవ్యం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 1930ల నాటి తీవ్ర సంక్షోభం లాంటి పరిస్థితుల్లోకి వెళుతున్న క్రమంలో భారతదేశంలో దాని ప్రభావం ముందుగానే కనబడింది. నేడు దేశంలో మాంద్యం పరిస్థితి సర్వత్రా వ్యాపించింది. పరిశ్రమల నుండి లక్షల సంఖ్యలో కార్మికులు బయటికి నెట్టివేయబడుతున్నారు. ఇదంతా పాలక వర్గాల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితమని కార్మికులు, రైతులు గుర్తించి, దాని మీద తమ పోరాటాన్ని ఎక్కుపెట్ట గలిగినప్పుడే ఈ సంక్షోభానికి పరిష్కారం దొరుకుతుంది. ఇటువంటి ఆర్థిక సంక్షోభ పరిస్థితులను, రాజకీయ సంక్షోభంగా అభివృద్ధి చేయగల విప్లవ శక్తులను నిర్మాణయుతం చేసుకోవడం నేటి ప్రస్తుత కర్తవ్యం.

సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ వర్గాల రాజ్యాన్ని కూల్చాలంటే అసమానతలను పెంచిపోషించే బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువావర్గాల ఆర్థిక పునాదిని పెకలించాలి. ప్రపంచంలో ఎక్కడా సంక్షోభాలు లేని నూతన సమాజాన్ని నిర్మించాలి. ★

## ప్రపంచీకరణ కొత్తరూపం ఆర్‌సిఇపి

ఆర్‌సిఇపి అంటే ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం–స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందంలో భాగస్వామ్యం. ప్రపంచీకరణలో భాగంగా భారతదేశంతో కలిపి దాదాపు 16 దేశాల మధ్య వ్యాపార సయోధ్యను కుదుర్చుకోవడమే. ఆస్ట్రేలియా, బ్రూనే, కాంబోడియా, చైనా, ఇండోనేషియా, జపాన్, లావోస్, మలేసియా, మయన్మార్, న్యూజిల్యాండ్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, వియత్నాం, సౌత్ కొరియా దేశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. భారతదేశం కలిస్తే 16వ దేశం అవుతుంది. నవంబర్ 2012లో కాంబోడియాలో జరిగిన సమావేశంలో ఈ సయోధ్యకు పునాది పడింది. ఆర్థిక సరళీకరణల మరో విడతకు శ్రీకారం చుట్టే ప్రక్రియకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పడడంతో రైతాంగం, ఆ ఉత్పత్తుల మీద ఆధారపడే ఇతర శ్రామికులు కాస్తా ఊపిరి పీల్చుకున్నారు తాత్కాలికంగా.

**వ్యవసాయం మీద విష ప్రభావం:**

వ్యవసాయరంగం ఇప్పటికే విపరీతమైన కష్టాల్లో ఉంది. రైతుల ఆత్మహత్యలు, పగిలిన పాదాల రైతుల కాలినడకలు మనకు తెలిసిందే. గిట్టుబాటు ధరలు ఇప్పటికే పంట పండించే రైతుకు రావడం లేదు. సరయిన ధర దొరక్క పంటను రోడ్ల మీదకు విసిరేసిన సంఘటనలు ఎన్నో. దానికి తోడు, ఈ కొత్త ఒప్పందం గోరుచుట్టు మీద రోకటి పోటులా వ్యవసాయదారుడి మీద విపరీతమైన ఒత్తిడిని కలిగిస్తుంది. ప్రపంచమంతా మనదే అని దిగుమతి సుంకాలు మాయం చేసేస్తే, అత్యంత చవగ్గా దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులూ, పాల ఉత్పత్తులూ స్థానిక మార్కెట్‌లో స్థానిక ఉత్పత్తులు అమ్మకం కానివ్వకుండా వ్యవసాయరంగాన్ని అతలాకుతలం చేసేస్తాయి. వ్యవసాయరంగంలోనూ, పాడి పరిశ్రమలోనూ బహుళజాతి కంపెనీలు స్థానిక మార్కెట్‌లను మరింత శాసిస్తాయి. ప్రపంచంలోని సగం జనాభా ఈ ప్రాంతంలోనే ఉంది. ప్రపంచం వర్తకంలోని 40 శాతం వర్తకం ఈ ప్రాంతంలోనే నడుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం నిజంగానే జరిగితే, ప్రపంచంలోని అతి పెద్ద వ్యాపార ఒప్పందం అవుతుంది. ఇప్పటికే కుదేలయిన వ్యవసాయరంగం, ఆర్థికరంగం మరింత ఆటుపోట్లకు గురవుతాయి.

**పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం:**

ప్రపంచంలోని 51 శాతం పాడి వ్యాపారాన్ని ఈ దేశాలే నియంత్రిస్తున్నాయి. 45 శాతం పాల పొడుల వ్యాపారాన్ని, 38 శాతం బటర్ ఆయిల్ వ్యాపారాన్ని, 35 శాతం జున్ను వ్యాపారాన్ని, 31 శాతం వెన్న వ్యాపారాన్ని ఈ ప్రాంతంలోని దేశాలే నియంత్రిస్తున్నాయి.

ఆర్థిక వ్యవస్థలో ప్రపంచీకరణకు హారతి పట్టే ఆర్థికవేత్తలు చెబుతోన్న 'గ్రోత్' ఇప్పుడు కనిపించడం లేదు. నిరుద్యోగం పెరిగింది. 'ఆకలి'లో అడుగు వెనక్కి వేస్తోన్నా, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో మాత్రం భారతదేశం అడుగు ముందుకు వేస్తోంది. దిగుమతి సుంకాల సడలింపు ప్రతిపాదనలు కూడా ఈ ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల అనుకూల ప్రక్రియలో భాగమే. వీటి నుండి దేశానికీ, శ్రామిక వర్గానికీ నష్టాలే తప్ప ప్రయోజనం శూన్యం. 'మేక్ ఇన్ ఇండియా' అని ఒకవైపు చెబుతూ, మరోవైపు స్వదేశీ వస్తువుల అమ్మకాలకు నష్టం వచ్చేలా చేసే ఇలాంటి ఒప్పందాలు అత్యంత భయంకరమైనవి. ప్రజావ్యతిరేకమైనవి.

బ్రిటిష్‌వారు మనల్ని వలసలుగా మార్చినప్పుడు కుటీర పరిశ్రమలు ఎలా చిన్నాభిన్నం అయ్యాయో ఆర్‌సిఇపి వల్ల కూడా అదే పరిస్థితి రాబోతున్నది, దీన్ని అడ్డుకోవడానికి రైతులే కాదు. మొత్తం ప్రజలు ముందుకు రావలసిన అవసరం ఉంది. అలా కాకపోతే, ఈ ఒప్పందం తాత్కాలికంగా ఆగినా, చాప కింద నీరులా కల్లబొల్లి మాటలతో మరో రూపంలోనో, మరో అందమైన ముసుగులోనో అవతరించి దేశాన్ని డంపింగ్ గ్రౌండ్‌గా మార్చేసే ప్రమాదం ఉంది.

*(....22వ పేజీ తరువాయి)*

**ప్రజాయుద్ధాన్ని బలోపేతం చేద్దాం–భూమిని కాపాడుకుందాం**

1946లో హిరోషిమా, నాగసాకిల మీద అమెరికా అణు బాంబులు వేయడం నాటి నుంచి ప్రపంచంలో సామ్రాజ్యవాదం ప్రపంచాధిపత్యం కోసం చేసే దాడులలో రసాయన, అణు పదార్థాలు ఉపయోగించడం గురించి చర్చ జరుగుతున్నది. యుద్ధాలలోనే కాకుండా, తన మార్కెట్ అవసరాల కోసం కూడా సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలు వివిధ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజలను, పర్యావరణాన్నీ ఏ రకంగా నాశనం చేస్తున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. మన దేశానికి వస్తే 1986లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ కంపెనీలో జరిగిన విషవాయువు విడుదల వల్ల కలిగిన దుష్ఫలితాల వల్ల నేటికి కూడా అంగవికలురు పుడుతున్నారు. సామ్రాజ్యవాద గుత్త, ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం భారతదేశంపై పెరుగుతున్నది. దీంతో పాటుగానే భారతదేశ పర్యావరణం ఏ క్షణాన్నైనా బద్దలయ్యేంత నాజూకుగా తయారవుతున్నది. దీన్ని ఎప్పటికప్పుడు గుర్తించి, అధ్యయనం చేసి దాన్ని నివారించుకోవడానికి తగిన కార్యక్రమాలు రూపొందించుకోవలసిన అవసరం ఉన్నది. ప్రజలపై దోపిడీ పీడనలను రూపుమాపేందుకు జరిగే ప్రజా ఉద్యమంలో దీనిని నిర్దిష్ట రూపంలో ప్రత్యక్ష భాగం చేయకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకోలేం. ఈ వ్యవస్థను మార్చకుండా భూమిని కాపాడుకోలేం. ★

# బాబ్రీ మసీదు విధ్వంసాన్ని ఎత్తిపడుతూ న్యాయాన్ని పాతరేసిన 'సుప్రీం' తీర్పు

1951నుండి 2.77 హెక్టార్ల బాబ్రీమసీదు భూవివాదం న్యాయాలయాలలో నలుగుతుంది. ఆ స్థలంలో మసీదు కట్టడానికి ముందు అంటే 1528కు ముందు గుడి ఉందా అనే విషయాన్ని పరిశీలించాలంటూ రాష్ట్రపతి ఇచ్చిన సలహాను ఐదుగురితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా 1951లోనే తోసిపుచ్చింది. కానీ, అలహాబాదు హైకోర్టు స్పెషల్ బెంచ్ మాత్రం దానికి భిన్నంగా ఆ నేల తవ్వి అవశేషాలను పరిశీలించాలని చెప్పింది. నిజానికి 1951నాటి ఐదుగురి ధర్మాసనం తీర్పును ఎత్తిపడుతూ ఎలాంటి వాజ్యాలు స్వీకరించకుండా ఉంటే కాషాయ హిందుత్వ బ్రిగేడ్‌కు దాన్ని కూల్చే అవకాశమే చిక్కేది కాదు. కానీ, పాలకులు తమ పకడ్బందీ పథకం ప్రకారమే అలా జరుగనివ్వలేదు. 1982లో కూడా నవంబర్ 20నుండి డిసెంబర్ 6వరకు 16 రోజులు సుప్రీంకోర్టు రోజు వారి వాదనలు విన్నది. ఈ ప్రహసనం 2019నవంబర్‌లో తుది తీర్పు వెలువడిన సందర్భంగా కూడా 40రోజులు, 200గంటలు వాదనలు(6అగస్టు నుండి 16అక్టోబర్) సాగాయి.

2014లో అభివృద్ధి పాట పాడినవారు, 2019 వచ్చేసరికి నాటకీయంగా పుల్వామాను సృష్టించి, జాతీ, మత హిందుత్వ విష విద్వేషాలను రెచ్చగొట్టి రెండవ విడుత అధికారానికి వచ్చారు. అంతే! ఇక అడ్డూ, ఆపూ లేకుండా తమ ఎజండాను వేగవంతంగా అమలుచేసేస్తున్నారు. మధ్య తరగతిని ఆకర్షించే 'అభివృద్ధి' ప్రేలాపన దానికి పుట్టుకతో అబ్బిన విద్యే! ప్రజాహిత మేధావీ, హక్కుల నాయకుడు, మిత్రుడు బాలగోపాల్ 2004లోనే ఒక విషయాన్ని స్పష్టం చేశాడు. 'నిన్నటి రోజు ద్వేషాన్ని పక్కనపెట్టి అభివృద్ధి పాట పాడినవారు రేపు అభివృద్ధికి గోలీమారో అని చెప్పి తిరిగి ద్వేషాన్ని ప్రచారం చేసే ఎన్నికల ఎత్తుగడ అనుసరించగలరు' అంటూ సంఘ్ స్వభావాన్ని నిశితంగా బయటపెట్టాడు.

మొదట రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏ లను రద్దు చేసేశారు. ఆ వెన్వెంటనే ముమ్మారు తలాక్ చట్టం తెచ్చారు. తర్వాత ఏ మాత్రం ఆలస్యం లేకుండా జాతీయ పౌరసత్వ సూచీ ప్రకటించారు. ఆ వేడి చల్లారకముందే పౌరసత్వ సవరణ చట్టం రూపొందించారు. దానికి ప్రాతిపదికగా ఉండడానికి ఇపుడు 'జాతీయ జనాభా రిజిష్టర్'ను ప్రవేశపెట్టడానికి నడుం బిగిస్తున్నారు. అయితే, దీనికి దేశంలో చెలరేగుతున్న ప్రజా ఉద్యమం బ్రేక్ వేసింది. దానితో నిజాయితీ లేని తర్కం చేయడం నరనరాన జీర్ణించుకుపోయిన వారి థింక్‌టాంక్‌లు నాలుక మడతేసి అతి సునాయసంగా ఎన్.పి.ఆర్.పై మాట మారుస్తున్నారు. వీటన్నిటి మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయి చరిత్రలో తన పేరును చిరస్థాయిగా నిలుపుకోవడానికి ఎంతో దీర్ఘదృష్టితో తన పదవీ విరమణకు అతి కొద్ది రోజుల ముందు అయోధ్యపై తుది తీర్పును వెలువరించి హిందుత్వ జెండాను ఎత్తిపట్టి విశ్రాంత వర్గ జాబితాలో చేరిపోయాడు. కావాలనే ఆయన ఆ సమయంలో శబరిమలా తీర్పు జోలికి వెళ్లకుండా, దానిని విస్తృత ధర్మాసనం ముందుకు విసిరాడు. బాబ్రీమసీదు కూల్చివేతలో కరసేవకులను మించిన రామభక్తిని ప్రదర్శించింది అప్పటి దేశ ప్రధాని పి.వీ. నరసింహరావు అయితే, దానికి తన 1,045పేజీల తీర్పు 45నిముషాలు చదివి విన్పించి సంపూర్ణ సాధికారతను కల్పించి శేషజీవితంలో చెరిగిపోని చారిత్రిక అపకీర్తిని మూటకట్టుకున్న వాడు గొగోయి.

1992 బాబ్రీ మసీదు విధ్వంసాన్నీ, తీర్పును ఒక విడి ఘటనగా చూడనేకూడదు. ఆ విధ్వంసం జరిగిన సమయంలో దేశంలో నెలకొనివున్న ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోనే దానిని చూడాలె. లేకుంటే వాస్తవాలు తలకిందులుగా అర్థం అవుతాయి. మన దేశంలో 1991లో నూతన ఆర్థిక విధానాల (ప్రపంచీకరణ, ఉదారీకరణ, ప్రైవేటీకరణ-ఎల్‌పీజీ) అమలు ప్రారంభమైంది. ఆ సమయంలో కేంద్రంలో చాలా బలహీనమైన ప్రభుత్వం, అంటే లోకసభలో మెజార్టీ కోసం ఇతరుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడక తప్పని దుస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలన సాగుతోంది. అపుడు పాములపర్తి వెంకట నరసింహరావు దేశ ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండిరి.

ప్రపంచంలో నూతన ఆర్థిక విధానాలకు తొలుత ఆశ్రయం ఇచ్చి మొదటి ప్రయోగశాలగా నిల్చింది లాటిన్ అమెరికాలోని చిలీ దేశం. ఆ విధానాలు రాజ్యం ఒక అణచివేత యంత్రాంగంగా తప్ప మరెందులోనూ జోక్యం చేసుకోకూడదనే 'కనిష్ట శాసనం-గరిష్ట ప్రశాసనం'గా రాజ్యం బాధ్యతలపై హద్దులు విధిస్తాయి. 1973లో అక్కడ శాంతియుత పద్దతుల (బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికల) ద్వారా ఎన్నికైన కామ్రేడ్ అలెండీ వామపక్ష ప్రభుత్వాన్ని సైనిక తిరుగుబాటు జరిపి కూలదోసి ఆయనను హత్య చేసి అధికారాన్ని కైవశం చేసుకున్న నియంత పినోచెట్ ప్రభుత్వం నూతన సరళీకృత ఆర్థిక విధానాల అమలుకు శంఖమూదింది. ఆ తర్వాతనే మన దేశం సహ అనేక వెనుకబడిన దేశాలలో ఆ విధానాలు అమలులోకి వచ్చాయి. పర్యవసానంగా ఆ దేశాలలోని ప్రజలు ఎన్ని ఇబ్బందులను ఎంతటి అణచివేతను ఎదుర్కొన్నారో వాటికి ఎదురవుతున్న ప్రజల ప్రతిఘటన ఎలాంటిదో లోకానికి ఎరుకే!

ఆ ఎరుకతోనే మన దేశ పాలకులు ఆనాడు ఎలా వ్యవహరించారో స్వయాన దేశ ఆర్థిక మంత్రి, గృహ మంత్రి పదవులు వెలగపెట్టిన చిదంబరం 'పళని' పలుకులే చెబుతున్నాయి. 'సంస్కరణలు

ప్రభావశీలంగా అమలు కావాలంటే విధానాలలో మౌలిక మార్పులు ఎంతైనా అవసరం. అంతేకాదు అమల్లో వున్న విధానాలను పూర్తిగా త్యజించాల్సి వున్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే విధాన ధ్వంసం చాలా ముఖ్యం. ఎన్ని సమస్యలు ఎదురైనా (తప్పక ఎదురవుతాయి) అది జరిగి తీరాలి. 'రెడ్ బుక్స్' (ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యమున్న అధికారిక పుస్తకాలు)తో చలిమంటలు వేసుకున్నాము. విదేశీ వాణిజ్యం విధి విధానాలను సమూలంగా మార్చి వేశాము. విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టాన్ని యమునా నదిలోకి విసిరి వేశాం. ఫలితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు అపారంగా పెరిగాయి. పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని రద్దు చేశాం. కొత్త తరం పారిశ్రామికవేత్తలు ఆవిర్భవించారు. ఆర్థిక సంస్కరణల తొలి నాళ్ళలో మేము పూనుకున్న విధంగానే ఇప్పుడు మోదీ ప్రభుత్వం కూడా మౌలిక మార్పులకు పూనుకోవాలి. 1991-96సంవత్సరాల మధ్య మేము అదే చేశాము'. అంతటి ముందుచూపుతూనే వారు ఆ ప్రజా వ్యతిరేక విధానాలకు దేశంలో శ్రీకారం చుట్టారు. దేశంలో పరిస్థితులు వికటించకుండా ఉండడానికే కౌటిల్య నీతులలో పారాయణులైన దేశ పాలకులు మతాన్ని ఒక బ్రహ్మాస్త్రంగా వినియోగించారు. కానున్న కార్యం గంధర్వులు తీర్చిరి అన్న చందంగా  కరసేవకులు గునుపాలతో పలుగూ పారలతో అయోధ్యలోని బాబ్రీ మసీదును నేలమట్టం చేశారు. (దీనికి ముందు 1990లో మొదట ఓ ట్రయల్ వేశారు)  ఇంకేం! దేశం మతకల్లోలాలతో అట్టుడికిపోయింది. దేశం కర్ఫ్యూ మయమైంది.

'రోమ్ తగులబడుతుంటే నీరో ఫిడేల్ వాయిస్తున్నట్టుగా' బాబ్రీమసీదు కూల్చేవరకూ ఆత్రంగా ఎదురుచూస్తూన్న ప్రధాని ఆ దృశ్యాన్ని ఆనందంగా టీవీలో వీక్షిస్తూ అది కూలాకగాని రంగప్రవేశం చేయలేదు. నిజానికి బాబ్రీ మసీదు కూల్చివేసేదాకా లక్షలాది 'కరసేవ'కులను అనుమతించి భీష్మ సమానులైన అద్వాణీ, జోషీ, సింఘాల్ వంటివాళ్ల రెచ్చగొట్టే ప్రసంగాలు వింటూ వచ్చి స్వయంగా ఖాకీలను కూడా ఆ సేవలో పాల్గొననిచ్చిన 'మౌనముని', అంతా అయ్యాక మహా తెలివిగా స్పందించాడు. 1984నాటి తన హోంమంత్రి కాలంలో పాల్పడిన సిక్కుల ఊచకోత అనుభవాన్ని దేశంపై ప్రధానిగా ప్రయోగించాడు. ప్రజలపై కాల్పులు, నిషేధాజ్ఞలకు ఖాకీలను ఉసిగొల్పాడు. సంఘ్ సంస్థల నిషేధంలాంటి కంటితుడుపు చర్యలకుపక్రమించి లౌకికవాద ముద్ర చెరగకుండా, మైనార్టీల ఓటు బ్యాంకు దెబ్బతినకుండా చూసుకున్నాడు. బాబ్రీమసీదు కూల్చివేత సంఘ్ శక్తులకు ఎంత అవసరమో, ఆనాడు కాంగ్రెసీయులకు అంతకన్నా ఎక్కువ అవసరమన్నది అర్థమైనపుడు దాని తీర్పు నేపథ్యం సులువుగానే బోధపడుతుంది.

ఇపుడు ఆ నేపథ్యమేంటో చూద్దాం. 2004లో భారతీయ జనతా పార్టీ విడుదల చేసిన 'విజన్-2020' గురించి తెలుసుకుంటే తప్ప బాబ్రీ మసీదు కూల్చివేతపై 2019చివర్లో  వెలువరించిన తుది తీర్పు పీటముడి బోధపడదు. ఆ విజన్‌లో వారు ఇలా రాసుకున్నారు.

1. 'అయోధ్య విషయంలో అందరూ కోర్టు తీర్పుకు కట్టుబడి ఉండడమే ఉత్తమం (హిందుత్వ దాదాగిరి ఇది)

2. 'ఆ సమస్య హిందువులకూ ముస్లింలకూ మధ్య చర్చల ద్వారా పరిష్కారం కావడం సరయినది.

3. 'అయోధ్యలో రామాలయం కడుతాం. రామజన్మ స్థలంలోనే కడతాం. దేశంలో మత సామరస్యానికి అది చాలా బలాన్ని ఇస్తుంది'. (గొగోయి నోట పలికించిన పలుకులివే)

పై మూడు వాదనలను ఉన్నదున్నట్లు అర్థం చేసుకోకుండా మన దేశ రాజకీయ నాయకుల మాటలను తలకిందులుగా చూస్తే తప్ప వాటి లోగుట్టు బోధపడదు. అంటే రామాలయం అక్కడే కట్టాలి, దానికి ముస్లింలు చర్చలలో ఒప్పుకోవాలి, అప్పుడే వారిపైన దాడులు ఆగుతాయి. ఆ రాజీని వారు కోర్టు ముందు పెట్టాలి. కోర్టు తన తీర్పులో దానికి ఆమోద ముద్ర వేయాలి. (లాయర్లు దీనిని కాంప్రమైజ్ డిక్రీ అంటారు). కోర్టు తీర్పే శిరోధార్యం అంటే తాము బయట కుదుర్చుకున్న రాజీపైనే కోర్టు ముద్ర వేయాలన్నమాట! భారతీయ జనతా పార్టీ వారి దాదాగిరి భాషను అర్థం చేసుకోవడానికి వారి నిఘంటువు 'గోల్వాల్కర్ సాహిత్యం'ను చూడాల్సి ఉంటుంది. భారతదేశాన్ని 2020నాటికి ఒక అగ్రరాజ్యం (గ్రేట్ పవర్, సూపర్ పవర్)చేయాలన్నది బీజేపీ 'విజన్'లోని ఒక ముఖ్య అంశం. గోల్వాల్కర్ ఆలోచనా విధానంలో ఇది కేంద్ర బిందువు. ఇపుడు దీనిని కొంత సవరించుకొని 2025నాటికి ఐదవ ఆర్థిక అగ్ర శక్తిగా రూపొందించాలనే సంకల్పంతో వారు పరుగు తీస్తున్నారు. వారి 'శ్రీ గురువు' గారి బోధనలననుసరించే గతంలో అద్వాణీ దేశ మైనార్టీలు గుజరాత్‌ను, బాబ్రీ మసీదును, గ్రహం స్టెయిన్‌ను మరిచిపోవాలనే హితబోధ చేస్తే ఆయన వర్తమాన అనుచరులు గుజరాత్ నరసంహారకులు, నేడు ఎవరైనా కాదు, కూడదు అంటే మాబ్ లించింగ్‌లతో, లేదంటే 'న్యాయమూర్తి లోయా'లాగానో, కాకుంటే 'వ్యాపం'సాక్షులలాగానో శంకరగిరి మాన్యాలు పట్టిస్తారనే భయం మతమైనార్టీలలో రాజ్యమేలుతోంది. అందుకే ఆ తీర్పు వెలువడిన రోజు అయోధ్య నుండి ముస్లింలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయారు. ఆ భయంతోనే కనీసం ముస్లిం సోదరులు, వారి సంస్థలు అత్యున్నత న్యాయస్థానంలో రివ్యూ పిటిషనైనా వేయని దయనీయ స్థితికి నెట్టబడ్డారు. తీర్పు వెలువడడానికి మూడు రోజుల ముందు మంగళవారం కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ఇంట్లో ముస్లిం మత పెద్దలంతా ఉగ్ర సంఘ్ నాయకులతో సమావేశమై తామంతా కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని తమ 'లొంగుబాటు'ను ప్రదర్శించుకున్నారు. వారిలో షియా మత గురువు మౌలానా సయ్యద్ కల్బే, అఖిల భారతీయ సూఫీ సజ్జాద్‌నషీ పరిషద్ అధ్యక్షుడు సయ్యద్ నస్‌రుద్దీన్ చిస్తీల వరకున్నారు. సినీ నిర్మాత ముజఫ్ఫర్ అలీ పాల్గొన్నాడు. ఆ సమావేశం  నుండి లేచిన తెల్లారే 'జమియత్ ఉలేమా-ఏ-హింద్'

బుధవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసి 'మసీదు ఏ హిందూ దేవాలయాన్ని కూల్చి కట్టింది కాదు' అనే తమ వాదనను చారిత్రకంగా ఎత్తిపడుతూనే కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామన్నారు. ఆ మాటే యావత్ ముస్లిం సమాజానికి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2019నవంబర్ 9 శనివారం నాటి తీర్పుకు భాజపా వారి 'విజన్ 2020'కి గల లింకిది.

కాబట్టి క్రాంతి పాఠకులు ఈ నేపథ్యాలను అర్థం చేసుకోవడం ద్వారా ఆర్థిక రాజకీయ పరిణామాలకు వాటి వెన్నంటి సామాజిక, సాంస్కృతిక పరిణామాలకు గల సంబంధాలను తేలికగానే ఆకళింపు చేసుకోగలుగుతారు.

1528లో మీర్ బకీ కట్టించిన ముస్లిం ప్రార్థనా స్థలం (మసీదు)ను 464 సంవత్సరాల తర్వాత 1992 డిసెంబర్ 6నాడు భారతీయ జనతా పార్టీకి చెందిన హేమాహేమీలంతా అగ్రభాగాన నిలిచి తమ కరసేవకులంతా 'శియరాంజీకి జై' అంటూ నినదిస్తూ దానిని విధ్వంసం చేశారు. ఆ స్థలం తమ హైందవ పురాణపురుషుడు రాముడు జన్మించిన స్థలం అనే కాకమ్మ కథను సృష్టించి భారీ విధ్వంసానికి పాల్పడ్డారు. బ్రాహ్మణవాద దాష్టీకాన్ని అర్థం చేసుకోవడానికి వాస్తవాలను వ్యాస పరిధి రీత్యా సంక్షిప్తంగానే చూద్దాం. ఆ వాస్తవాలు మరెవరో చెప్పినవైతే వామపక్షాలంటేనే సునాయసంగా కొట్టిపారేసి యాగి చేసే హిందుత్వ శక్తుల ఆగడాల ముందు పాఠకులకు తర్క సమ్మతంగా తోచకపోవచ్చు. భారతీయ జనతా పార్టీ తన తర్కానికి అనుగుణంగా ప్రజలలోకి భాషను కూడా ఫ్లోట్ చేసేస్తుందనడానికి బాబ్రీ మసీదు ఒక వివాదస్పద కట్టడం అనే మాటను ఎంతో ముందుచూపుతో ప్రవేశపెట్టింది. ఇది తన కుతర్కానికి పునాదిరాయిగా పనిచేసే పదబంధం. కాబట్టి మనం పోలీసు కానిస్టేబుల్ మాతాప్రసాద్ డిసెంబర్ 23, 1949 నాడు నమోదు చేసిన ప్రాథమిక సమాచార రిపోర్టు నుండే ఆ వాస్తవాలను తెలుసుకుందాం.

'ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల సమయంలో నేను ఆ జన్మభూమి (దానిని అప్పటివరకు మసీదు జన్మస్థలంగానే రికార్డులలో వ్యవహరిస్తూ వచ్చారు) స్థలానికి చేరేసరికి ఓ 50-60 మంది గుంపు ఆవరణ తాళాలు పగులకొట్టి బాబ్రీ మసీదులోకి ప్రవేశించారు. అక్కడ శ్రీ భగవాన్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. గోడలపై కాషాయ, పసుపు రంగులలో రాంజీ, సీతమ్మల చిత్రాలు గీసారు. వారిని హంస్ రాజ్ (కానిస్టేబుల్ నం. 70) అడ్డుకుంటే లక్ష్యపెట్టలేదు. అందుబాటులో ఉన్న రాష్ట్ర సాయుధ పోలీసులను (పీఏసీ) సహాయానికి పిలిచారు. కానీ అప్పటికే ఐదారు వేల మందితో ఓ పెద్ద జనం గుంపు మసీదులోకి ప్రవేశించి ధార్మిక నినాదాలు ఇస్తూ కీర్తనలు పాడడం మొదలుపెట్టారు. ఆ లోపు అధికారులు పరుగెత్తుకొచ్చి పరిస్థితిని అదుపు చేయడంతో అంతా సద్దుమణిగింది. రాందాస్, శుక్లాదాస్, సుదర్శన్‌దాస్‌లు ప్రధాన ముద్దాయిలు కాగా మిగితా 50-60 మంది మసీదులో విగ్రహాన్ని ప్రతిష్టించాలన్న కోరిక నెరవేరలేదు. డ్యూటీలో ఉన్న అధికారులు సహ అనేక మంది దీనిని పరిశీలించారు. ఇది వాస్తవం'. ఈ రకంగా 1528నాటి మసీదుకట్టడం 1949లో రామజన్మభూమిగా వివాదాలలోకి ఎక్కించబడింది. ఇక ఆ తర్వాతి పరిణామాలు చూద్దాం.

1950నాటి ఉత్తర ప్రదేశ్ ఫైజాబాదు (2018లో అపర రామభక్తులు దాని పేరు ఏకంగా అయోధ్య చేశారు)డిప్యూటీ కమిష్నర్ జే.ఎల్. ఉగ్రా పెట్టిన కేసులోని పేరా 12: "ఆ ప్రాంతం చాలాకాలంగా ముస్లింల ప్రార్థనా స్థలంగా కొనసాగుతోంది. ఆ స్థలం బాబ్రీమసీదుకు చెందినదే. అది శ్రీరామచంద్రుడి పూజా మందిరంగా ఎప్పుడూ వాడుకలో లేదు." పేరా 13: డిసెంబర్ 22, 1949 రాత్రి కుట్రపూరితంగా రాముడి విగ్రహాలు అందులో పెట్టారు" ఇంత వివరంగా 70ఏళ్ల నాటి దఫ్తరాలలో చెప్పినాంక కూడా ఏమాత్రం స్వార్థ ప్రయోజనాలు లేకుండానే దేశ ప్రధాన న్యాయాధీశుడు తన తీర్పును వెల్లడించాడనుకోవడం మూర్ఖమే అవుతుంది.

మన దేశంలో 1949నుండి బాబ్రీ మసీదు కూల్చివేత కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ తన లౌకిక ముఖాన్ని కాపాడుకుంటూనే ఆ కుట్రలను ప్రమోట్ చేస్తూ వస్తోంది. 1988లో దేశీయాంగ మంత్రిగా ఉన్న బూటాసింగ్ మసీదు పక్కన రాంమందిర నిర్మాణ ప్రాంగణంలో రాంచబూతరా, సీతా పాకశాలలకు స్థలం ఇవ్వచ్చన్నాడు. జాగంతా మాదే అంటున్న 'రామజన్మభూమి ముక్తి యజ్ఞ సమితి' ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఆ తర్వాత నిండా నాలుగేళ్లయినా గడువకముందే పనిలో పనిగా రాంచబూతరా సహ బాబ్రీ మసీదును కూల్చారు.

ఇక మసీదును కూల్చడానికి కొద్ది ముందు వరకు కూడా రాజకీయ నాయకుల అంతరంగం ఎరుగని నిజాయితీగల అధికారులు తమ పరిధిలో 'న్యాయం' కోసం పడిన పాట్లు తక్కువేమీ కాదు. కానీ అవన్నీ దేశ నేతల చాణక్యం ముందు దిగదుడుపే అయ్యాయి. బాబ్రీమసీదు కూల్చివేతకు ముందూ తర్వాతా మాధవ్ గడ్బొలే కేంద్ర దేశీయ వ్యవహారాల కార్యదర్శిగా పని చేశాడు. ఆయన 1992 నవంబర్ 4నాడు ఆ తర్వాత 1992 డిసెంబర్ 29నాడు అధికారికంగా అయోధ్యలో ఉన్నాడు. 1993మార్చ్‌లో తన ఐఏఎస్ బాధ్యతల నుండి 'స్వచ్ఛంధ' పదవీ విరమణ చేశాక 1996లో 'అన్‌ఫినిష్డ్ ఇన్నింగ్స్'అనే పుస్తకం రాసి తన అనుభవాన్ని భద్రపరిచాడు. ఆయన అధికార నివేదికలో ఇలా పేర్కొన్నాడు. 'నేను డిసెంబర్ 29నాడు అక్కడి భూమి సమస్యతో పాటు గతంలో దర్శనానికి అనుమతించిన నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యను సమీక్షించడానికి అయోధ్య వెళ్లాను. నేనక్కడ దిల్లీనుండి వెళ్లే అందరధికారుల్లాగ రాంలల్లాను దర్శించలేదు, పూజలు చేయలేదు. నేను భక్తున్నే అయినప్పటికీ ప్రసాదం కూడా స్వీకరించలేదు. మతం వ్యక్తిగతమనే నేను నమ్ముతాను. సరే, నాకు అయోధ్య బాగా తెలుసు.

భగవంతుడు మందిరాలలో మకాం చేయడనే నేను నమ్ముతాను. ఆ నిర్మాణం విపరీతమైన మోసం, దౌర్జన్యంతో ముడిపడింది'. ఈ అధికారి తన తొలి అధికార పర్యటనలో 1992నవంబర్ 4నాడు అంటే విధ్వంసానికి సరిగ్గా నెలకు ముందే తనకు అర్థమైన విషయాలను కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి, ప్రధాన మంత్రి ప్రధాన కార్యదర్శికి, గృహమంత్రికి, ప్రధాన మంత్రికి నివేదించాడు. కాని వారెవరూ ఆయన ప్రతిపాదనలను ఆమోదించలేదు. ఆయన ఆ స్థలాన్ని కేంద్ర అర్ధ సైనిక బలగాలకు (రాష్ట్రంలో కరుడుగట్టిన కాషాయ భక్తుడు కళ్యాణ్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నాడన్న విషయం, అనేక సందర్భాలలో పీఏసీ పాత్ర వివాదస్పదంగా మారడం ఆయన దృష్టిలో ఉంటుంది) అప్పగించాలని, పరిసర ప్రాంతమంతా వారి ఆధీనంలో ఉంచాలనీ అక్కడ బలగాల సమీకరణకు ముందే ఆర్టికల్ 356 రాష్ట్రపతి పాలన విధించాలని సూచించాడు. ఆ పనే జరిగివుంటే అక్కడ లక్షల సంఖ్యలో కరసేవకుల సమీకరణ నిరోధించబడేదే! ఇంకా తాము చేసిన అనేక ప్రయత్నాలు ఆ పుస్తకంలో ఆయన కళ్లకు కట్టాడు. ఆనంద్‌పట్వర్ధన్ నిర్మించిన 'రామ్ కే నామ్ సే' డాక్యుమెంటరీ చూస్తే రథ యాత్రల వీరుడు లాల్‌కృష్ణ అద్వానీ ఆగడాలు, రాంమందిర్ నిర్మాణం కోసం దళితులైన 'భంగీ'ల వెతలు ప్రపంచం ముందుకు వచ్చాయి. ఇవన్నీ తెలిసే వర్తమాన తీర్పు వెలువరించారన్నది నిజం. గతంలో ఒకసారి మాజీ సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తి కృష్ణయ్యర్ చేసిన వ్యాఖ్య "మనదేశంలో సుప్రీంకోర్టు ఢిల్లీలోని తిలక్ రోడ్డులో ఒక్కటే వుంది. కానీ అందులో మళ్ళా 26సుప్రీంకోర్టులు వున్నాయి" అన్నది ఎంత నిజమో గొగోయి తన తీర్పు ద్వారా మరోసారి కృష్ణయ్యర్‌ను గుర్తు చేస్తున్నాడు.

దేశ న్యాయవ్యవస్థ తీరుతెన్నులు ఎంతటి వర్గానుకూలంగా ఉంటాయో అయోధ్య ఘటనలన్నింటిలో వ్యక్తమవుతున్నది. కోర్టు ధిక్కార నేరం కేసు కళ్యాణ్‌సింగ్‌పై గత 30యేండ్లుగా మూలుగుతోంది. బాబ్రీమసీదును కూల్చిన నేరం కేసుపై ఎలాంటి తీర్పు ఇంతవరకూ వెలువడలేదు. కానీ, ప్రజల మత విశ్వాసాల మాటున ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ వివాదస్పదంగా మార్చిన ఆ భూమిని మాత్రం రాంలలా విరాజ్‌మాన్‌కు (హిందువుల) కైవశం చేశారు. మసీదును కూల్చడంపై మహా సెక్యూలర్ దేశంలో అత్యున్నత న్యాయస్థానం మౌనం పనికి రాదంటూ నూతన మసీదు నిర్మాణానికి రెట్టింపు స్థలాన్ని ఐదు ఎకరాలు ఇవ్వాలని కోర్టు ఎంతో ఔదార్యంతో తీర్పు చెప్పింది. 2010లో అలహాబాదు(అది వర్తమాన రామభక్తుల పాలనలో ప్రయాగగా పేరు సంతరించుకున్నది) హైకోర్టు వినిపించిన 8,189పేజీల తీర్పురు గొగోయి తీర్పు బుట్టదాఖలా చేసేసింది. 2.77హెక్టారుల భూవివాదంపై కోర్టును ఆశ్రయించిన మూడు 'పార్టీ'లకు–సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా, రాంలలా విరాజ్‌మాన్– ఆనాడు హైకోర్టు భూమిని మూడు పాళ్లు చేసి పంచింది. కాని వర్తమాన తీర్పు సందర్భంగా 'దేవున్ని మూడు భాగాలు చేయడం కుదరదు' అంటూ 'ఉమ్మడి యాజమాన్యం ఆమోదయోగ్యం కాదు' అంటూ సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథ్ గుర్తుచేయడం ఐదుగురి సుప్రీం ధర్మాసనానికి సమ్మతమైంది. వాస్తవంగా, అగ్రశ్రేణి భాజపా నాయకత్వాన్ని వారు సృష్టించిన విధ్వంసానికి ఈ న్యాయస్థానం కటకటాల వెనుకకు తోయాల్సింది. దానికి ఆ అవకాశాలను అన్ని విధాలా కల్పిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చిన కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రజల ముందు బట్టబయలు చేయాల్సింది. కానీ అలా చేయడానికి అవేమి ప్రజాకోర్టులు కావు కదా!

నూటికి 70 శాతం మంది ఈ దేశ ప్రజలు అనుసరిస్తున్న మూలవాసీ జీవన సంప్రదాయాలను ప్రకృతి దేవతల పూజా సంస్కృతిని భారతదేశ సంస్కృతిగానే బ్రాహ్మణం మలుస్తోంది. శబరి తిండిని, శంబూకుని తపస్సును, వాలి రాజ్యాన్ని శూర్పణఖ ప్రేమను వాళ్లకు చెందకుండా చేసిన అంటే గిరిజన, శూద్ర, వానర, స్త్రీ జాతులకు చేసిన అన్యాయం రాముని చరిత్ర. ఆ దుర్మార్గ చరిత్రను పక్కన పెట్టినా, రాముడి రసికతను, రామాయణం రంకు అనే ప్రజా నానుడిని కాసేపు మరిచిపోయినా, 14ఏళ్ల పాదుకల పాలనా చరిత్రను వదిలేసినా, దేశంలోని అనేక ప్రాచీన ఆదివాసీ గుళ్లను, వారి దేవతలను భ్రష్టు పట్టించి హిందూ పౌరాణిక దేవతలతో దొంగచాటుగా వారి వివాహాలు జరిపించి ఎంతో దుర్మార్గంగా హైందవీకరించిన చరిత్ర బ్రాహ్మణానిది అనేది మరిచిపోకూడదు. ముంబా మాతా నుండి ఎల్లమ్మ, మల్లమ్మ, పోచమ్మ, మైసమ్మల వరకు ఎందరినో శివుడిని మినహాయించినా రాముడు, కృష్ణుడు హైజాక్ చేశారు. జైనుల, బౌద్ధుల ధర్మాలనూ నిర్మాణాలనూ విధ్వంసం చేసి హిందూ మతంగా ప్రచారం చేయబడుతున్న వర్ణాశ్రమ ధర్మం బలపడింది. గుజరాత్ నరసంహార సమయంలో సంఘ్ పరివార్ కాల్బలంగా పాల్గొన్నది ఎక్కువగా బిల్లు తెగకు చెందిన ఆదివాసులు. ఆ రాష్ట్ర సరిహద్దుకు అవతల రాజస్థాన్‌లోనూ ఆ ప్రజలే ఉన్నారు. అక్కడ కూడ సంఘ్ పరివార్ సంస్థ 'వనవాసీ కళ్యాణ్ పరిషత్' ఆదివాసులను కాషాయ రాజకీయాలవైపు లాగడానికి చెడ ప్రయత్నం చేస్తున్నది. గుజరాత్, రాజస్థాన్‌ల నుండి ఒడిశా వరకు దేశవ్యాప్తంగా ఆదివాసులలో విద్వేష రాజకీయాలను వ్యాపింపచేయడంలో 'వనవాసీ కళ్యాణ్ పరిషత్' అనే సంఘ్ అనుబంధ సంస్థ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇలాంటి సంస్థలు ముస్లింలలోనూ పుట్టుకొచ్చాయి. ముక్తార్ అబ్బాస్ నక్వీలు, షాహనవాజ్ హుస్సేన్‌లు వారికి అనుంగ భక్తులుగా తయారయి ముస్లిం జనసముదాయానికి తీరని అపచారం చేస్తున్నారు.

చరిత్రతో, చారిత్రక వాస్తవాలతో, సంప్రదాయాలతో, ప్రజల శతాబ్దాల మనోభావాలతో అత్యున్నత న్యాయస్థానానికి సంబంధం లేదు. అది వెలువరించే తీర్పుకు వాటితో పనే లేదు. 'విస్సన్న చెప్పిందే వేదం' అన్న చందంగా కల్పిత భావాలకు, ఆధిపత్య భావజాలానికి, అధికారానికి న్యాయం సలాం చేస్తోంది. తీర్పు 'రాంభజో' అంటోంది. ఇదే ఈ వ్యవస్థ తాలూకు ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, లౌకిక వ్యతిరేక లక్షణం. జాతుల, మతాల,

భాషల, సంప్రదాయాల బహుళత్వం హుళక్కే. ప్రజల ప్రజాస్వామికం కోసం పోరాడి దానిని సాధించుకున్నపుడే ఈ దేశం నిజమైన ఫెడరల్ రిపబ్లిక్‌గా అవతరిస్తుంది. కుల విముక్తికి బాట సుగమమవుతుంది. అప్పుడే, మత ప్రసక్తి లేని నిజమైన 'రాజ్యం' అవతరిస్తుంది. మతం వ్యక్తిగత విశ్వాసంగా ఉంటుంది.

సంఘ్ మురాకు రాజకీయ ముఖం అయిన భారతీయ జనతా పార్టీకి ముస్లింల పట్ల ద్వేషం, క్రైస్తవుల పట్ల ద్వేషం, అభ్యుదయం-ప్రగతి పట్ల ద్వేషం, స్వేచ్ఛ పట్ల ద్వేషం, భిన్నత్వం పట్ల ద్వేషం, శాస్త్ర విజ్ఞానాల పట్లా ద్వేషం అనేది దాని చరిత్రతో ముడిపడినది. దీనిని గత ఆరేళ్లలో ఏనాటికానాడు వాళ్లు బయటపెట్టుకుంటున్నారు. సైన్సు కాంగ్రెస్ వేదికల నుండి మొదలుకొని మబ్బుల మాటున బాలాకోట్ వైమానిక దాడులను రాడార్‌లు పసిగట్టలేవనే వరకు 'గౌరవనీయులైన' దేశ ప్రధాని అనేక విషయాలలో తన అజ్ఞానాన్ని, మత మౌఢ్య విద్వేషాన్ని సిగ్గూ ఎగ్గూ లేకుండా బయటపెట్టుకొని నవ్వుల పాలయ్యాడు. దేశం 'పరువు' తీశాడు. మెజార్టీ మతోన్మాదం నుంచి రక్షణగా మైనార్టీ మతాలకు అండగా నిలబడుతున్నామనే పేరుతో కాంగ్రెస్, వామపక్షాలు, బహుజన పార్టీలు మైనార్టీ మత రాజకీయాలు చేసినై. మైనార్టీలను మతదాతలుగానే చూసినై. మతం ముసుగున మనువాద భావాలను సమస్త మతాలమీద రుద్దుతున్న బీజేపీని నిలువరించలేకపోయినై.

ఇరువై ఏళ్ల కింద హైదరాబాదు ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజ్ ముందు జార్జిరెడ్డిని హత్య చేసిన హిందూ మతోన్మాదులు అప్పటి విద్యా మంత్రి పదహారణాల కాంగ్రెస్ నాయకుడు, అంతే బ్రాహ్మణవాది అయిన పీవీ నర్సింహారావు ఇంట్లోనే తలదాచుకున్నారు. దేశ రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, ముఖ్య మంత్రులు, మంత్రులు, అత్యున్నత అధికారులు గుళ్లు, గోపురాల చుట్టు తిరుగడమే కాకుండా రతిక్రీడలలో దొరికిపోయి కటకటాలలో మగ్గుతున్న ఆశారాం నుండి అనేక మంది దొంగబాబాలకు సిగ్గూ ఎగ్గూ లేకుండా సాష్టాంగ పాదాభివందనాలు చేసే వాళ్లే దేశాన్ని ఏలుతున్నపుడు ఏ అన్య మతస్థులకు న్యాయం దక్కుతుంది!

ఎక్కడైతే సో కాల్డ్ సెక్యులర్ పార్టీలు ఘోరంగా విఫలమైనాయో.. సరిగ్గా అక్కడనే బీజేపీ తన మనువాద ఎజెండాను జాతీయవాదం పేరుతో అమలు పరుస్తూ వస్తున్నది. అట్లా దేశ ప్రజలను మతపరమైన థాట్ పోలీసింగ్‌తో భాజపా లొంగదీసుకుంటున్నది. గో మాంసం పేరుతో ముస్లింలను, దళిత ఆదివాసులను కొట్టిచంపుతున్నా.. గాంధీని చంపడమే దేశభక్తిగా నిర్లజ్జగా ప్రకటిస్తున్నా.. దళిత, ఆదివాసుల్లోని మధ్యతరగతిని తమవైపు తిప్పుకోవడంలో బీజేపీ సఫలమవుతున్నది. కారణం.. "కన్విన్స్ చేయలేకపోతే కన్ఫ్యూజ్ చెయ్యి" అనే విధానాన్ని అనుసరిస్తూ, 'భయాన్ని సృష్టించు, ప్రజలను లొంగదీసుకో' అనే వ్యూహాన్ని అది అమలుపరుస్తున్నది. అందులో భాగమే.. నాడుగోద్రా, నేడు గో వధ ద్వారా కొనసాగుతున్న బీజేపీ గెలుపు పరంపర. 90శాతం దేశ ఉత్పత్తి కులాలను అణచివేసే బ్రాహ్మణ దుస్సాంప్రదాయాలను ఈ దేశ హిందూ సంప్రదాయంగా, అదే ఈ దేశ మత సంప్రదాయంగా ప్రజల మెదళ్ల మీద థాట్ పోలీసింగ్ చేస్తున్నది బీజేపీ. మనువాద మత సాంప్రదాయ జీవన విధానమే జాతీయవాదంగా దేశం మీద రుద్దుతున్నది. ప్రజల నడుమ హిందూ, ముస్లిం, సిఖ్కు, ఇసాయి, బౌద్ధ, జైన మున్నగు మతాల పేరున విభజన తెచ్చి భావోద్వేగాలు రెచ్చగొట్టడం ద్వారా ఎన్నికల్లో ఓట్లు పోగేసుకుంటున్నారు. కానీ అది ఎల్లకాలం సాగదని ఇటీవలి ఝార్ఖండ్ ఎన్నికలు హిందుత్వ శక్తులకు ఎరుక చేశాయి. లోకసభ ఎన్నికలలో మత, జాతి ఉన్మాదాన్ని రెచ్చగొట్టిన మోదీ-షా జోడి ఎన్నికల్లో గెలుపుతో "సబ్ కా విశ్వాస్" అంటూ ముస్లింల ముందుకు ఓ నినాదాన్ని విసిరాడు.

మన దేశంలో ముస్లిం సోదరులు ఎంతటి నికృష్ట జీవితాన్ని అనుభవిస్తున్నారో రాజేంద్ర సచ్చర్ కమిటీ సమర్పించిన సవివరమైన నివేదిక తేటతెల్లం చేస్తుంది. వారు మన దేశంలోని దళితులకన్నా, ఆదివాసులకన్నా దయనీయంగా ఉన్నారంటూ ఆధారాలతో సహ పేర్కొన్నాడు. వారిలో అత్యధికులు చాతుర్వర్ణ వ్యవస్థకు చెందినవారే అయినప్పటికీ (బ్రాహ్మణం బాధలు భరించలేకనే) ఇస్లాం మతం పుచ్చుకున్నారన్న వాస్తవాన్ని వివేకానందుడు కూడా గ్రహించాడు. అందుకే కాబోలు ఆయన శిశ్యగణం పునరాగమనం (ఘర్ వాపసీ) దాడులకు దిగారు. 17వ లోకసభ ఎన్నికలలో అవసరానికి మించిన ఆధిక్యత రావడంతో అతి దూకుడుగా ఇస్లాంపై ముస్లింలపై వరుస దాడులకు దిగారు. ఆర్టికల్ 370, 35ఏ రద్దు, ముమ్మారు తలాక్ నిషేధ చట్టం, పొరుగు దేశాలైన అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి వలస వచ్చిన ఇస్లాం మినహ హిందూ, ఇసాయి, సిఖ్కు, బౌద్ధ, జైన మతాల వారికి పౌరసత్వ చట్టం మున్నగునవి రాజ్యాంగబద్దంగా చేసిన దాడులు కాగా స్వతంత్ర సంస్థగా భావించే న్యాయవ్యవస్థను స్వంత సంస్థగా చేసేసుకొని చేయించిన దాడి అమోధ్యలో రామాలయ నిర్మాణం. ఇకపై భవ్య రామాలయ నిర్మాణానికి ఏ శక్తీ మమ్మడ్డుకోలేదంటూ కరుడుగట్టిన కాషాయ భక్తులు మంత్రివర్యులు ముహూర్తాలు నిర్ణయించి విర్రవీగుతున్నారు. 2020ఎప్రిల్‌నాటికి దానిని పూర్తి చేస్తామంటున్నారు. బాబ్రీమసీదును కూల్చిన రామభక్తులే పనిలో పనిగా ముందుచూపుతో రాంచబూతరాను కూడా కూల్చారు. ఆనాడదో చిన్న గుడిలాంటిదే! ఇపుడు ఆ జాగాలోనే భవ్య మందిర నిర్మాణానికి పూనుకుంటున్న హిందుత్వ శక్తుల గ్రహబలానికి గగోయి న్యాయముద్రవేశాడు. రామచంద్రుడి దయ వలన దేశంలో ఎల్‌పీజీ విధానాలు రాజ్యమేలుతున్నాయి. మేకిన్ ఇండియాలు ముందుకు వచ్చాయి. వేలాది కోట్ల రూపాయల బ్యాంక్ రుణాలు నిరర్థక ఆస్తులుగా ఎందుకు మిగిలిపోయాయో అవి ఆర్థిక వ్యవస్థకు ఎంతటి చేటు చేస్తున్నాయో, ప్రపంచీకరణ ప్రక్రియలో కేవలం గత ఐదేళ్లలోనే ఒక కోటి యాభై లక్షలకు పైగా ఉద్యోగాలు ఎలా ఊడాయో మనదేశం ఉద్యోగ రహిత వృద్ధి సాధించడం ఏంటనే ప్రజల జీవన్మరణ సమస్యలపై పిల్‌లు వేసేవారుండరు, తీర్పులు చెప్పేవారుండరు.

కానీ ఆ పుక్కిటి పురాణ పురుషుడి భవ్య మందిర నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధుల సేకరణ జరిగిపోతోంది. బిహార్‌లోని 'మహావీర్ (ఈయన జైనుడన్నది గుర్తు పెట్టుకోవాలి) మందిర్ ట్రస్టు' పది కోట్ల రూపాయల బూరీ విరాళాన్ని ఇప్పటికే ప్రకటించింది. ఇక ఇపుడు వారి ముందు జాతీయ జనాభా సూచీ, విద్యా విధానంలో మార్పు తక్షణ ఎజండాగా ఉన్నాయి. వాటిని అడ్డుకునే ఎజండాతో ప్రజలు పోరాట రంగంలోకి రావాలి. మత్తు మందులాంటి మతఘర్షణలలో ప్రజలను ముంచెత్తుతూ దోపిడీ పాలకులు ఆర్థిక మహా కుంబకోణాలలో మునిగిపోయీ దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయడాన్ని ప్రజలు ఇంకెంత మాత్రం సహించకూడదు.

జాతీయ విద్యావిధానంలో మార్పులకు సంబంధించి ఇస్రో మాజీ చీఫ్ కె కస్తూరి రంగన్ నేతృత్వంలోని డ్రాఫ్టింగ్ కమిటీ తన తుది డ్రాఫ్టులో 19మార్పులను సూచించింది. అందులో త్రిభాషాసూత్రం ఒకటి. దానిపై హిందీయేతర రాష్ట్రాలు ధ్వజం ఎత్తగా కొన్ని పాత ప్రతుల్ని క్రోడీకరించేటప్పుడు ఒక తప్పుడు పేరా (ఎంత సునాయసంగా) ముసాయిదాలోకి చేరిందన్న కమిటీ సభ్యుడి వివరణా ప్రభావశూన్యం కావడంతో యుద్ధ ప్రాతిపదికన కేంద్రమే నష్ట నివారణ చర్యకు ఉపక్రమించిందిప్పుడు! తప్పనిసరి హిందీ బోధన అని వున్న పద బంధాల్ని తొలగించి కొత్తగా వాక్యనిర్మాణ కూర్పుతో ముసాయిదాను సరిదిద్దినా త్రిభాషా సూత్రం తాలూకు స్ఫూర్తి దేశ వ్యాప్తంగా రవళించాలన్న వారి దుష్ట ఆకాంక్ష యథాతథంగానే వుంది. 'హిందూ, హిందీ, హిందుస్తాన్' అనే హిందుత్వ ఫాసిస్టు సిద్ధాంత వెలుగులోనే విద్యావిధాన రూపకల్పన వారి లక్ష్యం. అదే ఇస్రో మాజీ చీఫ్ కె కస్తూరి రంగన్ చేత చేయించి తీరుతారు. ఇకపోతే, దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి వారికిపుడు జాతీయ జనాభా సూచీ తయారీ కావాలి. దాని కోసం వారంతా నడుం బిగించారు. వారి 'వినూతన భారత'(నయా భారత్) నిర్మాణానికి సంచితం విధాన ధ్వంసం చాలా ముఖ్యం. దానికి అడుగడుగునా అడ్డు తగులుతున్న దేశంలోని మావోయిస్టులతో సహ ప్రజాస్వామిక, లౌకిక, సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్త శక్తుల అడ్డు తొలగించుకోవడం అందుకు ఎంతో అవసరం. దానిని దేశ హోం మినిష్టర్ అమిత్‌షా ఎలాంటి దాపరికం లేకుండానే 'మావోయిస్టు రహిత భారతం' తమ లక్ష్యంగా 2019అగస్టు ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రకటించాడు. కాబట్టి ఇవాళ దేశ ప్రజలు ఎక్కడికక్కడే హిందుత్వ ఎజండాకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడాల్సిన అవసరం ఉంది. ఏ ఘటనకు ఆ ఘటనను విడిగా చూడకుండా దేశంలో చోటుచేసుకుంటున్న ఘటనలన్నింటినీ 'దండలో దారంలా' వారి ఎజండాలో అన్నీ విడదీయరాని భాగాలేనన్న చైతన్యాన్ని ప్రదర్శించాలి. ★

మతంతో మనం పోరాడాలి. ఇదే భౌతికవాదం అంతటికీ, తదనుషక్తంగా మార్క్సిజానికీ ఓనమాలు. కాని ఓనమాలతో ఆగిపోయె భౌతికవాదం కాదు మార్క్సిజం. అంతకంటే ముందుకు వెళ్తుంది మార్క్సిజం. మతంపై ఎలా పోరాడాలో మనం తెలుసుకోవాలి, కాగా ఇందుకోసం అని మత విశ్వాసాల పట్లనూ, మతం పట్లనూ ప్రజలలో ఉన్న మూలాధారాన్ని మనం భౌతికవాదాత్మకంగా వివరించాల్సి ఉంటుంది అని మార్క్సిజం చెబుతుంది. మతానికున్న సామాజిక మూలాలను పెళ్లగించించివేసే లక్ష్యాన్ని కలిగినట్టి వర్గోద్యమం నిర్దిష్ట ఆచరణీయ కార్యంతో ఈ పోరాటానికి లింకు కలపాలి.- లెనిన్

*(....38వ పేజీ తరువాయి)*

తిరిగి రెండవ దఫా అధికారాన్ని చేపట్టిన కేసీఆర్ అటవీ ప్రాంతంలో నిక్షిప్తమై వున్న ఖనిజ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి మళ్లీ హరితహారం పేరుతో జంగల్ బచావో-జంగల్ బడావో, పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ అటవీ శాఖ-పోలీసు బలగాలతో సంయుక్తంగా ఆదివాసులపై దాడులు కొనసాగిస్తూ దశాబ్దాలుగా ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూముల నుండి గెంటివేస్తున్నారు.

యురేనియం తవ్వకాల కోసం నల్లమలలో చెంచుగూడేలను ఖాళీ చేయిస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల్ల అటవీ ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో డిబీర్ సంస్థ భారీ యంత్రాలతో దాదాపు 50కి పైగా బోర్లువేసి మట్టిని సేకరించి విలువైన యురేనియం ఖనిజ సంపద వున్నట్లు కనుగొన్నది. ఈ ఖనిజాన్ని వెలికి తీయడానికి కార్పొరేట్ సంస్థల బ్రోకర్లైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని టైగర్ జోన్‌గా ప్రకటించి చెంచు ఆదివాసులను మొదట అడవి నుండి ఖాళీ చేయించడం మొదలు పెట్టాయి.

వాస్తవంగా మూల ఆదివాసులు దేశవ్యాప్తంగా 8.6 శాతం వున్నారు. అంటే పదిన్నర కోట్ల మంది వున్నారు. ప్రపంచంలో చూస్తే ఆఫ్రికా తర్వాత అత్యధిక ఆదివాసీ జనాభా భారతదేశంలోనే వుంది. శక్తివంతమైన ఆదివాసీ పోరాటాలు కొనసాగాయి. ఇప్పుడు తెలంగాణ, దండకారణ్యం, ఒరిస్సా, బీహార్, జార్ఖండ్‌లలో జల్-జంగల్-జమీన్ కోసం ఆదివాసుల నెత్తురు పారుతూనే వుంది. అటువంటి ప్రాధాన్యత గల అడవి భూములను, ఆదివాసీ ప్రజలను కాపాడుకునేందుకు అన్ని సెక్షన్ల ప్రజల మద్దతుతో ఐక్య పోరాటాలు నిర్మిద్దాం. ఈ దోపిడీ వ్యవస్థను కూల్చుదాం. ప్రజారాజ్యాన్ని నిర్మిద్దాం. ★

# ప్రపంచ పర్యావరణ పరిరక్షణ

# ప్రజాయుద్ధంలో ప్రత్యక్ష భాగం కావాలి

పర్యావరణ కాలుష్యం అనే ఒక అంశం మానవ జీవితంలోకి వచ్చి చేరి దశాబ్దాలు గడిచిపోయాయి. ఇప్పుడు అది 'వాతావరణ మార్పు' అనే పేరును, రూపాన్ని సంతరించుకుంది. ఈ వాతావరణ మార్పుల నుంచి భూమిని కాపాడుకోకపోతే మరో పన్నెండు సంవత్సరాలలో ఇవి భూమి తట్టుకోలేని స్థాయికి చేరుకుని క్రమేణా మానవజాతి అంతరించిపోతుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ అంశం మీద చర్చలు జరుగుతున్నాయి. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాల సమావేశాలు 1992 నుంచి ఇప్పటి వరకు వివిధ ఒప్పందాలు చేసుకున్నాయి. 2019 డిసెంబరు 15వ తేదీన మాడ్రిడ్‌లో జరిగిన సమావేశం కూడా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి భరోసా కల్పించలేదు. ఇటీవలి పరిశోధనలు భవిష్యత్తును గురించి తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీని రూపుమాపడానికి జరిగే ప్రజా ఉద్యమంలో పర్యావరణ పరిరక్షణ కోసం జరిగే ఉద్యమం ప్రత్యక్ష భాగంగా ఉండాలి.

మన చుట్టూ ఉండే గాలీ నీరూ అడవులూ లేకపోతే మన బతుకే లేదు. అయితే సహజ వనరుల నుంచి సరుకు తయారు చేసి లాభాలు చేసుకోవడం కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రాకృతిక వనరులను విచక్షణారహితంగా నాశనం చేస్తుంది. నేటి సామ్రాజ్యవాద వ్యవస్థ అదనపు పెట్టుబడి కోసం, విపరీతమైన లాభాల కోసం ప్రపంచమే వినాశనమయిపోయే పద్ధతులు అవలంభిస్తున్నది. వాహనాలు, వివిధ రకాల పరిశ్రమల నుంచి వెలువడే విషపూరిత వాయువుల వల్ల అత్యంత సహజంగా ఉండవలసిన గాలి ఊహించని స్థాయిలో కలుషితం అయిపోయింది. వీటన్నింటి వల్లనూ భూమి వేడెక్కుతున్నది. ఇప్పుడు 'గ్లోబల్ వార్మింగ్' ఒక ఊతపదం అయిపోయింది.

**ఓజోన్‌ను కాపాడుకోవాలి:**

సూర్య కిరణాలు భూమి మీదకు వచ్చే ముందు వాటిని జల్లెడ పట్టే 'ఓజోన్' వాయు పొర గ్రీన్ హౌస్ గ్యాసెస్ కారణంగా క్షీణించిపోతున్నది. ఈ పొర సూర్యుడి నుంచి వచ్చే అల్ట్రావయొలెట్, ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను భూమి పైకి ప్రసరించకుండా అడ్డుకుంటుంది. పారిశ్రామికీకరణ జరిగిన తరువాత ఇన్ని సంవత్సరాలలో వాతావరణంలోకి వెలువడుతూ వస్తున్న క్లోరీన్ వాయువు ఈ ఓజోన్ పొరను ఇంకా అనేక దశాబ్దాల వరకు నాశనం చేస్తూ ఉంటుంది. రోజు రోజుకూ మరింతగా వెలువడుతున్న ఈ వాయువు వల్ల ఈ నష్టం అనంతంగా సాగుతుంది.

కార్బన్ డైయాక్సైడ్‌తో పాటుగా గ్రీన్ హౌస్ గ్యాసెస్‌గా చెప్పుకునే మిథేన్, కార్బన్ మోనాక్సైడ్ వాయువులు, క్లోరో ఫ్లోరో కార్బన్స్ వంటి వాయువులు గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతున్నాయి. వీటికి ప్రధాన కారణం చమురు, సహజ వాయువుల వెలికితీత, రవాణా కోసం ఉపయోగించే వాహనాలు, వివిధ సరుకుల తయారీ పరిశ్రమలు. బొగ్గు, సహజ వాయువు, చమురు ఉత్పత్తి చేసేటప్పుడు, రవాణా చేసేటప్పుడూ మిథేన్ వెలువడుతుంది. వంట పాత్రలుగా వాడే అల్యూమినియం కరిగించేటప్పుడు కూడా మిథేన్ పుడుతుంది.

15 డిగ్రీల సెంటిగ్రేడ్‌గా ఉండవలసిన భూమి సాధారణ ఉష్ణోగ్రత గడచిన శతాబ్ద కాలంలో 0.6 డిగ్రీలు పెరిగింది. 2100 సంవత్సరం నాటికి ఇది 1.4 నుంచి 5.8 డిగ్రీలు పెరగవచ్చునని శాస్త్రజ్ఞుల అంచనా. 2019లో ఇది 1.5 డిగ్రీలు పెరిగిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో 600 సంవత్సరాలలో భూమి ఉనికే లేకుండా పోతుందని ప్రపంచ ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చెప్పాడు. భూమి వేడెక్కడం వల్ల సముద్రాలు వేడెక్కుతాయి, సముద్ర మట్టం పెరుగుతుంది. ఆహార పంటలు దెబ్బ తింటాయి. వేడిమి వల్ల మలేరియా, డెంగ్ జ్వరం, యెల్లో ఫీవర్, మెదడు వ్యాపు వ్యాధీ మొదలయిన జబ్బులు పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా హెచ్చుతగ్గులుగా భూగర్భ జలాలు కలుషితమయిపోయాయి. అనేక రాష్ట్రాలలో గనులు, పరిశ్రమల సమీప ప్రాంతాలలో భూములు పంటలకు పనికి రాకుండా పోతున్నాయి.

**పర్యావరణ పరిరక్షణ గురించిన సమావేశాలు**

పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే అనర్థాల గురించిన వివరాలు లభ్యమవుతున్న కొద్దీ దాన్ని నివారించుకోవడం గురించిన చర్చ ప్రారంభమయింది. ప్రపంచ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా నాశనం చేస్తున్న సామ్రాజ్యవాదమే భూవినాశనానికి కూడా కారణం అవుతున్నదన్నది మనకు తెలిసిన వాస్తవమే. ఇందుకు వ్యతిరేకంగా వివిధ దేశాలలో వివిధ ప్రజాస్వామిక, విప్లవకర ప్రజా సంఘాలు, సంస్థలు రకరకాల పద్ధతులలో, రూపాలలో ఉద్యమిస్తున్నాయి. ఈ ఉద్యమం మరింత నిర్దిష్ట రూపం తీసుకోవలసిన అవసరాన్ని పెరుగుతున్న వాతావరణ సమస్యలు మరింత బలంగా ముందుకు తీసుకువస్తున్నాయి. వాతావరణ మార్పుల గురించి శాస్త్రీయ విషయాలతో పాటుగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలు వాటి నివారణకు చాలా చేస్తున్నామని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్న వైనాన్ని కూడా మనం తెలుసుకోవాలి.

ఆయా దేశాల సమావేశాలు దాదాపు ఏడాదికి ఒకసారి జరుగుతున్నాయి. ఇందులో 1992లో బ్రెజిల్ రాజధాని రియో డీ జానెరోలో 150 దేశాల సమావేశం మొదటిది. ఆ తరువాత 1997 డిసెంబరులో జపాన్ దేశం క్యోటోలో జరిగిన సమావేశంలో 160 దేశాలు పాల్గొని 'క్యోటో ప్రోటోకోల్' అనే ఒప్పందం చేసుకున్నాయి. ఆనాటికి 20 శాతం గ్రీన్ హౌస్ వాయువుల విడుదలతో ప్రపంచంలో ప్రథమ స్థానంలో నిలిచిన అమెరికా ఈ ఒప్పందంలో చేర నిరాకరించింది. ఇతర దేశాల నుంచి వచ్చిన ఒత్తిడి వల్ల అమెరికా తరువాత లాంఛనంగా సంతకం పెట్టినప్పటికీ తిరిగి 2000వ సంవత్సరంలో ఆ ఒప్పందం నుంచి ఉపసంహరించుకున్నది. ఆనాటికి 17 శాతం విడుదలతో రెండో స్థానంలో ఉన్న రష్యా కూడా క్యోటో ప్రోటోకోల్‌లో భాగం కావడానికి నిరాకరించింది. 2008 నాటికి క్యోటో ప్రోటోకోల్‌లో 181 దేశాలు భాగమయ్యాయి.

2011లో దక్షిణాఫ్రికాలో దర్బన్‌లో కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టిసిపెంట్స్) -17 సమావేశం క్యోటో ప్రోటోకోల్‌ను 2017 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. క్యోటో ప్రోటోకోల్ అమలు చేసినప్పటికీ భూ ఉష్ణోగ్రత 0.1 డిగ్రీ సెంటిగ్రేడ్ మాత్రమే తగ్గుతుంది. 2016లో మొరాకోలో మర్రకేష్‌లో జరిగిన కాప్-22, ఆ తరువాత 23వ సమావేశం జరిగాయి. 2015లో 196 దేశాలు కలిసి ఏర్పరచుకున్న 'పారిస్ ఒప్పందా'న్ని అమలు చేసే ప్రణాళికలు రూపొందించేందుకు 2018 డిసెంబర్ 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పోలండ్‌లో కటోవిస్ నగరంలో 200 దేశాల ప్రతినిధులతో కాప్-24 సమావేశం జరిగింది. దీన్ని కటోవిస్ ఒప్పందం అన్నారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలో వాతావరణ మార్పు పట్ల అమెరికా నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బెర్లిన్, లండన్, బ్రసెల్స్ మొదలయిన నగరాలలో ప్రదర్శనలు జరిగాయి. పారిస్ ఒప్పందం ప్రకారం పర్యావరణానికి ఏ దేశం ఎంత హాని చేస్తే అంత మేరకు కాలుష్యాన్ని తగ్గించే ఏర్పాట్లు కూడా చేయవలసి ఉంటుంది. కాలుష్యానికి కారణం అవుతున్న ఈ దేశాలే ఏ దేశాలు ఎంత కాలుష్యం విడుదల చేస్తున్నాయని నిర్ణయించడం సాధ్యం కాదన్నది సుస్పష్టం.

### గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలలో చైనా, అమెరికాల తర్వాత భారతదేశం

2008 నాటికి ప్రపంచంలో అత్యంతగా గ్రీన్‌హౌస్ వాయువులను వెలువరిస్తున్న దేశం చైనా. ఆ తరువాత స్థానంలో అమెరికా ఉంటే మూడో స్థానంలో ఉన్నది భారతదేశం! 2017 నాటికి ప్రపంచ స్థాయిలో 2 శాతంగా పెరిగిన కర్బన ఉద్గారాలు భారతదేశంలో 4.6 శాతం పెరిగాయి. అలాగే 2016 నాటికి శుభ్రతకు సంబంధించిన ప్రపంచ పర్యావరణ ప్రదర్శన సూచిక (ఈపీఐ)లో 180 దేశాల్లో భారతదేశం 141వ స్థానంలో ఉండగా రెండు సంవత్సరాల తరువాత 177వ స్థానానికి చేరుకుంది. మోదీ స్వచ్ఛ భారత్‌ను ఎండగడుతూ ఇది మరింతగా దిగజారనున్నది. ప్రపంచంలో అత్యంత మురికి ప్రదేశాల్లో భారతదేశం ఒకటిగా ఉన్నది. అలాగే 15 అత్యంత కాలుష్య నగరాలలో 14 భారతదేశంలో ఉన్నాయి.

భారతదేశంలో పర్యావరణ కాలుష్య నివారణా చర్యల విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం 1980లో అడవుల పరిరక్షణ చట్టాన్ని, 1986లో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కాంగ్రెస్ తీసుకువచ్చింది. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణకు ఈ చట్టాలే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. ఇక గంగానది ప్రక్షాళన కార్యక్రమాన్ని 1986లోనే ప్రారంభించారు. ఇదేమంత ప్రభావశీలంగా అమలు కాలేదు. గంగానదిని పరిరక్షించేందుకుగాను భాగీరథిపై మూడు జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల నిర్మాణాన్ని కాంగ్రెస్ రద్దు చేసింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణాన్ని బీజేపీ మళ్ళీ చేపట్టింది. గంగ, దాని ఉపనదులపై మరిన్ని బ్యారేజీల నిర్మాణానికి కూడా పూనుకున్నది. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితులకు మించి కాలుష్యకారక పదార్థాలను విడుదల చేసేందుకు థర్మల్ విద్యుత్కేంద్రాలకు 2017 డిసెంబర్‌లో కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ అనుమతినిచ్చింది. ఈ అనుమతి ఐదేళ్ళపాటు అమలులో ఉంటుంది.

### భూమిని కాపాడుకోవడానికి మిగిలి ఉన్నది పన్నెండేళ్లే

భూమిని కాపాడుకోవడానికి మనకు మరో 12 సంవత్సరాలు మాత్రమే సమయం ఉన్నదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. గడచిన రెండు సంవత్సరాలలో సముద్ర మట్టం 2 నుంచి 3 మిల్లీమీటర్ల ఎత్తు పెరిగింది. అనేక జీవరాశులు అంతరించిపోతున్నాయి. 1850-1900 నాటి ప్రథమ పారిశ్రామికీకరణ కాలంతో పోల్చితే ఈ శతాబ్ద కాలంలో భూమి ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్ అధికమైంది. ఇదే భారతదేశంలో 1.2 డిగ్రీలు పెరిగింది. భూ ఉష్ణోగ్రత మరో 0.5 డిగ్రీ సెంటిగ్రేడ్‌లు పెరిగితే ఘోరమైన పరిణామాలకు దారి తీస్తుంది. దీనిని బట్టి ఆలోచిస్తే భూ ఉష్ణోగ్రత పెరగకుండా ఉండాలంటే 2050 వరకు మరే మాత్రం కలుషిత పదార్థాలు భూ వాతావరణంలో చేరరాదు. 2035 నాటికి ఇది సాధిస్తేనే 2050 నాటికి భూ ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌గా నిలపగలుగుతాం. ఇలా చేయడంలో ప్రధానమయినది చమురు, సహజ వాయువుల వెలికితీత, శుద్ధి పూర్తిగా నిలిపివేయడం.

ప్రపంచవ్యాప్త వాతావరణ పరిరక్షణ సమావేశాలు, పర్యావరణ శాస్త్రజ్ఞులూ పర్యావరణ పరిరక్షణకు, గ్రీన్ హౌస్ గ్యాసెస్ తగ్గింపునకూ సాంకేతిక పద్ధతులను సూచిస్తున్నారు. కార్బన్ డయాక్సైడ్‌ను గాలి నుంచి పీల్చి భూగర్భంలో నిలవ చేయడం ఒక పద్ధతి. ఉద్గారాలను కొలిచే ప్రమాణాలను, పర్యవేక్షక యంత్రాంగాన్ని, వనరులనూ ఏర్పాటు చేసుకోవడం మరో పద్ధతి. ఈ పద్ధతులన్నీ సామ్రాజ్యవాద వ్యవస్థ చట్రంలోనే అమలు చేసేవి, ఆచరణలో దాదాపుగా

ఉపయోగపడనివి. ముడి సరుకు కోసం ఒక పక్క నుంచి అమెరికా సామ్రాజ్యవాదం, మరో పక్క నుంచి చైనా సోషల్ సామ్రాజ్యవాదం దేశాలకు దేశాలనే నాశనం చేస్తున్న ప్రస్తుత పరిస్థితిలో పై పద్ధతులు కాగితాలకే పరిమితం అవుతాయన్నది మనకు అర్థమయ్యే విషయమే. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధమే దారి చూపిస్తున్నది.

**వాతావరణ మార్పుల ప్రభావం**

వాతావరణ మార్పు వల్ల ఏర్పడుతున్న విపరీత పరిస్థితులు నిత్యం మన దృష్టిలోకి వస్తూనే ఉన్నాయి. ఎండలు పెరగడం, వర్షాలు తగ్గడం, వర్షాలు అధికంగా రావడం, సరైన సమయానికి రాకుండా పోవడం, వరదలు, కరువు ఇలా ఒక్కో చోట ఒక్కో రకమైన పరిస్థితిని చూస్తున్నాం. శీతల ప్రదేశాలలో సయితం వేడిమి పెరుగుతున్నది. ఐరోపా దేశమైన బెల్జియంలో 2019లో ఒక మహిళ ఎండ తాకిడికి మరణించింది. ఆస్ట్రేలియాలో గడచిన దాదాపు 80 సంవత్సరాలలో ఎరుగనంతటి ఉష్ణోగ్రత నమోదయింది. అమెరికా నేషనల్ ఓసియానిక్ ఎట్మాస్ఫియరిక్ ఎడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ) ప్రకారం 1880 తరువాత 2019 జులై నెలలో అత్యంత అధిక ఉష్ణోగ్రత నమోదయింది. అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలో అడవులు కాలిపోతున్నాయి. మరో పక్క అమెరికాలో ఉష్ణోగ్రత మైనస్ 20 డిగ్రీల వరకు పడిపోతున్నది. సహారా ఎడారిలో మంచు పడుతున్నది. ఇక పరిశ్రమల నుంచి వెలువడే సల్ఫైడ్‌లు, జింక్ మొదలయిన వాయువుల వల్ల ఊపిరితిత్తుల సమస్య, శ్వాసకోశ సమస్యలు ముఖ్యంగా ఆ పరిశ్రమల సమీప ప్రాంతాలలో నివసించే ప్రజలకు నిత్యం ఉంటుంటాయి.

**అమెజాన్ అడవిలో మంటలు – మానవాళికే చేటు**

ప్రపంచ వాతావరణ పరిస్థితిపై ఇటీవలి కాలంలో కాలుతున్న అమెజాన్ అడవి గురించి చర్చ జరుగుతున్నది. ఈ వర్తమాన ఉదాహరణ నుంచి ప్రపంచవ్యాప్త పరిస్థితిని చాలా వరకూ అర్థం చేసుకోవచ్చు. దక్షిణ అమెరికా బ్రెజిల్ దేశంలో 60 శాతంగాను, మిగిలిన 40 శాతం కొలంబియా, బొలీవియా, ఈక్విడార్, గునియా, పెరూ, సుర్‌నామ్ దేశాల్లోనూ 70 లక్షల చదరపు కిలోమీటర్ల మేర ఉన్న అమెజాన్ అడవి ప్రపంచంలోకెల్లా అతి పెద్దది, అత్యంత అవసరమైనది. ఈ మంటలకు మెక్ డొనాల్డ్, బర్గర్‌కింగ్, సబ్‌వే, నెస్లే, కార్గిల్ వంటి బహుళ జాతి కంపెనీలే కారణం. అలాగే ట్రంప్‌కు సన్నిహితంగా ఉండే బ్రెజిల్ కంపెనీల యజమానులు ధాన్యాలు, సోయాబీన్ల ఎగుమతి కోసం అమెజాన్‌లో జాతీయ రహదారి బిఆర్–163 నిర్మాణం తలపెట్టి అడవులు నరికి మంటలు పెడుతున్నారు. ఇప్పటికే బ్రెజిల్ రాష్ట్రం పారాలో సోయాబీన్లు పండించి సముద్ర మార్గంలో రవాణా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు బ్లాక్‌స్టోన్, పాట్రియా, హింద్రోవియాస్‌లు టెర్మినల్ నిర్మాణానికి 50 శాతం పైగా పెట్టుబడులు పెట్టాయి.

బోల్సనారో వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి పేరిట వ్యవసాయ బిజినెస్‌కు, ఖనిజ సంపదల దోపిడీకీ ఉపకరించే గనుల తవ్వకానికి విస్తృతంగా అవకాశాలు కల్పించాడు. హైడ్రోఎలక్ట్రికల్ ప్లాంటు, ఓబిడోస్ బ్రిడ్జిలకు అనుమతి ఇచ్చాడు. వీటి కోసం 10 లక్షల మంది ఆదివాసులను వెళ్లగొట్టేందుకు పథకాలు వేగంగా అమలు చేస్తున్నాడు. అతను అధికారంలోకి వచ్చి సంవత్సరం కాకుండానే బ్రెజిల్‌లో 1330 చదరపు మైళ్ల అడవి నాశనం అయిపోయింది. 2019 ఆగస్ట్ మూడో వారంలో ఫ్రాన్స్ దేశం బియారిట్స్‌లో జరిగిన జి–7 దేశాల సమావేశంలో అమెజాన్ రక్షణ గురించి నామమాత్రపు చర్చ చేశారే తప్ప అవసరమైన చర్యలు తీసుకునేందుకు పూనుకోలేదు.

అమెజాన్ అడవే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో గడచిన ఏడాది కాలంలో మూడు కోట్ల తొంభై లక్షల ఎకరాల్లో చెట్లు నాశనమయ్యాయి. ఇందులో 89 లక్షల ఎకరాల వరకు వర్షారణ్యాలు. 1990 నుంచి 2000 మధ్య కాలంలో ఏటా దాదాపు నాలుగు కోట్ల చెట్లు నరికివేతకు గురయ్యాయి. మన దేశంలోనూ అడవుల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజల నిరసన ఎప్పటికప్పుడు వస్తూనే ఉన్నది.

**ఢిల్లీలో వాయు కాలుష్యం, తెలుగు రాష్ట్రాలలో యురేనియం తవ్వకాలు**

ఇటీవలి కాలంలో మన దేశంలో ప్రచారమయిన ఒక వాతావరణ అనర్థం ఢిల్లీలో వాయు కాలుష్యం. ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయినందువల్ల నగరంలో స్కూళ్ళను కూడా మూసివేయవలసి వచ్చింది. కొత్త కార్లను ఇక ఢిల్లీ రోడ్ల మీదకు రానివ్వరాదని ఇప్పటికి 20 ఏళ్ల క్రితమే సెంటర్ ఫర్ సైన్స్ ఎండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) ఢిల్లీ హై కోర్టులో కేసు వేసింది. కానీ ఆ సమస్య పెరిగిందే తప్ప తగ్గలేదు. ఆనకట్టలు అశాస్త్రీయంగా నిర్మించడం, వాటి ఎత్తు పెంచడం వంటి వాటిపై దేశంలో వివిధ రాష్ట్రాలలో ప్రజలు ఉద్యమిస్తూనే ఉన్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విషయానికి వస్తే ఒక సంవత్సర కాలంగా యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, వివిధ ప్రాంతాల ప్రజా ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. తెలంగాణా–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలో 76 చదరపు కిలోమీటర్ల మేర చెంచు, యానాది ఆదివాసులు నివసించే ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన యురేనియం తవ్వకాలు ఆ ప్రాంతాన్నే కాక అత్యంత దూర ప్రాంతాలలో సయితం అనేక సంవత్సరాల పాటు తీవ్రమైన హాని కలిగిస్తుంది. ఈ యురేనియం తవ్వకాలలోనూ బహుళజాతి కంపెనీ డీ బీర్స్‌తో ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందమే కారణం. మనిషి మనశ్శరీరాలను ఛిద్రం చేసే యురేనియం విడుదలను నిలిపివేయకపోతే కలిగే నష్టం ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవడానికి జార్ఖండ్ రాష్ట్రం జాదూగూడ ప్రాంత ప్రజలు ప్రత్యక్ష సాక్ష్యం.

*(మిగతాది 13వ పేజీలో...)*

ఎంగెల్స్ 200వ జయంతి సందర్భంగా...

# మార్క్స్ నుండి విడదీసి చూడలేని మహోపాధ్యాయుడు ఎంగెల్స్

మార్క్స్‌తో కలిసి సమానంగా నడిచి, కార్మికవర్గ సిద్ధాంతాన్ని అందించి, ప్రపంచ కార్మికవర్గాన్ని నడిపించిన మహోపాధ్యాయుడు ఎంగెల్స్. పెట్టుబడిదారీ వర్గంలో పుట్టి కార్మికవర్గ తత్వాన్ని అలవరుచుకున్నాడు. 1820 నవంబర్ 28న బార్‌మెన్ పట్టణం ప్రష్యా (జర్మనీ) లో జన్మించాడు. ఎంగెల్స్ తండ్రి నూలు దారాన్ని ఉత్పత్తి చేసే పరిశ్రమకు యజమాని. తన కుమారుడు పారిశ్రామికవేత్త కావాలని ఆశించాడు. తండ్రి కోరికకు విరుద్ధంగా ఎంగెల్స్ పరిశ్రమలు, పారాశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల పుట్టుక, ఎదుగుదల, వారి సంపద వెనుక నలిగిపోతున్న కార్మికుల జీవితాలను అధ్యయనం చేసి ప్రపంచ శ్రామిక వర్గానికి తమ జీవితాలను మార్చాలనే మహత్తరమైన సిద్ధాంత ఆయుధాలను అందించాడు.



ఎంగెల్స్ 1842లో ఇంగ్లండ్‌లోని పారిశ్రామికాభివృద్ధి దానికి పూర్వ రంగంలో ఉన్న కార్మికవర్గ స్థితిగతులపై 21 నెలల పాటు అధ్యయనం చేశాడు. కార్మికవాడల్లో పర్యటించి, కార్మిక కుటుంబాలతో కలిసి ఆనాటి దుర్భర పరిస్థితులను స్వయంగా పరిశీలించి అధికార రికార్డులు, వార్తా పత్రికల్లోని సమాచారాన్ని విశ్లేషించి 24 ఏళ్ల వయస్సులోనే 'ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు' అనే గ్రంథాన్ని 1845లో జర్మన్ భాషలో రాశాడు. ఏంగెల్స్ ఇంగ్లాండు కార్మికరంగాన్ని అర్థం చేసుకున్న క్రమంలోనే కార్మికవర్గం యొక్క చారిత్రక పాత్రను గుర్తించాడు. ఆర్థిక పునాది ప్రాధాన్యతను గుర్తించి, మార్క్స్‌ని అర్థశాస్త్ర అధ్యయనానికి ప్రోత్సహించాడు. మార్క్స్ గుర్తించిన తత్వశాస్త్ర ప్రాధాన్యత, చారిత్రాక దృష్టికి ఏంగెల్స్ అభిప్రాయాలు తోడై శాస్త్రీయసోషలిస్టు సిద్ధాంతానికి ఎంతో సహకరించాయి.

కమ్యూనిస్టు సిద్ధాంతానికి తాత్విక ప్రాతిపదిక అయిన చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని 1844లో 'జర్మన్ ఐడియాలజీ' అనే గ్రంథంలో మార్క్స్‌తో కలిసి ఎంగెల్స్ వివరించాడు. సామాజిక మార్పుకు చోదక శక్తులుగా కార్మిక వర్గాన్ని గుర్తించి వర్గాలుగా ఉన్న సమాజాన్ని మౌలికంగా మార్చడానికి కావల్సిన సిద్ధాంతాన్ని ప్రతిపాదించి కార్మిక వర్గానికి అసలు సిసలు మిత్రునిగా ఎంగెల్స్ నిలిచాడు.

మార్క్స్, ఎంగెల్స్‌ల పరస్పర మేధో వికాసానికి వారి మధ్య జరిగినచర్చలు, ఆలోచనల ఘర్షణలు ఎంతో దోహదపడి శాస్త్రీయసోషలిస్టు సిద్ధాంతానికి పునాదులు వేశాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం ఏర్పడడానికి దోహదపడింది. వీరిద్దరి ఉమ్మడి అవగాహనతో ఎంగెల్స్ తయారు చేసిన దానికి చిన్న చిన్న మార్పులు మార్క్స్ చేయగా 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' రూపుదిద్దుకుంది. శ్రామికవర్గ విప్లవం వర్గాల అస్థిత్వాన్ని రద్దు చేస్తుందని, అటువంటి విప్లవ ఆవశ్యకతను ఎంగెల్స్ తాను 1880లో రాసిన 'శాస్త్రీయ సోషలిజం'లో వివరించాడు.

ప్రపంచ కార్మికవర్గ నాయకుడైన ఎంగెల్స్ విప్లవ జీవితం 1847లో మాంచెస్టర్ నుండి మొదలై చివరి వరకు కార్మికోద్యమాలతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి వుండి దిశా నిర్దేశం చేశాడు. 1848లో జర్మనీలోని ప్రజాస్వామిక విప్లవంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సాహసిక యోధుడు.

మార్క్స్, ఏంగెల్స్ చేసిన రచనలు ప్రామాణికమైనవి. ఏంగెల్స్ పేరుతోనే వెలువడినవి కూడా ఉన్నాయి. ఏంగెల్స్ రచనల్లో ప్రముఖమైనవి అనేకం ఉన్నాయి. అందులో ఒకటి డూరింగ్‌పై విమర్శ 'యాంటీ డూరింగ్' (డూరింగ్ ఖండన) పేరుతో ప్రచురితమయ్యింది. ఆ డూరింగ్ ఒక జర్మన్ పండితుడు. శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాల పేరుతో మార్క్స్‌ను ఖండిస్తూ తన వాదనలను పుస్తకరూపంలో తెచ్చాడు. ప్రకృతి శాస్త్రాలను, భౌతిక, రసాయన శాస్త్రాలను, గణితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఏంగెల్స్ శాస్త్ర ప్రమాణాలతో డ్యూరింగ్ తప్పుడు సిద్ధాంతాలను ఎండగట్టాడు. మార్క్స్ ఆవిష్కరించిన "చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే," పెట్టుబడికి శ్రమకు మధ్య ఉన్న సంబంధం, అదనపు విలువ మూడింటి ఆధారంగా శాస్త్రీయ సోషలిజాన్ని వివరిస్తూ 1880లో 'సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం'ను రచించాడు. ఇందులో తత్వశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, సామాజిక శాస్త్రాల ప్రస్తావన ఉంది. అందులో మూడు భాగాలు తీసి "సోషలిజం–ఊహాజనితం–శాస్త్రీయం" అనే చిన్న పుస్తకంగా తెచ్చాడు.

చారిత్రాత్మకమైన 1525 నాటి జర్మన్ రైతాంగ తిరుగుబాటు గురించి ఏంగెల్స్ 'జర్మనీలో రైతు యుద్ధం' అనే గ్రంథాన్ని 1850లో రాశాడు. ఈ రచన ద్వారా రైతాంగం పాత్రను గుర్తించిన మార్క్స్, ఏంగెల్స్ జర్మన్ విప్లవం రైతాంగం మద్దతుపై ఆధారపడి విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు.

ఏంగెల్స్ రచనా వ్యాసంగంలో చెప్పుకోదగినవి మరికొన్ని ఉన్నాయి. చార్టిస్టు ఉద్యమ పత్రిక 'నార్త్ స్టార్'కూ ఓవనైట్ ఊహాజనిత సోషలిస్టు ఉద్యమం పత్రిక "నూతన నైతిక ప్రపంచం"కు అలాగే న్యూరేనిష్ జేటుంగ్‌కు రాసిన రచనలు అనేకం ఉన్నాయి. ఏంగెల్స్ రచనల్లో అర్థశాస్త్ర విమర్శనా వ్యాసాలకు చాలా ప్రాధాన్యత ఉంది. గృహవసతి సమస్యలపై అద్భుతమైన వ్యాస పరంపరను రాశాడు.

1875-76లలో "డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్" (ప్రకృతి గతితర్కం) అనే గ్రంథన్ని ఏంగెల్స్ రాశాడు. ఇది అసంపూర్తి రచనగానే మిగిలిపోయింది. ఇది ఆయన మరణానంతరం 1927లో వెలుగుచూసింది. ఇందులోని తొమ్మిదవ అధ్యాయం "వానరుడు నరుడుగా మారిన పరిణామ క్రమంలో శ్రమపాత్ర"లో మానవ స్వభావం, అభివృద్ధి గురించి మార్క్సిస్టు దృక్పథాన్ని ఉత్తమంగా వివరించింది. "శ్రమయే మానవుడిని సృష్టించింది. ప్రకృతిసూత్రాలను తెలుసుకొని సరిగ్గా వినియోగించడం వలననే ప్రకృతిపై ఆధిపత్యం ఏర్పడింది" అన్నాడు ఏంగెల్స్.

ఏంగెల్స్ రాసిన ప్రామాణిక మార్క్సిస్టు గ్రంథాలలో ఉత్తమమైనది "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక". గతం, వర్తమానం పట్ల శాస్త్రీయ అవగాహనను పెంచే లక్ష్యంతో 1884లో ఈ రచన చేసాడు. జీవశాస్త్రానికి డార్విన్ పరిణామవాద సిద్ధాంతం ఎంత ముఖ్యమో, ఆర్థిక శాస్త్రానికి మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం ఎంత ముఖ్యమో, నాగరిక సమాజాలలో కనిపించే తండ్రి హక్కు గణాలకు పూర్వం తల్లి హక్కు గణాలు ఉండేవని మోర్గన్ కనిపెట్టిన అంశం అంతే ముఖ్యమని కుటుంబ వ్యవస్థ చరిత్రను మొట్టమొదటి సారిగా లూయిస్.హెచ్.మోర్గన్ బయట పెట్టాడని ఎంగెల్స్ చెబుతాడు. జీవ పరిణామ సిద్ధాంతాన్ని చార్లెస్ డార్విన్ శాస్త్రీయ ఆధారాలతో అందించినట్లుగానే ఎంగెల్స్ సమాజ పరిణామ క్రమాన్ని 'కుటుంబం, వ్యక్తిగతఆస్తి, రాజ్యాంగయంత్రాల పుట్టుక' అనే గ్రంథంలో వివరించాడు. ఇది మానవ సమాజ పరిణామ క్రమాన్ని ఆధారాలతో వివరించిన మార్క్సిస్టు సైద్ధాంతిక ప్రామాణిక గ్రంథం.

1844-83ల మధ్య కాలంలో మార్క్స్, ఏంగెల్స్ మధ్య 1,386 ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. తర్వాత వాటిని నాలుగు సంపుటాలుగా ప్రచురించారు. ఆ లేఖల్లో విషయాలు వారిద్దరి మధ్య నున్న భావసమైక్యతను గొప్పగా కళ్ళకు కడతాయి. వాటిలో వున్న శాస్త్రీయత, రాజకీయ విజ్ఞానం ఎంతో గొప్పది. ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలోని అతిముఖ్యమైన ఎత్తుగడలు, కర్తవ్యాలు, కార్యక్రమం రూపొందిన క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో సహాయపడతాయి. వారిమైత్రి అపూర్వమైనది. ఆ ఉత్తరాలు విజ్ఞాన దీపికలు.

అత్యంత శ్రమ, ఉత్సాహంతో కూడిన వారిద్దరి కృషి, చెరగని మైత్రి 1883 వరకు గాఢానుబంధంగా సాగింది. 1883 మార్చి 14న మార్క్స్ దీర్ఘ నిద్రలోకి వెళ్లిపోయాడు. మిత్రుని సమాధి దగ్గర ఏంగెల్స్ ఉపన్యాసం చారిత్రాత్మకమైనది. ప్రపంచంలోని గొప్ప ఆలోచన ఆగిపోయిందన్నాడు. మార్క్స్ మరణానంతరం ఏంగెల్స్ ఒక్కడే యూరప్‌లోని సోషలిస్టు ఉద్యమకారులకు మార్గదర్శకత్వాన్ని అందించాడు. వయోవృద్ధుడైన ఏంగెల్స్ విజ్ఞాన అనుభవాన్ని వారంతా స్వేచ్ఛగా వినియోగించుకున్నారు.

మార్క్స్ రచనల్లో 'దాస్ కాపిటల్'కున్న స్థానం గొప్పది. మార్క్స్ జీవితకాలంలో మొదటి భాగం మాత్రమే ప్రచురించబడింది. 2వ భాగం 1885లోను, మూడవభాగం 1894లోను ఏంగెల్స్ కృషి ఫలితంగా ప్రచురించబడినాయి. మార్క్స్ రాసిన పెట్టుబడి చిత్తుప్రతుల నుండి రెండు, మూడు భాగాలను తయారుచేయడం మాములువిషయం కాదు. ఆ రచనకున్న ప్రాధాన్యతను గుర్తించిన ఏంగెల్స్, మార్క్స్ ఆలోచనా ప్రవాహాన్ని సంపూర్ణంగా ఆకలింపు చేసుకున్నాడు కాబట్టి ఆ మహాత్కార్యాన్ని భుజాలపైకెత్తుకొని విజయం సాధించాడు. పెట్టుబడి గ్రంథం ఇచ్చిన సామాజిక జ్ఞానం అమూల్యమైనది.

1889 జూలై 14న పారిస్‌లో బాస్టిల్ పతనపు శతజయింతి మహాసభ జరిపిన సందర్భంగా రెండవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచి, దానికి నాయకత్వం వహించాడు. మార్క్సిజానికి వ్యతిరేకంగా వచ్చిన అన్యవర్గ సిద్ధాంతాలను, రివిజనిస్టు పోకడలను ఎదుర్కొన్నాడు. సైద్ధాంతిక, రాజకీయ రంగాలలో మార్క్స్, ఏంగెల్స్ జరిపిన పోరాటాల ఫలితంగా యూరప్‌లో వర్గపోరాటం నిశితమైంది.

ఏంగెల్స్ వ్యక్తిగత జీవితంగురించి ప్రపంచానికి తెలిసినది తక్కువ. కుటుంబంలో తండ్రి నిరంకుశత్వం కారణంగా తన ఆలోచనకు భిన్నమైన వృత్తి చేపట్టడం గురించి తెలుసు."బూర్జువాగా వుండడం దుర్భరపరిస్థితి, బూర్జువాగా ఉండేవాడు కార్మికవర్గ వ్యతిరేకిగా వుండితీరాలి. నా ఉద్యోగమే నేను చేసుకుంటున్నా, ఇదంతా దుర్భరంగా వుందినాకు" అని మార్క్స్‌కు రాసిన లేఖలో ఏంగెల్స్ తన పరిస్థితిని వివరించాడు.

## జూలై 17 నుండి ప్రారంభమైన

## కామ్రేడ్ చారుమజుందార్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



కలకత్తాలో జరిగిన చారుమజుందార్ శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభ

"కలలు కనలేని వాడు
ప్రజల్ని కలల్లో ముంచెత్తలేని వాడు
విప్లవకారుడు కాలేదు"
- చారుమజుందార్

1919 జూలై 17న జన్మించిన చారుమజుందార్ 53 ఏళ్లకే 1972 జూలై 28న పోలీసు చిత్రహింసల్లో అమరుడయ్యాడు. నక్సల్బరీ నిర్మాత, భారత ప్రజాస్వామిక విప్లవ పంథాను ఆవిష్కరించిన మన ప్రియతమ నాయకుడు చారుమజుందార్ జన్మించి నూరేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా శతజయంతి వేడుకలు జరుగుతున్నాయి.

భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కామ్రేడ్ చారుమజుందార్ పాత్ర విశిష్టమైనది. భారత విప్లవోద్యమాన్ని పెద్ద మలుపుతిప్పిన ఆయన ఆలోచనలు, 1969 ఏప్రిల్ 22న నిర్మాణమైన సీపీఐ (ఎంఎల్) 50 సంవత్సరాలకు పైగా అలలు అలలుగా పురోగమిస్తున్నాయి. చారుమజుందార్ ఎత్తిపట్టిన విప్లవ పంథా రివిజనిజం నడ్డి విరిచింది. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో సాయుధ పోరాటం అనేక ప్రాంతాలకు విస్తరిస్తున్నది. గెరిల్లా జోన్లను ఏర్పరిచి గెరిల్లా బేసులలో జనతన సర్కార్లను నిర్మించి, విముక్తి ప్రాంతాల ఏర్పాటుకై ముందుకు సాగుతున్నది. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల స్ఫూర్తి, చారుమజుందార్ పోరాటశీలత నాటి యువతరాన్ని ఉగ్రూతలూగించాయి. నక్సల్బరీ పంథా - భారత విప్లవ పంథాను ఆవిష్కరించిన చారుమజుందార్ భారత విప్లవ ధృవతార. భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.

జోహార్ కామ్రేడ్ చారుమజుందార్.

---

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించడంలో మార్క్స్ విజయం సాధించాలనే బలమైన కోరికతో తనకి ఇష్టం లేని ఉద్యోగాన్ని చేస్తూ మార్క్స్ కుటుంబ భారాన్ని స్వయంగా స్వీకరించి 20 సంవత్సరాలు పోషించాడు. వ్యక్తిగత ఆస్థిని రద్దు చేయాలనే సిద్ధాంతాన్ని నమ్మిన ఎంగెల్స్ తనకి వారసత్వంగా వచ్చిన ఆస్థిని కార్మికవర్గ ప్రయోజనాల కోసమే అర్పించిన త్యాగధనుడు. రాజకీయంగా, సైద్ధాంతికంగా మార్క్స్ భావాలతో మమేకమై సమానంగా పని చేసినా గానీ, తన పేరు ప్రతిష్టల కోసం ఏనాడు ఆలోచించని వినయశీలి.

కార్మికోద్యమంలో క్రియాశీలంగా పని చేసే కార్మిక మహిళ మేరీబరన్స్‌ని పెళ్లి చేసుకుని, సగటు కార్మికునిగా జీవితాన్ని కొనసాగించిన నిరాడంబరుడు. ఏంగెల్స్‌ను ప్రేమించి సహజీవనం చేసిన మేరిబరన్స్ 1863లో అనారోగ్యంతో చనిపోయింది. ఆమె చెల్లెలు లిజ్జీబరన్స్‌ను 1864లో వివాహం చేసుకున్నాడు. 1878లో లిజ్జీబరన్స్ కూడా అనారోగ్యంతో చనిపోయింది, ఏంగెల్స్‌కు పిల్లలులేరు. చివరిగా 1893లో జర్మన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా దేశాలను పర్యటించి అక్కడి ఉద్యమాలకు అవసరమైన సలహాలనందించాడు. వృద్ధాప్య సమస్యలు, కనులు సరిగా కనబడక పోవడంతోపాటు 75వ ఏట గొంతు క్యేన్సర్ వ్యాధితో కొన్నినెలలు బాధకు గురయ్యాడు. 1895 ఆగస్టు 5న, ఫ్రెడరిక్ ఏంగెల్స్ లండన్‌లో తుదిశ్వాస విడిచాడు. శ్రామికవర్గ యోధుడు, శ్రామికవర్గ సిద్ధాంతకర్త అయిన ఏంగెల్స్ చిరస్మరణీయుడు. శ్రామికవర్గ విముక్తిని బోధించిన ప్రపంచ కార్మికవర్గ నాయకుడు.

గతితార్కిక భౌతికవాదాన్ని ఆవిష్కరించి, సామాజిక చలన నియమాన్ని శాస్త్రీయంగా నిరూపించిన మార్క్సిజాన్ని ఆచరణాత్మక సిద్ధాంతంగా రూపొందించారు మార్క్స్, ఎంగెల్స్. మార్క్స్ నుండి విడదీయలేని స్థానాన్ని స్థిర పరచుకున్న ఎంగెల్స్ చరిత్రలో అభివృద్ధికరంగా పోగుపడిన జ్ఞానానికి వారసుడుగా, నిలువెత్తు నిదర్శనంగా, భావితరాల జ్ఞానంలో వెలుగొందే ఏంగెల్స్ మన కార్యచరణలో మార్గదర్శిగా నిలుస్తాడు. ★

# రైతుల వ్యవసాయాన్నీ రైతాంగ జీవితాలనూ కడతేరుస్తున్న దేశ వ్యవసాయ విధానాలు

మన భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. రైతే దేశానికి వెన్నెముక. కానీ, ఏయేటికాయేడు దేశ పాలకవర్గాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం రైతుకు భారంగా మారుతోంది. వ్యవసాయానికి బంధీ అయిన పేద, మధ్య తరగతి రైతుల సేద్యం యేటేటా కుంటుపడుతూ వదులుకునే దుస్థితికి చేరుతోంది. ఆశించిన ఫలసాయం కరువై ఆదాయాలు పూర్తిగా సన్నగిల్లి అప్పుల పాలవుతున్న వారి బతుకులు ఛిద్రమవుతూ అంతిమంగా కడతేరుతున్నాయి. రైతు జీవితాలను అతలాకుతలం చేస్తున్న పలు సమస్యలను తెలుసుకునే ముందు హరిత విప్లవ జనకుడు, సరళీకృత ఆర్థిక విధానాల పరమ సమర్థకుడు స్వామినాథన్ 2004లో ప్రభుత్వానికి చేసిన సిఫారసులను కూడా తెలుసుకోవాలి. దేశంలో రైతులంతా తమ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సిఫారసులను అమలు చేయాలని తరచూ బ్రహ్మరథం పడుతూంటారు. సరే! వాటి అమలుకై డిమాండ్ చేయడం అవసరమే! కానీ, నిజానికి ఆయన చేసిన సిఫారసులను లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయడం చాలా అవసరం. అపుడే భూమిలేని రైతుల, పేద రైతుల, చిన్న రైతుల మౌలిక సమస్యలను ఆ సిఫారసులు ఎంతమాత్రం పరిష్కరించవనే స్పష్టతకు రావడమే కాకుండా ఆయన ఏ వర్గాలకు అనుకూలమో హేతుబద్ధంగా బోధపడుతుంది.

2004లో ఏర్పడిన జాతీయ రైతు కమిషన్ అధ్యక్షుడు వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్.ఎస్. స్వామినాథన్ 2006లో ప్రభుత్వానికి సమర్పించిన తన 6 నివేదికలలోని అంశాలను ముందు సంక్షిప్తంగా చూద్దాం.

1. భూ సంస్కరణలు చేపట్టి బంజర్ భూములను పేదలకు పంచాలి. వ్యవసాయ భూములకు సాగునీరు సమకూర్చాలి.

2. ప్రజలకు ఆహార భద్రత కల్పించి పౌష్టికాహార లోపాన్ని ఎదుర్కోవాలి.

3. రైతు పండించిన పంట ఉత్పాదక ఖర్చుపై 50%అధికంగా పంట ధర నిర్ణయించాలి.

4. రైతులకు చౌక ధరలకు నాణ్యమైన విత్తనాలు సమకూర్చాలి.

5. రైతులకు ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని అందించడానికి గ్రామాల్లో విజ్ఞాన చావడిలు ఏర్పర్చాలి.

6. మహిళా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇవ్వాలి.

7. ప్రకృతి వైపరీత్యాలలో రైతులను ఆదుకోవడానికి విపత్తు నిధులను ఏర్పర్చాలి.

8. కార్పోరేట్ వర్గాల వ్యవసాయేతర అవసరాలకోసం రైతుల పంట భూములను, అడవులను ఇవ్వకూడదు.

9. అన్ని పంటలకు బీమా సదుపాయం ఉండాలి.

10. పేదలు, అవసరమైన ప్రతి వారికి వ్యవసాయ రుణాలు అందచేయాలి.

11. పంట రుణాలపై బ్యాంకు వడ్డీ రేటు 4%కి మించకూడదు.

12. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న 28%ప్రజలకు ఆహార భద్రత కల్పించాలి.

13. రుణాల వసూళ్లలో వెసులుబాటు ఉండాలి.

## సాగు నీటి సంక్షోభం

దేశంలోని 13ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలలో అధిక దిగుబడికి పేరొందిన 100జిల్లాలు గత 15సంవత్సరాలుగా పదే పదే నీటి ఎద్దడికి గురవుతున్నాయి. దేశంలో 1951లో ఉన్న తలసరి నీటి లభ్యత 5,300క్యూ.మీ. ఇపుడు అందులో నాల్గవ వంతుకు 1,544క్యూ.మీ కు దిగింది. హరిత విప్లవం అంటూ అధిక నీటి వినియోగంతోనే పండే హైబ్రిడ్ విత్తనాలను రైతుల పోలాల్లోకి తెచ్చి, జలవనరుల కాలుష్యాన్ని పరాకాష్టకు చేర్చి, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ రుతుపవనాల చేతిలో నీటి సమస్య లేకుండా చేసేసి ఇపుడేమో నీటి పొదుపు ఉద్యమాల గూర్చి 'మన్ కీ బాత్'లు వినిపిస్తున్నారు. నీటి తీరువా అంటూ రాగం తీస్తున్నారు. బిందు సేద్యం, తుంపర సేద్యం పాట పాడుతున్నారు. ఏ పూటకు ఆ పాట పాడే పాలకులు మహారాష్ట్రలో జలయుక్త్ శిబిర్ అంటే, తెలంగాణలో 'మిషన్ భగీరథ' అంటూ గతంలో అపార లాభాపేక్షతో అనుమతించిన అత్యాశ చర్యలను కప్పిపెట్టుకుంటూ అల్ప సంతోషులైన ప్రజలను బుజ్జగించడానికి కొత్త సంస్కరణల పాట పాడుతున్నారు. దేశంలో 52నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేసి అదనంగా 70లక్షల హెక్టార్లకు నీరు అందివ్వగలిగామనీ, మరో 47ప్రాజెక్టులపై పని నడుస్తోందనీ అందుకు 1.30లక్షల కోట్లు 2019-20బడ్జెట్లో కెటాయించామనీ మోదీ ప్రభుత్వం గొప్పగా లెక్కలందిస్తోంది. 'ఏక్‌రాష్ట్-ఏక్‌గ్రిడ్' దిశలో విద్యుత్ సరఫరా పనులు వేగవంతం అయ్యాయంటోంది. దేశంలోని 22లక్షల చెరువులలో అనేకం కనీసం పూడికకైనా నోచుకోని దుస్థితిలో వున్నాయన్న వాస్తవాన్ని చూడగలిగితే, అలాగే గత ఆనకట్టల వైనం తెలిసినవారు ఈ కాగితాల లెక్కలతో మరిన్ని వాస్తవాలను ఆ దిశలో అర్థం చేసుకో గలుగుతారు.

తాగు, సాగు నీటికి కటకటగా ఉండే అరబ్ ప్రపంచంలో తిష్ట వేసిన ఇజ్రాయెల్ వ్యవసాయ సాగు పద్ధతులతో మన రైతాంగాన్ని మురిపిస్తూ పాలకులు తెగ ప్రచారం చేస్తున్నారు. అక్కడ పంటల వృథా మూడు శాతం మాత్రమే, అక్కడ వ్యవసాయం ఒక పరిశ్రమగా సాగుతోంది, నేల స్వభావాన్ని బట్టి అక్కడ పంటలను సాగు చేస్తున్నారు, మార్కెట్‌ను బట్టి పంటను ఎంచుకుంటున్నారు, వారు ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తున్నారు, పంట సాగు అనంతరం వాటి నిల్వ, శుద్ధి, ప్యాకేజింగు, రవాణా, ఎగుమతి సౌకర్యాల లభ్యత వంటివి అందుబాటులో ఉండటం వరంగా మారింది అంటూ అంతా సంపన్నుల పంటల ప్రయోజనాలను ఏకరువు పెడుతున్నారు.

మధ్యప్రదేశ్ 'హరిత విప్లవం' సాధించిన రాష్ట్రం అంటూ ఘనంగా చెపుతుంటారు. కానీ వాస్తవాలు విరోధాభాసంగానే ఉన్నాయి. మూడు శతాబ్దాల క్రితం వ్యవసాయ స్వర్ణసీమగా గణుతికెక్కిన బుందేల్‌ఖండ్, ప్రపంచంలో వన్నె తెచ్చిన నూలు గుడ్డలను అందించిన దాని పాత్ర వర్తమాన పాలకుల 'హరిత విప్లవం' హయాంలో పూర్తిగా మాయమైంది. అక్కడి గంగా-యమునల సంఘమంలోని నల్ల రేగడి భూములు చెరకు, పత్తి పంటలకు ప్రసిద్ధి. కానీ గత 15యేండ్లుగా వరుస నీటి ఎద్దడితో అక్కడి రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. అక్కడి 91రిజర్వాయర్లలో 10యేండ్లుగా నీరు కనీస నీటిమట్టానికి చేరడం లేదు. మహారాష్ట్రలో సగం జిల్లాల్లో నీటి ఎద్దడి, వ్యవసాయ సంక్షోభం తీవ్రమైంది. దేశంలో రైతాంగం నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. బోర్లు పాతాళానికి చేరాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పేద రైతుల పంటలకు నీళ్లు సమకూర్చుకోవడం గండంగా మారింది.

**పంట-పాడి:**

దేశంలోని వ్యవసాయ కుటుంబాలలో దాదాపు ప్రతి రెండు కుటుంబాలలో ఒకటి పాల ఉత్పత్తులతో ముడిపడి ఉంది. కాని గ్రామాల్లో పంటే కాదు, ఇపుడు పాడి సైతం కనుమరుగవుతోంది. పాడిపంటలతో విలసిల్లాల్సిన గ్రామసీమలు వెలాతెలాపోతున్నాయి. ఇవి రెండూ జోడు గుర్రాల్లా స్వారీ చేసినంత కాలం రైతులింట ఉప్పిడీ ఉపవాసాలూ లేకుండేవి. దేశంలో పాల వ్యాపారం అత్యధిక శాతం ఎక్కువగా అసంఘటిత రంగంలో ఉన్నందువల్ల భారత రైతులకు ఆదాయం పెరిగే అవకాశాలు స్థిరంగా ఉండటం లేదు. గత రెండేళ్లలో దేశంలో పాల పొడి నిల్వలు పెరగడంతో వాటి ధర ఏకంగా 37శాతం తగ్గింది. కిలో పాలపొడి టోకు ధర దేశీయ విపణిలో 2016జనవరిలో రూ.265 ఉంటే 2018జనవరిలో రూ.147కుపడిపోయిందని 'జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య' (ఎన్‌డీడీబీ) వెల్లడించింది. శ్వేత విప్లవంలో అగ్రభాగాన నిలిచిన భారతదేశంలోని పేద వినియోగదారులకు మాత్రం పాల ధరలు చుక్కలు చూపుతున్నాయి. పసిపిల్లలు పౌష్టికాహార లోపంతో రోగాల బారిన పడుతున్నారు. గోహత్య మహా పాపంగా భావిస్తూ, 'గో సేవే గోపాల సేవంటూ' జపించే మన దేశం గోమాంసం అమ్మకాలలో(పింక్ రెవల్యూషన్)మాత్రం ప్రపంచంలో అగ్రభాగాన నిలిచింది.

**గిట్టుబాటు ధర**

మన దేశంలో 1966-67నుండి 24రకాల వ్యవసాయోత్పత్తులపై కనీస మద్దతు ధరలను 'వ్యవసాయం పెట్టుబడి ధరల కమిషన్' సిఫారసులపై ప్రభుత్వం యేటా రెండు సార్లు (రబీ, ఖరీఫ్) నిర్ణయిస్తుంది. ప్రభుత్వం ప్రధానంగా కొనేది మాత్రం గోధుమలు, ధాన్యమే. అవైనా పండిన పంటలో మూడోవంతైనా కొనడం లేదు. ఆమేర కొనుగోళ్లకైనా ఎన్నెన్నో విషమ షరతులు విధిస్తోంది. దేశంలోని మొత్తం రాగుల దిగుబడిలో 0.2శాతాన్ని, పప్పుల్లో ఆరో వంతే కొంటుంది. 2016 అక్టోబర్‌లో నాశిక్‌లో ఆలుగడ్డలు కిలో రూ. 4కాగా కనీస మద్దతు ధర కన్నా పెసరపప్పు 15%, సోయాబీన్ 35%తక్కువకే అమ్ముకోక తప్పలేదు. తృణధాన్యాల పంటలు వరికన్నా చాలా తక్కువ నీటితో పండించవచ్చు నంటూ తెగ ప్రచారం చేస్తున్నారు. దానితోపాటు ఇటీవల వాటి పౌష్టికత గురించి చెపుతూ ప్రధానంగా పట్టణవాసులను అబ్బురపరుస్తున్నారు. తీరా అవి పండిస్తున్న రైతుల విషయానికి వచ్చేసరికి గిట్టుబాటు ధరలలో వామహస్తం చూపుతున్నారు. తృణధాన్యాల ధరలు వడిపోవడం వినియోగదారుడికి 'వరంగా' మారితే రైతుకు మాత్రం సంకటంగా తయారవుతుంది. విత్తనాలు, ఎరువుల వంటి ఉత్పత్తి సాధనాలపై రైతు చేసిన వ్యయానికి, కుటుంబ సభ్యుల శ్రమ విలువను జోడించగా వచ్చే ధరకన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ ధరను కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించాలన్నది 2004లో స్వామినాథన్ చేసిన సిఫారసు. కానీ అది మావల్ల కాదన్నాడు రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని మురిపిస్తు మోదీజీ!

సాగు ఖర్చు అంటే సి2 అని, ఎ2+ఎఫ్ఎల్ కాదని రైతు సంఘాలు స్పష్టం చేశాయి. ఎ2 అంటే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, ఇంధనం, నీటి వసతి తదితరాలపై పెట్టిన ఖర్చు. ఎ2+ఎఫ్ఎల్ అంటే ఎ2 ఖర్చుతో పాటు కుటుంబ శ్రమ కూడా. సి2 అంటే ఎ2+ఎఫ్ఎల్‌తో పాటుగా కిరాయి ఖర్చులు, సొంత భూమి, స్థిర మూలధన ఆస్తులపై కోల్పోయే వడ్డీ. రైతుకు గిట్టుబాటు ఎలా కల్పించాలో డాక్టర్ స్వామినాథన్ 2004లోనే ప్రభుత్వానికి నివేదించినా, అది ఆచరణ సాధ్యం కానిదని నీతి ఆయోగ్ 2018జులైలో మొండిగా తిరస్కరిస్తూ సుప్రీంకోర్టుకే స్పష్టం చేసింది. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా తమ పార్టే కాదు ఏ పార్టీ అధికారానికి వచ్చినా ఆ స్వామి సిఫారసులను అమలు చేయడం అసాధ్యం అని తీర్పు ఇచ్చాడు.

2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు కనీస మద్దతు ధరలపై భాజపా రైతాంగానికి ఎన్నో హామీలు గుప్పించింది. కానీ అరకొర లెక్కలు కట్టి 2018లో కనీస మద్దతు ధర నిర్ణయించింది. క్వింటాలు ధాన్యం పండించడానికి రూ. 1,166ఖర్చు అవుతుందని అంచనా వేసి రూ.1,750మద్దతు ధర నిర్ణయించింది. నిజానికి పంట ఖర్చులన్నీ లెక్కేస్తే ఈ ఖర్చు రూ. 1,560అవుతుంది. అంటే స్వామిగారి సిఫారసు ప్రకారం మద్దతు ధర రూ. 2,340 ఉండాలి. కానీ, ఆచరణలో బస్తా ధాన్యం రూ.1,300-1,400లకే రైతు అమ్ముకోవలసి వస్తోంది. యూపీఏ-1 పాలనలో ధాన్యం మద్దతు ధర 65 శాతం పెరిగింది. రెండో విడత పాలనలో తగ్గింది. గత నాలుగేళ్లుగా మరీ తగ్గింది. ఇటీవల 2019 నవంబర్‌లోరైతు బాంధవుడిగా ఫోజు కొట్టే మోదీ ప్రభుత్వానికి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన ధాన్యం కొనుగోలు రేటు కిరికిరి

చూశాం. ధాన్యం ధర ఇలా ఉంటే, తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో ఒక ఎకరం భూమిలో క్యాబేజీ సాగు చేయాలంటే చేయవలసిన వ్యయం కనీసం రూ. 1.5లక్షలు అవుతోంది. మార్కెట్‌లో కిలో ఒక్కంటికి రైతుకు ఒక్క రూపాయి మాత్రమే దొరికే దుస్థితి ఉన్నపుడు ఆ రైతు ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్ముకొని లాభపడేదెక్కడ! ఛత్తీస్‌గడ్‌లోని దుర్గ్ జిల్లాలో టొమేటో సాగు కూడా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఉండడం లేదు. చిన్న రైతు ఒక ఎకరం పొలంలో ఆ పంటను పండించాలంటే వారికయ్యే వ్యయం. రూ. 90,000నుంచి రూ. 1,00,000వరకు ఉంటుంది. అదే పెద్ద రైతులు టొమేటో పండిస్తే ఇంకొంచెం ఎక్కువగా, అంటే ఎకరానికి రూ. 1.25లక్షల వరకు సాగు వ్యయం అవుతుంది. పంట సీజన్‌లో వాటి రేటు దారుణంగా పడిపోతుంది.

మధ్యప్రదేశ్ జనాభాలో ప్రతి పదిమందికి ఏడుగురు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 'గోధుమలకు గిట్టుబాటు ధరలు తప్ప మాకేమీ అవసరం లేదు. వంద కేజీల గోధుమలకు రూ. 3,000లు, సోయాబీన్‌కి రూ. 4,000లు వచ్చేలా చేస్తే చాలు' అంటూ వాపోతున్నారు అక్కడి రైతులు. ఇది యం.ఎస్.స్వామినాథన్ చెప్పిన మద్దతు ధరలకన్నా తక్కువే వారు కోరుకుంటున్నది. కిలో వెల్లుల్లి ఉత్పత్తికి రైతుకు రూ. 15-20లు ఖర్చు అవుతుండగా మార్కెట్‌లో ధరలు మాత్రం కిలో రూ॥7కి పడిపోయాయి. దేశంలోని ఉల్లిపాయల ఉత్పత్తి కేంద్రాలలో ఒకటిగా ఉంటున్న మాందసౌర్‌లో వాటి ధర కిలోకు రూపాయికంటే తక్కువకు పడిపోయింది. 2017లో మధ్యప్రదేశ్ పశ్చిమ ప్రాంత జిల్లా, ఆర్ఎస్ఎస్ కంచుకోట మాందసౌర్‌లో కడుపుకాలిన రైతులు ఆత్మహత్యల పాలవకుండా గిట్టుబాటు ధరల కోసం ఆగ్రహావేశాలతో వీధుల్లోకొస్తే శివరాజ్‌సింగ్ చౌహాన్ భాజపా ప్రభుత్వ పోలీసులు ఆరుగురు రైతులను కాల్చి చంపారు. ఇండోర్, ఉజ్జైన్, ఖర్‌గొవ్, ధార్, దేవాస్, సిహోర్, నీమచ్‌లలో భారీ రైతు ప్రదర్శనలు జరిగాయి. రైతులను ఉగ్రవాదులన్నా, ఆధునిక ఇంటర్‌నెట్ సౌకర్యం నిలిపివేసినా వారి ప్రదర్శనలను మాత్రం పోలీసులు ఆపలేకపోయారు. 2019 లోకసభ ఎన్నికలలో అక్కడి రైతులు భాజపాకు మంచిగా బుద్ధి చెప్పారు.

సహేతుక గిట్టుబాటు ధర ఊసెత్తకుండా- రైతులకు ఆకర్షణీయ ధరలు, ఉత్పాదకత పెంపు, భూ యాజమాన్య సమస్యల పరిష్కారం, విపత్తుల సమయంలో తోడ్పాటు, బీమా పథకాలు వంటి వాటి ద్వారా గొప్ప మార్పు తెస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించడం రైతుల జీవితాలతో క్రూర పరిహాసమే అవుతుంది. వ్యవసాయానికి కీలకమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితరాలన్నింటి ధరల్ని అదుపు చెయ్యని, నాణ్యమైన విత్తనాలను అందించని కేంద్ర ప్రభుత్వం తను ప్రకటించిన మార్పును తేవడం అంటే చిన్న, సన్నకారు రైతులను సంపన్నుల కార్పోరెట్ వ్యవసాయానికి బలి పశువులను చేయడం ద్వారానే!

దేశంలోని ఆదివాసీ రైతులను ఎంతో ఉద్ధరిస్తున్నట్టు నటించే పాలకులు వారి వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ల కోసం సహకార సంఘాలను పెట్టారు. వాటిల్లో జరిగే అవకతవకలతో ఆదివాసీ రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. వారి ధాన్యం కొనుగోళ్లకు అనేక షరతులు విధిస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ జిల్లాలో 1,523హెక్టార్లలో రబీ పంట మక్కజొన్న వేశారు. ఎకరా 20క్వింటాళ్లు పండిస్తున్న రైతులు ఆదివాసీ సొసైటీలు తమ పంట కొనుగోళ్లకు నానా అవస్థలు పెడుతున్నాయనీ వాపోతున్నారు. ఆదివాసుల వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర, అటవీ ఉత్పత్తులకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడమే లేదు. అలాంటపుడు ఇక వారు తమ సమస్యలపై మావోయిస్టులన్నా, ఉగ్రవాదులన్నా పోరాడకుండా మరేం చేస్తారు!?

## విత్తలేని, విత్తురాని మార్కెట్ విత్తనాలు:

నేలల స్వభావం, వర్షపాతం బట్టి విత్తన రకాలుండాలి. కానీ మనీలాలోనో, మరోచోటనో పరిశోధనలు జరిపి దిగుమతులు చేస్తున్న విత్తనాలతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెగుళ్లను తట్టుకునే విత్తనాలు లభ్యం కాకపోవడంతో తెగులు విజృంభించి కోస్తాంధ్రలోనైతే మినుము, పెసర విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అమెరికాకు చెందిన డెల్టా అండ్ పైన్‌లాండ్ కంపెనీ, అమెరికా వ్యవసాయ, విత్తనాభివృద్ధి సంస్థలు ఉమ్మడిగా అభివృద్ధి పరచిన 'విత్తన టెక్నాలజీ'తో ఉత్పత్తి చేసిన విత్తనాల ప్రత్యేకత ఏంటంటే ఆ విత్తనాల నుంచి మొలకెత్తిన మొక్కలు ఉత్పత్తిచేసే విత్తనాలకు పునరుత్పత్తి సామర్థ్యం ఉండదు. వీటిని టర్మినేటర్ విత్తనాలంటున్నారు. టెర్మినేటర్ విత్తనాల నుండి మొలకెత్తే మొక్కల్లో ఉండే మూడురకాల జన్యువులు, అవి విడుదల చేసే విష పదార్థాలు, ఎంజైముల ఫలితమిది. సాధారణంగా రైతులు పంటనుంచి సేకరించిన విత్తనాలను, మరో పంటకోసం నిల్వచేస్తారు. కానిపై టెక్నాలజీతో ఉత్పత్తి చేసిన విత్తనాలు ఒక్క పంటకే ఉపయోగపడతాయి. కాబట్టి వ్యవసాయం చేసుకోవాలనుకుంటే మన దేశంలో విత్తనోత్పత్తిలో సింహభాగాన్ని ఆక్రమిస్తున్న విదేశీ ఎమర్జంట్, మహికో, ప్రో-ఆగ్రో, అలీబాబా గ్రూప్ హోల్డింగ్ లిమిటెడ్ మున్నగు కంపెనీలనుంచి ప్రతియేటా విత్తనాలను కొనుక్కోని తీరాల్సిందే. ఆ విదేశీయ విత్తనాల తాకిడికి తట్టుకోలేకపోతున్న 30వేల రకాలకు పైగా స్థానిక/దేశీ విత్తనాలు కనుమరుగయ్యాయి. వర్తమానంలో కేవలం 10రకాల విత్తనాలతోనే దేశంలో 75శాతం పంట పండిస్తున్నారు. 2016-17నాటికి 380.30లక్షల టన్నుల విత్తన అమ్మకాలకు చేరి ప్రపంచ విత్తనోత్పత్తిలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిన మన దేశంలో పేదరైతులకు మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలే కరువయ్యాయి. రైతులకు నాణ్యమైన విత్తనలను అందవ్వని ప్రభుత్వాలు ఎలైట్ వర్గాల ఆర్థిక ప్రయోజనాలను కాపాడడానికి మాత్రం 'నాణ్యమైన' వ్యవసాయ ఉత్పత్తులకు 'ఎగ్‌మార్క్' పండ్లకు 'ఎఫ్‌పీఏ' మార్క్ ప్రమాణాలు నిర్ధారించింది.

కల్తీ విత్తనాల ఫలితంగా రైతుల సగటు దిగుబడి తగ్గుతున్నదని వ్యవసాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో సగటున ఎకరాకు 38క్వింటాళ్ల ధాన్యం రావల్సిన చోట 25క్వింటాళ్లు, మక్కజొన్న 55క్వింటాళ్ల బదులు 25క్వింటాళ్లు, కంది 12క్వింటాళ్ల బదులు 9క్వింటాళ్లు, వేరుశనిగ 17క్వింటాళ్ల బదులు 9క్వింటాళ్లకు దిగిపోయిందని చెపుతున్నారు. మేలిమి విత్తనాల వినియోగం వల్ల దిగుబడులు 15-20శాతం మేర పెరుగుతాయంటారు. కానీ, అధికారంలో ఉన్న దొరలు కార్పోరేటు వర్గాల కొమ్ముకాస్తూ వినయంగా సేవలు అందిస్తుంటే రైతు గోడు వినేనాథుడేడి?

ఛత్తీస్‌గడ్‌లో కాంటాక్టు సేద్యం చేస్తున్న కార్పోరెట్లు సువిశాల క్షేత్రాలలో ఆర్కిడ్, ఝర్బెరా లాంటి విదేశీ రకం పూలు; షిమ్లా మిర్చీ, పచ్చి మిరపకాయలు, పర్వల్, దొండ, కాకర మున్నగు కూరగాయలు పండిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలలోకి కూడా వారి ఆధునిక సాగు వేగంగా విస్తరిస్తున్నది. కాంకేర్ జిల్లా బేవర్తికి హిమాచల్‌ప్రదేశ్ నుండి సేపు దిగుమతి చేసి పండిస్తున్నారు. అంబికాపుర్, జశ్‌పుర్‌లకు ఉత్తరప్రదేశ్ నుండి ఆలుగడ్డలను దిగుమతి చేసి పంట తీస్తున్నారు. జపాన్‌కు చెందిన టకిటా, సకిటా కంపెనీల గోబీ విత్తనాలు దిగుమతి అవుతున్నాయి. వీటితో ఆదివాసుల జీవితాలు 'రైతు బంధు' బఘేల్ రాజ్యంలో మరింత అతలాకుతలం కాక తప్పదు.

'జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ' అనుమతి లేని, నిషేధించబడిన బీటీ విత్తనాలు యధేచ్ఛగా గుజరాత్ నుండి అన్ని రాష్ట్రాలకు దిగుమతి అవుతూనే ఉన్నాయి. 2002లో మన దేశానికి చేరిన బీటీ పత్తి గత 17యేండ్లలో 90శాతం విస్తరించింది. వరి సాగుని మింగేస్తూ పత్తి వ్యాపిస్తోంది. మన దేశ రైతాంగ (ఆత్మ)హత్యలకు ప్రధాన కారణం బీటీ పత్తే!

తాజాగా ట్రంప్ మహానుభావుడు కూడా వర్ధమాన దేశాల పేరుతో వ్యవసాయ సబ్సిడీలను అనుమతించడం డబ్ల్యుటీఓకు తగదని హెచ్చరించాడు. మన దేశంలో ప్రస్తుతం లభిస్తున్న రూ.70వేల కోట్ల వ్యవసాయ సబ్సిడీలను మోదీ పాలనలో ఏ క్షణాన ఎత్తేసినా ఆశ్చర్యపడేదేమీ ఉండదు. ఇపుడున్న రైతు సబ్సిడీల జన్-ధన్ ఖాతాల డీబీటీలతో చౌకీదార్ మోదీ చేస్తున్న వ్యాపారం అంతిమంగా లలిత్ మోదీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా లాంటి బడా పెట్టుబడిదారులకే మేలు చేస్తున్నదనేది మోదీ విధానాలు, బ్యాంకుల పని విధానం తెలిసిన వారికి సుబోధకమే! ట్రంప్ హుకుంను పాటించి ఇరాన్‌తో మనం లావాదేవీలు మానేస్తే, కేవలం చమురు సమస్య, విదేశీ మారకం సమస్య మాత్రమే కాదు, వ్యవసాయ రంగంలోనూ సమస్యలు వస్తాయి. గోధుమల ఎగుమతులు తగ్గడం ఒక్కటే కాదు, రసాయన ఎరువులకు కొరత ఏర్పడుతుంది. రైతు గోస మరింత పెరిగి తీరుతుంది.

## ప్రాణాంతకంగా మారిన ఎరువులు-క్రిమిసంహారాలు

అధిక దిగుబడి విత్తనాలను విత్తడానికి అనివార్యంగా నెట్టబడిన రైతులు తాము తరతరాలుగా వాడుతూ వస్తోన్న సేంద్రియ ఎరువులకు అంతే అనివార్యంగా స్వస్తి చెప్పి సర్కారీ ఎరువులు కొనలేక యేటేటా దివాళా తీస్తున్నారు. హరిత విప్లవ విపరిణామాలతో మన దేశంలో ఊపందుకున్న రసాయనిక ఎరువుల వినియోగం క్రమంగా భూములే ఇముడ్చుకోలేని స్థాయికి చేరుకుంటున్నది. అధిక దిగుబడి విత్తనాల వినియోగం విస్తృతంగా పెరగడంతో రసాయనిక ఎరువుల వాడకం రైతుల ప్రాణాలు తోడేసే స్థాయికి చేరింది. యూరియా, పొటాష్, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను వాడని పక్షంలో పంట రాని దుస్థితే నెలకొంది. ముందు ప్రభుత్వాలు అనేక సబ్సిడీలిచ్చి వాటి వినియోగాన్ని ఎంతగానో ప్రోత్సహించాయి. కానీ క్రమంగా సబ్సిడీలను ఎత్తేస్తున్నారు. 1968లో 17లక్షల టన్నుల రసాయనిక ఎరువులను వాడగా 2012నాటికి 16రెట్లు పెరిగి 281లక్షల టన్నులకు చేరింది. ఇక క్రిమి సంహారాలైతే 1955లో ఎకరాకు కేవలం 5గ్రాములు వాడితే 2018నాటికి 350గ్రాములకు చేరింది. కాగితాలపైకి ఎక్కించి అందచేసే దేశ వ్యాప్త సగటు లెక్కలను కాసేపు పక్కన పెట్టి పేద, మధ్య తరగతి గ్రామీణ రైతుల నిజ జీవితాలను పరిశీలిస్తే బీటీ పత్తి చేరకముందు ఊర్లల్లో సంపన్న రైతులు, దొరలు, పెత్తందారులు, 'పరపతి' గల పెద్దలు మాత్రమే అరకొరగా వీటిని వినియోగించేవారనడం గత వాస్తవాన్ని తెలుసుకోవడమే అవుతుంది. రసాయినిక ఎరువులు సైతం ప్రధానంగా ఆ వర్గాలకు చెందిన వారే వాడేవారు. కానీ, అధిక దిగుబడి విత్తనాలూ బీటీ పత్తి ఊరూరికి చేరాక రసాయినిక ఎరువులు, క్రిమి సంహారాలు కడుప-కడుపకు చేరి రైతుల జీవితాలతో పరిహాసమాడుతున్న పంటలతో వారికి ప్రాణాంతకంగా మారాయి.

కల్తీ విత్తనాలు, విచ్చలవిడిగా ఎరువుల వాడకం, వాటి కొనుగోళ్ల కోసం అప్పులు, అప్పులపై వడ్డీలు, చక్ర వడ్డీలతో కూడిన పంట చక్రంలో ఎన్నెన్ని చేసినా అనుకున్నంత పంట రాకపోయి, మండీలలో(అడ్తీ, మార్కెట్)రేటు గిట్టక చివరకు పురుగు మందులతో జీవితాలను చాలించుకుంటున్న రైతుల సంఖ్య, వ్యవసాయాలను వదిలేస్తున్న వారి సంఖ్య, ఉన్న భూమిని కాంటాక్టు వ్యవసాయానికి అప్పచెప్పుతున్న వారి సంఖ్య దేశంలో ఏ యేటికాయేడు పెరుగుతోంది. అమెరికాకు చెందిన పెప్సీ, అమెజాన్, మోన్‌సాంటో (ఇపుడు బేయర్‌గా మారింది)తదితర వ్యవసాయ వ్యాపార కార్పోరేట్లు కాంటాక్టు వ్యవసాయంలో దండిగా లాభాల పంటలు పండించుకుంటున్నాయి. ఉదాహరణకు, 200దేశాలలో వ్యవసాయ వ్యాపారం చేస్తున్న పెప్సీ ఇపుడు దేశంలోని 12రాష్ట్రాలలో 24వేల మంది రైతుల భూములలో బంగాళదుంపల వ్యవసాయం చేస్తూ నాలుగున్నర లక్షల కోట్లకు పైగా గడించింది. కానీ 'బికనేర్ భూజియా'(బజ్జీలు) తయారు చేసి అమ్ముకునే 50వేల రాజస్థానీ నిరుపేద మహిళల చిరు ఆదాయాన్ని మన 'చాయ్‌వాలా' పెప్సీ

మాయతో మంట కలిపాడు. ఈ మధ్య కాలంలో భారత అంబానీలు, అదానీలు ఇంకా అనేకులు ఈ రంగంలోకి దిగారు. దీనితో మన వ్యవసాయకదేశం ఎన్ని మార్పులకు గురవుతుందో ఎంతో కాలం వేచి చూడాల్సిన పనుండదు.

ఈ మధ్య కాలంలో 'తాతకు దగ్గులు నేర్పిన చందం'గా మన రైతులకు సేంద్రీయ ఎరువుల ప్రాశస్త్యం గూర్చి దళారీ రాజకీయ నాయకులు తెగ వివరిస్తున్నారు. భూసారాన్ని బట్టి సేంద్రియ ఎరువులతో పాటుగా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారాలను తగిన మోతాదులలో వాడాల్సింది పోయి విచ్చలవిడిగా వాడుతూ భూములను చవిటి పర్రెలుగా తయారు చేయడమే కాకుండా మనుషుల జీవితాలనూ రోగాలమయం చేస్తున్నారు. ఇది ఈ వ్యవస్థ దుర్నీతి. ఈ సందర్భంగా 'రోగగ్రస్త సమాజ లక్షణం ఆత్మహత్య' అన్న మార్క్స్ మహాశయుడి మాట గుర్తుకు రావడం సహజం.

## ఓట్లబ్యాంకు పథకాలు

మన దేశంలో రైతులను నట్టేటముంచే సర్కార్ పథకాలకు కొదువలేదు. ఆ కోవలోదే 2018లో ఎన్నికలకు ముందు తెలంగాణలోని బడా భూస్వామి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన 'రైతుబంధు' పథకం. కేసీఆర్ ప్రభుత్వం 'భూ-యజమానులకు' సంవత్సరానికి ఎకరా భూమికిగాను రూ 8,000ను వ్యవసాయ దిగుబడి ఖర్చుల కింద సహాయంగా పంచింది. ఈ మొత్తాన్ని ఖరీఫ్, రబీ సీజన్లలో రెండు దఫాలుగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 58 లక్షల మంది రైతులకు అందించింది. తద్వారా ఓట్ల పంట పండించుకొని విధానసభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన కేసీఆర్ రెట్టింపు ఉత్సాహంతో 2019లోకసభ ఓట్ల కోసం అదే రైతుబంధు పథకం ద్వారా మరో రెండు వేలు పెంచి రైతులకు రూ.10,000ఇస్తామన్నాడు. అయినప్పటికీ లోకసభ ఎన్నికలలో ఓట్ల పంట పండలేదు. కానీ, కౌలు రైతులకు మాత్రం రైతుబంధు వర్తించడం లేదు. దొర గారికి కౌలు రైతులు కేవలం ఓటు వేసేవారు మాత్రమే!

2019 కేంద్ర మధ్యంతర బడ్జెట్లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం కింద మార్జినల్ రైతులకు యేటా రూ.6,000ఆర్థిక సాయం అందజేయనున్నట్టు ప్రకటించి ఓట్లు దండుకుని అధికారాన్ని చేపట్టిన మోదీ-2 ప్రభుత్వం, 2019 జూన్లో ప్రవేశపెట్టిన పూర్తి బడ్జెట్లో ఆ సహాయ రాశి మొత్తాన్ని రైతులందరికీ వర్తింపచేస్తానని ఉత్సాహంగా ప్రకటించింది. రైతులకు వృద్ధాప్యపెన్షన్ రూపంలో నెలకు రూ.3,000 అందచేస్తానని హామీ ఇచ్చింది. కానీ, కనీస మద్దతు ధర జోలికి మాత్రం వెళ్లలేదు. అదే మోదీ కపట నీతి!

మహిళలకు కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లు ఇవ్వాలని స్వామినాథన్ సూచించాడు. 1998లో ప్రారంభమైన కిసాన్ క్రెడిట్ కార్డులు రైతాంగానికి భూమి లేదా ఇతర ఆస్తులను తాకట్టు పెట్టడం ద్వారా లక్ష రూపాయల అప్పు ఇచ్చేది. ఆ అవకాశం మహిళలకు కూడా ఉండాలని నాథన్ సూచించాడు. ఎన్నికలకు కొద్ది ముందు మోదీ ఏ హామీ లేకుండానే రైతులకు రెండు లక్షల అప్పు కేసీసీపై ఇస్తామనీ ప్రకటించాడు. మన దేశంలోని ఎంతమంది రైతులకు, రైతు మహిళలకు కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్యాన్ కార్డులు, ఈ-నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్)ల వ్యవహారాలు తెలుసు! అవన్నీ ఎవరి కోసం? దేశంలోని 575మండీలలో 470మండీలకు పైగా ఈ-నామ్ సౌకర్యం కల్పించారు. ఈ-నామ్ల ఉద్దేశం కూడా జాతీయ స్థాయిలో స్పాట్ ట్రేడింగ్కు లాభం చేకూర్చడమే. ఈనామ్ మార్కెట్లు ఏవీ కూడా వ్యవసాయోత్పత్తులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే స్థితిలో లేవు. వాస్తవానికి దేశంలో ఉన్న 22వేల గ్రామీణ సంతలతోనే పేదరైతులు నేటికీ తమ అమ్మకాల అవసరాలు తీర్చుకుంటున్నారు.

పైన మచ్చుకు కొన్ని మాత్రమే ప్రభుత్వ పథకాల గురించి ప్రస్తావించాం. ఈ పథకాలన్నీ శ్రామిక వర్గాల ప్రజల గోళ్లూడగొట్టి వసూలుచేసిన సొమ్మునే పలుకుబడి గలవారికి పంచుతున్న పథకాలు తప్ప సంపన్నులపై రాబడి పన్నో, లేవో మరోటో విధించి వారి దోపిడీనుండి వసూలుచేసి అందచేస్తున్నవి కావు. ఈ పథకాలతోనూ లబ్ధి పొందుతున్నది భూ-యజమానులే! మన దేశంలోని కోట్లాది గ్రామీణ వ్యవసాయ కూలీలు, భూములు లేని రైతులు ఉన్నోళ్ల భూమి అధిక కౌలు రేట్లు చెల్లిస్తూ కష్టాల కడలిలో నష్టాల సాగుతో మునిగిపోతున్నారు. రైతుల ఆత్మహత్యలలో రెండవ స్థానమాక్రమించిన తెలంగాణలో రైతుబంధు అనుభవం చూస్తే అక్కడ ఆత్మహత్యలు ఆగడం లేదనీ, రైతుబంధు ఉన్నత వర్గాలకే లాభపడుతుందని స్పష్టమవుతుంది.

## కౌలు రైతుల అగచాట్లు

దేశ రైతాంగంలో చాలా అన్యాయానికి గురవుతున్న వారంటే కౌలురైతులే. 'భూమి పట్టా వున్న వారే రైతులు, తక్కిన వ్యవసాయదారులతో ప్రభుత్వానికి సంబంధం లేదు' (ఓట్ల సంబంధం మాత్రం ఉంటుంది) అన్న వైఖరిని ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. దేశంలో పట్టా లేని సాగుదారులలో పెద్ద సంఖ్యలో కౌలు రైతులు ఉన్నారు. ఎకరానికి రూ.10వేల నుండి రూ.20 వేల వరకు కౌలు కడుతూ సేద్యం చేస్తున్నారు. హర్యాణాలో ఎకరా రూ.25వేలకు పైగా చెల్లిస్తున్నారు. కేవలం ఒక్క తెలంగాణలోనే 15లక్షలకు పైగా కౌలు రైతులున్నారు. ఈ సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది.

'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్' ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఆత్మహత్య చేసుకున్న సుమారు ఏడువందలమంది రైతుల్లో 80శాతం కౌలు రైతులేనని తేలింది. కౌలురైతుల్లో అత్యధికులు దళితులు, ఆదివాసులు, వెనుకబడిన తరగతులవారే కనుక ఈ అధ్యయనం ప్రకారం ఆత్మహత్య చేసుకున్నవారిలో 90శాతం వారే ఉన్నారు.

2011 కౌలు రైతుల గుర్తింపు చట్టాన్ని అమలు చేసి, వారిని గుర్తించి, రైతుబంధు సహా దేశంలోని అన్ని ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలని రైతాంగం న్యాయమైన డిమాండ్ చేస్తున్నారు. కౌలు రైతులు, మహిళా రైతులు, పోడు రైతులతో సహా వాస్తవ సాగుదారులను గుర్తించి బ్యాంకు రుణాలు వారికి దక్కేట్టుగా చూడాలనీ కోరుతున్నారు. వ్యవసాయానికి ఇచ్చే మొత్తం రుణాల్లో కౌలు రైతులకు దామాషా ప్రకారం రుణ కేటాయింపు జరపాలంటున్నారు.

పై లెక్కల్లో ఆదివాసుల స్థానమెక్కడ! వారి వ్యవసాయ భూములకు ప్రభుత్వ పట్టాలే లేవు. వారికి సాగుదార్ల గుర్తింపూ లేదు. అడవులపై ఆదివాసులకే అధికారం అన్నది హూళక్కి అని మోదీజీ సర్కార్ తన దుశ్చర్యల ద్వారా పదే పదే సెలవిస్తున్నది. ఇటీవలే దేశ సుప్రీంకోర్టు పట్టాలు లేని ఆదివాసులను అడవుల నుండి గెంటెయ్యాలని ఆదేశించింది. పది ఎకరాల లోపు అటవీ భూములను కలిగిన ఆదివాసీ, గైరాదివాసీ రైతులకు పట్టాలివ్వాలని పుష్కరకాలం నాడు చేసిన శాసనాన్ని తక్షణం అమలు చేయని పక్షంలో సాగుదార్లే సంపూర్ణ హక్కుదారులవుతారని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించాల్సింది పోయి అడవుల నుండే రైతులను గెంటేసే ఆదేశాలిచ్చి అది తన దోపిడీ వర్గ స్వభావాన్ని చాటుకుంది. భూములకు పట్టాలు దొరుకని ఆదివాసుల సంఖ్య దేశంలో 12లక్షల పైనే ఉంది. ఈ గడ్డివేళ్ల ప్రజలు ప్రభుత్వ పథకాలన్నింటికీ అందనంత దూరంలోనే ఉండిపోవడం 'మండుతున్న అడవులకు' గాలిలా తోడవుతుంది. దండకారణ్యంలోని బస్తర్ విషయానికి వస్తే 2005-09మధ్య విరుచుకుపడిన 'శ్వేత భీభత్సం' సల్వాజుడుం మూలంగా లక్షలాది ఆదివాసీ ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారికి కొంప కట్టుకోవడానికే పొరుగు రాష్ట్రం తెలంగాణలో స్థలం కరువైందంటే, ఇక వారికి వ్యవసాయ భూములు, వాటికి భూ-యాజమాన్య పట్టాలు, వాటిపై సర్కారీ పథకాల లబ్ది పొందడం అంటే లొటపెట పెదవులకు నక్క ఆశ పడిన చందంగానే ఉంటుంది. అందుకూ రైతులకు, ఆదివాసులకు పోరు తప్ప దారి లేదు.

### ఋణాల ఊబిలోకి నెడుతున్న పంటల బీమా:

ప్రస్తుతం మన దేశంలోని ఎల్ఐసీ సహా 25బీమా సంస్థలలో ఒక్క వ్యవసాయ రంగంలోనే 17బీమా సంస్థలు రంగంలో ఉన్నాయి. ఒక్కొక్కచోట ఒక్కో సంస్థ గుత్తాధిపత్యం కలిగిఉంది. పీఎం-కిసాన్ పథకం క్రింద రెండేళ్లలో ప్రైవేటు, ప్రభుత్వ బీమా కంపెనీలు వసూలు చేసిన కిస్తీ రూ.47,408 కోట్లు. కానీ, అవి రైతులకు చెల్లించిన పరిహారం మాత్రం రూ.31,613 కోట్లే. ఈ పథకం అమలులోకి రాకముందు దేశంలో 4.85కోట్ల మంది రైతులకు బీమా ఉండేది. కొత్త పథకం అమలైన తరవాత 2017-18లో ఆ సంఖ్య ఐదు లక్షలు తగ్గి 4.8 కోట్లకు దిగింది. 2016-17లో బీమా సంస్థలకు రూ.530కోట్లు, 2017-18లో రూ.780 కోట్ల మేర లాభాలు వచ్చాయి. బీమా పరిధిలోకి వచ్చే రైతులు తగ్గినా పీఎం-కిసాన్ హయాంలో కంపెనీలకు లాభాలు అధికం కావడం మోదీ విశేషం. అన్ని పంటలకు బీమా వర్తింపచేయాలని సూచించిన స్వామినాథన్ సిఫారసును యూపీఏ పాలనలోనే ప్రవేశపెట్టినా, 'సబ్‌కా విశ్వాస్'ను నినదిస్తున్న మోదీ 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' మాత్రం ప్రధానంగా బీమా కంపెనీలకు విశ్వాసాన్నిస్తూ లాభాలు సంపాదించిపెడుతున్నదనీ, వేలకోట్లు దండుకొని వందల కోట్లు మాత్రమే అవి రైతులకు పరిహారంగా ఇస్తున్నాయని భారత రైతులు లబోదిబోమంటున్నారు. కౌలు రైతులకు ఈ పథకం ప్రయోజనాలూ వర్తించడం లేదు.

### రుణముక్తి రాజకీయాలు

ఇటీవలి ఎన్నికల పార్టీల ప్రణాళికలలో రైతుల ఋణముక్తి హామీ ఇవ్వని పార్టీ బహుశ లేదేమో! అధికారంలో లేని ప్రతిపక్షాలు ఈ విషయంలో ఒక అడుగుముందే ఉన్నాయి. దేశంలో పెల్లుబికిన ఇటీవలి రైతు పోరాటాల ఫలితమిది. వాళ్లు ఆత్మహత్యలకు పాల్పడినన్నాళ్లు దీనికి ఇంతటి ప్రాముఖ్యత దక్కలేదు. కానీ, ఎన్నికల ఫలితాలు వెలువడడం తరువాయి వాటి డొల్లతనం దాపరికం లేకుండా వ్యక్తమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో అందరికన్నా ముందే రైతులను ఎంతో ఊరించిన యోగీ చివరకు ఎన్నో ఆంక్షలు పెట్టి 'మమ' అనిపించుకున్నాడు. పంజాబ్ రైతులకు భ్రమలే మిగిలాయి. మధ్యప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఒక్కోరైతుకు గరిష్ఠంగా 2వేల రూపాయల మేరకు మాత్రమే వ్యవసాయ రుణాలను మాఫీ చేసి చేతులు దులుపుకుంది. కర్ణాటకలో కాంగ్రెస్ అదే హామీ ఇచ్చి అరకొర మాఫీ చేసి గట్టెక్కాననుకుంది. కానీ, ఉపెన్నికలలో రైతు బదులు తీర్చుకుని గద్దె దింపాడు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలు వేదికలపైనుండి పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాల మాఫీలు ప్రకటించాయి. కానీ, వాటి డొల్లతనం లోకసభ ఎన్నికల ఫలితాల్లోనే వెల్లడైంది. ఖరీఫ్‌కాలం నెత్తికి మీదికి వచ్చినా ఋణమాఫీ దిక్కులేక పాత బకాయిలు తీర్చకుంటే కొత్త ఋణాలు ఇచ్చేది లేదని బాంకులు కరాఖండిగా రైతులకు సెలవిచ్చాయి. మరోవైపు పరిశ్రమలను ఆదుకోకపోతే ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్తం అవుతుందనీ తక్షణం వారికి సహాయం అందించాలనీ మోదీ అండ్ కంపెనీ ఆర్‌బీఐ బోర్డుతో కయ్యానికి దిగి దాదాపు రెండు లక్షల కోట్లు లాగేసిన వైనం తెలిసిన వారికి ప్రభుత్వం ఎవరి పక్షమో, దేశంలో రైతులూ వారి వ్యవసాయం విలువ ఏపాటిదో అర్థమవుతుంది.

నిజానికి ఈ దేశంలో ఋణమాఫీ జిమ్మిక్కులు కొత్తవేమీ కావు. రైతుల రుణాలపై మారిటోరియంలు, మాఫీలు మన దేశ పాలకుల ఓట్ల చిట్కాలలో భాగమే! స్వామినాథన్ సూచనలలో ఋణమాఫీల మాట లేదు కానీ వసూళ్లలో వెసులుబాట్లు ఉండాలన్నాడు. 2008-09లోనే యూపీఏ రైతాంగ రుణాలను రద్దు చేసింది. అయినప్పటికీ రైతాంగ రుణ విముక్తి అయిందెక్కడ! దశాబ్దం తిరక్కముందే మళ్లీ గుట్టల్లా రైతాంగ రుణాలు పేరుకుపోయాయి. వారి మౌలిక సమస్యలకు పరిష్కారం అది కాదని తేలిపోయింది.

### అప్పుల ఊబిలో కడతేరుతున్న రైతు జీవితాలు:

1969లో ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసింది. అపుడు ప్రజల వద్దకే బ్యాంకులు వచ్చాయి, ఎంతో ఉపయోగపడుతాయి అన్నారు. కానీ ఆచరణలో బ్యాంకులు బడా భూస్వాములకు, పరపతి కలిగిన పెద్దలకు అడ్డమైన దారుల్లో దండిగా ఋణాలిచ్చి అమాయక రైతులను ఎంతగానో మోసగించాయి. రైతులకు ఎప్పటిలా ఊరి సాహుకార్లే శరణ్యమయ్యారు. మన దేశంలో వ్యవసాయం, లఘు, కుటీర, గ్రామీణ పరిశ్రమలను, హస్తకళలను ఆదుకోవడానికి రూ.100కోట్ల మూలధనంతో 1982లో ఏర్పడిన 'నాబార్డు' (జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు) 2010లో రూ.2,000కోట్ల నిధులకు చేరేనాటికి ఆత్మహత్యల పర్వంలో రెండు లక్షలకు మించిన రైతాంగ హత్యలు నమోదయ్యాయి. ప్రస్తుతం సాధారణంగా ఒక హెక్టారు వరకు భూమి కలిగిన వారిని మార్జినల్ రైతులుగా, రెండు హెక్టార్ల వరకూ కలిగిన వారిని చిన్న రైతులుగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయంలో నూటికి 80మంది వీళ్లే! వీరికి లభిస్తున్న బ్యాంకు అప్పులు 30%కాగా అందులో నిర్దిష్టంగా వ్యవసాయానికి అందుతున్నవి 12 శాతమే! దానితో గ్రామీణ రైతులు సాహుకార్ల, వడ్డీ వ్యాపారస్తుల ఉచ్చులో నుండి బయటపడడం లేదు. దేశంలో పేద ప్రజలకు ప్రభుత్వం అందచేస్తున్న వివిధ రకాల సబ్సిడీలు 2017-18 నాటికి రెండున్నర లక్షల కోట్లకు చేరుకున్నాయనీ సంపన్న వర్గాలు అలజడి రేపుతున్నాయి. కానీ వారు కూడబెడుతున్నదంతా పేదలను దోచుకొనే అన్నది పేదలకు అర్థమైననాడు ఏ సబ్సిడీల అవసరం ఉండదు.

2008లో అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం ఎదురైనప్పుడు మన్మోహన్ ప్రభుత్వం దేశ పారిశ్రామిక రంగాన్ని ఆదుకోవడానికి మూడు లక్షల కోట్ల రూపాయలు (బేల్ ఆవుట్) కేటాయించింది. మోదీ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి రూ.3.5 లక్షల కోట్ల రాయితీ ఇచ్చింది. 2014 ఏప్రిల్ నుంచి 2018 ఏప్రిల్ మధ్యకాలంలో మన దేశ కార్పొరేట్ రంగం నుంచి పాలకులు మొండి బకాయిలుగా ముద్ర పడిన రూ.3.16లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అంతేకాదు, నయా ఉదారవాద మేధావుల ఆలోచనలను ఆచరణలో పెడుతున్న, జీ-20 దేశాలు అమలుచేస్తున్న విధానాలలో భాగంగా 2017లో మోదీ ప్రభుత్వం చేసిన 'ఫైనాన్షియల్ రెజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్' చట్టం దొడ్డిదారిన బ్యాంకులను ప్రైవేట్‌పరం చేస్తూ ఖాతాదారుల సొమ్ముతో కార్పోరేట్‌వర్గాల నష్టాలను పూడ్చడానికి 'బేయిల్ అవుట్' బదులు 'బేయిల్ ఇన్'కు దారులు తెరిచిందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. కానీ వ్యవసాయం దినదినగండంగా మారిన రైతులు తాము చేసిన అప్పులు తీర్చలేని బాకీల కొలిమిలో తన్లాడుతూ ప్రభుత్వ రుణాలైనా పూర్తిగా మాఫీ చేయాలని కోరుతుంటే ప్రభుత్వాలు నీళ్లు నములుతోంటే కుబేరులు తోకలు జాడిస్తున్నారు.

1995నుంచి 2015మధ్యకాలంలో దేశంలో మూడు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ రికార్డులు వెల్లడిస్తున్నాయి. వెల్లడి కానివి పక్కనపెట్టినా దేశవ్యాప్తంగా రోజుకు 40మందికి పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 2013లగాయతు ఏటా సగటున 12,000ఆత్మహత్యలు జరుగుతున్నాయని కేంద్రం 2017మే నెలలో నిస్సిగ్గుగా సుప్రీంకోర్టుకు నివేదించింది. రైతుల మౌలిక సమస్యలను పక్కనపెట్టి ఏ పథకాలు రూపొందిస్తున్నా, ఎన్ని ప్యాకేజీలు ప్రకటిస్తున్నా అవేవీ వారిని సరిగా ఆదుకోలేకపోతున్నాయి. గత నాలుగేళ్ల రైతు ఆత్మహత్యల్లో 75శాతం కౌలు రైతులవే!

### హరిత శ్వేత నీలి పసిడి గోల్ విప్లవాలు

మన దేశ వ్యవసాయ రంగంలో స్వామినాథన్ హరిత విప్లవం, పాల ఉత్పత్తులలో వర్గీస్ కురియన్ 'శ్వేత విప్లవం' (ఆపరేషన్ ఫ్లడ్)సాధించారంటారు. పాల ఉత్పత్తులలో మన దేశం ప్రపంచంలోనే మొదటిస్థానానికి చేరింది. నీలి విప్లవం (మాంసం ఉత్పత్తులు) ప్రధానంగా లక్షకు పైగా టన్నుల చేప మాంసం ఉత్పత్తితో మన దేశం ప్రపంచంలో రెండవ స్థానానికి చేరింది, పసిడి విప్లవం (నూనె గింజలు, ప్రధానంగా ఆవాలు), గోల్ (ఆలుగడ్డలు)విప్లవం అంటూ అనేక విప్లవాలు సాధిస్తున్నామని ఎన్నో గొప్పలు చెపుతున్న దేశంలోనే ప్రపంచంలోని పేదల్లో మూడోవంతు పేదలు భారత్‌లోనే ఉన్నారన్నది చేదు నిజం. మరోవైపు దేశంలో అమ్ముతున్న పాలలో 75శాతం వరకూ కల్తీ, నాసిరకం అని గతంలోనే నిర్ధారణ అయింది. స్వచ్ఛమైన, నాణ్యమైన పాలు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పాలకులు పూచీకత్తు ఇవ్వాలని ప్రజల హితవు కోరేవారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దోపిడీ ప్రభుత్వ విధానాల లాభాల అత్యాశ ఫలితంగా దేశంలో రక్తహీనతతో కోట్లాది పేద మహిళలు అనేక జబ్బుల పాలవుతూ చిక్కి శల్యమవుతున్నారు. దేశంలో తల్లిపాలు కరువైన కోట్లాది నిరుపేదల పిల్లలు బుక్కెడు పాలకోసం విలవిలలాడుతూ రోజూ 3వేల పసికందులు ప్రాణాలు వదలుతున్నారు. ఏలికవారే నిస్సిగ్గుగా అందిస్తున్న నివేదికలివి. వారి విప్లవాలన్నీ సంపన్నుల లాభాపేక్షతోనూ వ్యవసాయ ('ఎర్ర') విప్లవాన్ని అడ్డుకోవడానికేనన్నది అర్థం చేసుకోవాలి.

మన దేశంలోని అధిక శాతం ఆదివాసులు ఇప్పటికీ ప్రధానంగా వర్షాధార పంటలనే పండిస్తున్నారు. వారు సాధారణంగా యేడాదికి ఒకే పంట పండిస్తూన్నారు. వారు తమ భూములలోని చిన్న-చిన్న కుంటల అంచుల్లో విత్తనాలు విత్తుతూ, ఎత్తైన కట్టల ద్వారా నీరు నిల్వ చేస్తూ పురాతన సాగు పద్ధతులలో పంటలు పండిస్తూన్నారు. విప్లవోద్యమ ప్రాంతాలలో మాత్రం పోలీసుల తుపాకులను ఎదుర్కొంటూ సాగునీటి వ్యవస్థను సమకూర్చుకుంటున్నారు. మోదీ ప్రభుత్వం ఆకాంక్ష జిల్లాలని ప్రకటించిన దేశంలోని 115జిల్లాలలో అధిక శాతం ఆదివాసీ జిల్లాలే ఉండడం గమనార్హం. కానీ ఏ జిల్లాలో కూడా ప్రభుత్వం కానీ, పార్లమెంటు సభ్యులు కానీ

చెప్పుకోతగిన విధంగా వారి వ్యవసాయ వికాస కార్యక్రమాలను చేపట్టింది లేదు. అందుకు మావోయిస్టులను సాకుగా చూపి నిందించడం మాత్రం వారికి పరిపాటిగా మారింది.

**మహిళలు**

నేటికీ తెలుగు రాష్ట్రాలలో 10-15శాతం భూమి మాత్రమే స్త్రీల పేరిట ఉంది. అనేక రాష్ట్రాలలో మహిళల పేరు మీదా భూమి పట్టాలన్నారు. దండకారణ్యంలో 1990లలో ముందుకువచ్చిన గ్రామ రాజ్య కమిటీలు స్త్రీ-పురుషుల ఉమ్మడి పేరు మీదా పట్టాలు ఇవ్వడం ప్రారంభించగానే ఆనాటి మధ్యప్రదేశ్ దిగ్విజయ్‌సింగ్ కాంగ్రెస్ సర్కార్ తానూ ఇస్తానంది. కానీ అది ఉత్త మాటే అయింది. నాగేటి చాళ్లలో చాకిరెంత చేసినా మహిళలు భూ-యజమానులు కాకపోవడంతో వారికి ప్రభుత్వ రాయితీలు లభించవు. సాగుదార్లుగా గుర్తింపు లేనందువల్ల మహిళా రైతుల ఆత్మహత్యలు రైతు ఆత్మహత్యల జాబితాలోకి చేరవు. వ్యవసాయ రంగంలో మహిళల దుస్థితులు దుర్భరంగా ఉన్నాయి. నేటి పురుషాధిక్య సమాజంలో వేతనాలలో అసమానతలు, లైంగిక దోపిడీ, అణచివేతలు, శ్రమ స్థలాలలో వివక్ష, ప్రభుత్వ పథకాలకు సరిగా నోచుకోకపోవడం, అధిక శ్రమలాంటి అనేక సమస్యలతో వారు సతమతమవుతున్నారు. కుటుంబాలలోని పురుషులు కూలీ పనులకు వలస పోయిన సందర్భాలలో కుటుంబ పోషణ భారం, బాధ్యత వారే అనివార్యంగా మోయాల్సివస్తుంది. మహిళలూ కూలీకి వెళుతున్న చోటా వారికి ఎదురవుతున్న సమస్యలు మరింత అధికంగా ఉంటున్నాయి. మహారాష్ట్రలోనైతే మహిళలు మరింత అమానవీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అక్కడ గర్భాశయాలు తొలగించుకుంటే తప్ప, మహిళా కూలీలకు చెరుకు కోత కూలీ పనులు దక్కడం లేదు! ఇంతకంటే దౌర్భాగ్యం, దయనీయం, నీచాతి నీచం ఉంటుందా?! ఇక ఆదివాసీ మహిళలైతే దున్నడంతో సహ సమస్త వ్యవసాయ పనులతో పాటు అడవులనుండి వంట కర్రలతో సహ కూరలకు ఆకో, అలమో, కందమూలాలో తెచ్చి వండి కుటుంబాన్ని పోషించడం వరకూ పురుషులకన్నా కాస్తా అధికంగానే శ్రమిస్తారు. అయినప్పటికీ పితృస్వామ్యం ముందు వాళ్లు దిగతుడుపుగానే జీవించక తప్పడం లేదు. ఈ దారుణ పరిస్థితుల నుండి మహిళా విముక్తి నూతన ప్రజాతంత్ర విప్లవం లేకుండా ఊహించలేం. మహిళ లేని విప్లవం గెలువబోదు.

**పోరుబాటలో రైతాంగం:**

భారతీయ సేద్య రంగంలోని రైతుల జీవితాలు సమస్యల పుట్టగా మారి సతమతమవుతోన్నాయన్నది బహిరంగ రహస్యమే. మన దేశ రైతాంగానికి సుదీర్ఘకాల పోరాట చరిత్ర, వారసత్వం ఉంది. బ్రిటిష్ పాలనలో సేద్యం గిట్టుబాటు కాక మహారాష్ట్ర రైతులు తిరగబడ్డారు. బ్రిటిష్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 1928లో సర్దార్ పటేల్ నాయకత్వంలో జరిగిన బార్డోలీ సత్యాగ్రహం తెలిసిందే! 1938జనవరిలో మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంత రైతాంగ సమస్యలపై అంబేద్కర్ వామపక్షాలతో కలిసి అంటరానితనాన్ని పక్కనపెట్టి మహార్, కున్బీ (ఆరె) రెండు విశాల ప్రజా సముదాయాలకు చెందిన 20వేల మంది రైతులను సమైక్యపరిచి కౌలు సమస్యపై అపూర్వమైన ప్రదర్శన జరిపాడు. 1946-47లో బంగాల్‌లో ఉధృతంగా సాగిన తేభాగా ఉద్యమం తెలిసిందే! ఇవే కాకుండా ఆ కాలంలో మరెన్నో రైతాంగ ఉద్యమాలు జరాగాయి. ఆ మహోద్యమంలో బ్రిటిష్‌వారి అణచివేతలో అసువులు బాసిన 10లక్షల భారతీయులలో రైతులే అత్యధికం. వారి త్యాగాలకు ఫలితం అర్ధ వలస అర్ధ భూస్వామ్యం. దాదాపు అంతే సంఖ్యలో త్యాగాలతో చైనా రైతాంగం అధికారం గెలుచుకుంది.

భూమి, భుక్తి, దోపిడీ నుండి విముక్తి కోరుతూ 1946 నుంచి 1951 వరకు కొనసాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జగద్విదితమే. ఆ తర్వాత 1967నక్సల్‌బరీ నుండి నేటి వరకూ దేశంలో సాగుతున్న వ్యవసాయక విప్లవం మన ముందుంది.

దేశంలో హిందుత్వ శక్తులు గద్దెనెక్కిన తర్వాతి నుండి మిలిటంటుగా రైతు పోరాటాలు ముందుకు రావడం గమనార్హం. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం, 2014లో 687రైతు ప్రదర్శనలు జరగగా 2015లో ఒక్క ఏడాదిలోపే 2,683నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఒక సంవత్సరం తర్వాత అంటే 2016లో రైతు నిరసనల సంఖ్య రెట్టింపై 4,837కు చేరుకుంది. మరోమాటలో చెప్పాలంటే కేవలం మూడేళ్ల వ్యవధిలోపే రైతుల నిరసన ప్రదర్శనలు ఏడు రెట్లు పెరిగాయి. తమిళనాడు రైతులు అర్ధనగ్నంగా జంతర్-మంతర్ వద్ద రోజుల తరబడి ప్రదర్శనలు చేశారు. రైతుల్లో పెరుగుతున్న ఆగ్రహావేశాలకు ఇది స్పష్టమైన సంకేతంగా చెప్పవచ్చు.

2018 మార్చిలో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా రైతులు తమ న్యాయమైన డిమాండ్లపై 182 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసి ముంబయి చేరుకున్నారు. ఆ తర్వాత హరిద్వార్ నుంచి న్యూఢిల్లీ వరకు కిసాన్ యాత్ర జరిగింది. తదనంతరం మరిన్ని భారీ రైతు నిరసన ప్రదర్శనలు జరిగాయి. వీటిల్లో ఆదివాసీలు, భూమి లేని రైతులతో కూడిన అతి పెద్ద ప్రదర్శన కూడా ఒకటి. 2018జూన్ 1నుంచి పది రోజుల పాటు దేశవ్యాప్తంగా అన్ని నగరాలకు పాలు, కూరగాయలు, ఆహార ధాన్యాలను నిలిపివేయనున్నట్లు రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ ప్రకటించింది. 110రైతు సంఘాల సమాఖ్యగా రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ వ్యవహరిస్తోంది. సాగు ఖర్చుతో పాటు దానికి అదనంగా 50శాతాన్ని జోడించి స్వామినాథన్ చెప్పినట్టుగా కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని, మొత్తం సాగు రుణాన్ని మాఫీ చేయాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రైతాంగం గత కాలపు అవశేషం కాదు; దేశ, ప్రపంచ భవిష్యత్ నిర్మాణంలో

రైతులు, సేద్యం, గ్రామాలు అంతర్భాగం' అని స్పష్టీకరిస్తూ 'ఫార్మర్స్ ఛార్టర్' పేరిట పోరాట కమిటీ విస్తృత డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేసి, రుణభారం నుంచి రైతుల విముక్తి బిల్లుకు, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరను రైతులకు హక్కుగా కల్పించే మరో బిల్లుకు చట్టరూపం ఇవ్వాలని రైతుసంఘాలు గట్టిగా కోరాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నీటి తీరువా, డీజిల్ తదితర వ్యయాల్ని తగ్గించడం నుంచి, రైతు కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత కల్పన దాకా అనేక డిమాండ్లు ఆ 'చార్టరు'లో పొందుపరిచారు. సమాజంలో అన్నదాతల ప్రాధాన్యతను గుర్తించి వారి పోరాటాలకు విద్యార్థులు, కళాకారులు, మేధావులు, పట్టణ ప్రజలు తమ పూర్తి మద్దతునివ్వడం దేశంలో వ్యవసాయ విప్లవ ఆవశ్యకతకు అద్దం పడుతుంది.

**ముగింపు**

నర్మదా నదికి అతి సమీపంలో ఉన్న 70గ్రామాల్లో నీరు లేక ఓవైపు గుజరాత్ రైతన్నల పొలాలు ఎండిపోతుంటే దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,000కోట్ల ఖర్చుతో ప్రపంచంలోనే అతి ఎత్తైన 182మీటర్ల (600 అడుగుల) సర్దార్ పటేల్ విగ్రహం పాదాల క్రింద అందమైన కృత్రిమ జల దృశ్యం పర్యాటకులకు కనిపించేందుకు వీలుగా నర్మదా, గరుడేశ్వర్ ఆనకట్టలనుంచి నీరు విడుదల చేశారు. ముంబయి సముద్రంలో శివాజీ విగ్రహానికి మూడున్నర వేలు తగులపెట్టారు. కుంభమేళాలకు రూ.4,200కోట్లు, తన నిర్వాకాల ప్రచారానికి రూ.6వేల కోట్లు, హిందీ భాషా ప్రచారానికి రూ.800కోట్లు, జియో కోసం వెయ్యికోట్లు పాలకులు ఖర్చు చేశారు. పేదల పాలిట శాపంగా మోదీ తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం రైతాంగ జీవితంలో అశనిపాతమైంది. దానితోపాటు ప్రపంచంలో మరెక్కడా లేని నాలుగు శ్లాబుల జీఎస్‌టీతో కుదేరిల్లిన చిన్న పరిశ్రమల మూలంగా 35లక్షల ఉద్యోగాలూడాయి. వివిధ రకాల నష్టపోయిన ఉద్యోగాల సంఖ్య 4.70కోట్లు అని 'జాతీయ నమూనా సర్వే సంస్థ' తేల్చిచెప్పింది. రాజస్థాన్ టెక్స్‌టైల్, గుజరాత్ డైమండ్ పరిశ్రమల నుండి మూతపడుతున్న వార్తలు అందుతూనే ఉన్నాయి. మోదీ ప్రజాసేవలకు ఉబ్బితబ్బిబై దేశ విదేశీ కుబేరులు అందచేసిన వందలాది బహుమానాలను వేలం వేయగా వచ్చే డబ్బు ఆ హిందూ 'హృదయ సామ్రాట్' పంట భూములకు సాగునీటి వ్యవస్థను పక్కనపెట్టి 'నమామే గంగా' పథకానికి సమర్పిస్తాడట! ఇదీ పాలకుల వరుస. రైతులపట్ల వారి అనుగ్రహం.

దేశంలో వ్యవసాయ దిగుబడులు 285మిలియన్ టన్నుల మేర పెరిగాయి. కానీ మూడో వంతు ప్రజలకు మూడు పూటలా కడుపునిండా తిండి లేదు. రైతు ఆదాయం యేటా 20,000 అని అధికారికంగానే నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. నాలుగేళ్ల క్రితమే 7వ వేతన సంఘం చేసిన సిఫారసుల ప్రకారం 45లక్షల మంది కేంద్ర ఉద్యోగులకు, 50లక్షల మంది పింఛన్‌దారులకు దానితో లబ్ధి చేకూరగలదని అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఏటా ప్రభుత్వం నాలుగున్నర లక్షల కోట్ల రూపాయల 'భారాన్ని' భరిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. రైతుల గిట్టుబాటు ధరలకు అందులో పదోవంతు చెల్లిస్తే సరిపోతుందంటారు. నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగికి నెలకు కనీస వేతనం రూ.18,000 లభిస్తుందన్న విషయం తెలిసిన వారికి ఈ దేశంలో 2022వరకూ మోదీ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసినా రైతులు ఎంతటి హీన స్థితిలో ఉంటారో విడిగా చెప్పాల్సిన అవసరం లేదు.

మన దేశంలో మెజార్టీ రైతుల సమస్య ప్రధానంగా భూమి సమస్య. దానితో పాటు నాణ్యమైన విత్తనాలు, చౌక ధరలకు ఎరువులు, అవసరమైన పరపతి సౌకర్యాలు, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు రైతులకు లభించాలి. అవి రైతు సమస్యలకు పరిష్కారాలు. కానీ అవేవీ ఈ వ్యవస్థలో వారు పొందలేరు. అనేక పాక్షిక సమస్యలపై పోరాడుతున్న రైతాంగాన్ని మన దేశంలో రివిజనిస్టులతో సహ ఏ దోపిడీ రాజకీయ పార్టీలు వారి మౌలిక సమస్యలపై వారిని సమీకరించవు. అధికారపక్షం రైతు ఆగ్రహంపై నీళ్లు చల్లే కుసంస్కరణలకే పూనుకుంటుంది. ఏ 'న్యూ ఇండియా'లు వారి సమస్యలను పరిష్కరించవు. మెజారిటీ అణగారిన ప్రజల జీవనాధారమైన వ్యవసాయంపై, వ్యవసాయ కూలీలపై ఒక స్పష్టమైన ఆలోచనతో 'కల్టివేటర్స్ విప్ కార్డ్'లో వ్యవసాయాన్ని ప్రజాధార పరిశ్రమగా గుర్తించాలని, ప్రభుత్వమే చెరువులు, కాలువలు తవ్వించాలని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూమిని ప్రజల సౌకర్యార్థం పంచాలని పూలె కోరాడు. కాని ఆయన ఆశయాలను ఎత్తిపట్టే ఆయన అనుయాయిలేవరు ఆ డిమాండ్స్ కోసం పోరాడడంలేదు. పొద్దస్తమానం అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని స్తుతిస్తూ పబ్బం గడుపుకుంటున్న దళిత నాయకులు కనీసం ఆయన కోరినట్టయినా దేశంలోని భూములను జాతీయం చేయాలనీ, సహకార సంఘాల ద్వారా సేద్యం చేయాలనీ దళితుల ప్రధాన సమస్య భూ సమస్య పరిష్కారానికి నడుం బిగించడం లేదు. సారాంశంలో చెప్పదలుచుకున్నదేమంటే వారెవరూ భూమి సమస్యను ఎత్తడమే లేదు.

నిజానికి ఈ దేశంలో వ్యవసాయక విప్లవం ద్వారానే రైతుల మౌలిక సమస్యల పరిష్కారం సాధ్యం అవుతుంది. ఆ విప్లవం కేవలం రైతాంగ సమస్యేకాదు. అది సామాజిక సమస్య. రైతాంగం నిస్సందేహంగా అందులో ప్రముఖ పాత్ర పోషిస్తారు. వారికి అన్ని సెక్షన్‌ల ప్రజల సమరశీల మద్దతు అవసరం. ఆ దిశలో కదులుతున్న రైతాంగానికి, మద్దతిస్తోన్న ప్రజానీకానికి కార్మికవర్గం నాయకత్వం అందించాలె. నేటి రైతాంగ పోరాటాలను ఆ దిశలో పురోగమింపచేసే లక్ష్యంతో నాయకత్వాన్ని అందించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇది ఈ నాటి తక్షణ సమస్య. ★

**(అయిపోయింది)**

## సకల జనుల మద్దతుతో ముఖ్యమంత్రి అహంకారాన్ని బహిరంగం చేసిన

# ఆర్టీసీ కార్మికుల సమరశీల చైతన్యం

2014 నుండి 2019 వరకు ఆర్టీసీ తెలంగాణా ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం వెయ్యి కోట్లు చొప్పున 5 వేల కోట్ల రూపాయలు చెల్లించింది. ప్రభుత్వం మాత్రం బస్సు పాసుల మీద యివ్వాల్సిన రాయితీ మొత్తం 2700ల కోట్ల రూపాయలు చెల్లించకుండా కేవలం 710 కోట్లు మాత్రమే చెల్లించింది. డీజిల్ మీద వార్షిక పన్ను 600ల కోట్లు, మోటార్ వెహికల్ టాక్స్ 230 కోట్లు, జీఎస్టీ రూపంలో 100 కోట్లు యింకా జాతీయ రహదారుల మీది టోల్ ప్లాజాల్లో 60 కోట్లు ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం జేరుతున్నాయి. ఆర్టీసి కి అధిక నష్టం కలిగించే అక్రమ రవాణా వ్యవస్థకు పర్మిషన్‌లు యివ్వడంతో ట్రావెల్ ఏజన్సీలు లాభాలు దండుకుంటున్నాయి.

తమిళనాడు, కర్ణాటకల్లో ప్రభుత్వాలు అన్ని పన్నులు మినహాయించాయి. అలా పన్నులు మినహాయించాలని, అక్రమ రవాణాని అరికట్టమని, భాగ్యనగరం అంతా తిరిగే సిటీ బస్సుల పై వచ్చిన నష్టాన్ని ప్రభుత్వం హామీ పడినమేరకు చెల్లించమని, ప్రభుత్వం ఆర్టీసి కి చెల్లించవలసిన బకాయిలు చెల్లించమని, డ్రైవరు, కండక్టర్ పోస్టులు భర్తీ చేయమని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించమని, అలాగే ప్రజా రవాణా వ్యవస్థ కాబట్టి, ప్రభుత్వంలో విలీనం చేసుకోమని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన కోర్కెలకు యావత్తు తెలంగాణా సమాజం మద్దతు ప్రకటించి వారికి అండగా నిలిచింది. వారి విజయంలో భాగం అయ్యింది.

అక్టోబర్ 5న సమ్మె మొదలైన నాటి నుంచి, సమ్మె విరమణ జరిగిన నవంబర్ 25 దాకా, విరమణ మర్నాడు కూడ, ఆర్టీసీ కార్మికుల మీద ప్రభుత్వం ప్రదర్శించిన దమనకాండ గతాన్ని మించిపోయింది. వేలాదిగా పోలీసుల మోహరింపు, డిపోల దగ్గరా, బస్ స్టాండుల దగ్గరా కండక్టర్ల, డ్రైవర్ల విచ్చలవిడి అరెస్టులు, నిరసన ప్రదర్శనల మీద లాఠీచార్జిలు, బాష్పవాయు ప్రయోగాలు, కార్మికుల ఇళ్ల మీద దాడులు చేయడం, పని చేసిన సెప్టెంబర్ నెలకు కూడ జీతం ఇవ్వకపోవడం, నాయకత్వాన్ని, ట్రేడ్ యూనియన్లను చీలదీయడాలికి ప్రయత్నాలు, 'సెల్ఫ్ డిస్మిస్' బెదిరింపులు, హైకోర్టు నాటకాలు, యాజమాన్యం, ప్రభుత్వం విడుదల చేసిన బెదిరింపు ప్రకటనలు... ఎన్ని జరిగినా కార్మికులు తమ పోరాటాన్ని ఆపలేదు.

తనకు ఎదురులేదని భావిస్తున్న ముఖ్యమంత్రి అహంకారపు బండారాన్ని ఆర్టీసీ కార్మికులు బైటపెట్టడంతో పాలకుల కళ్లు బైర్లు కమ్మాయి. ముఖ్యమంత్రి ఎన్ని బెదిరింపులు, హెచ్చరికలు, దుష్ప్రచారాలు, కుట్రలు, చీలిక ప్రయత్నాలు చేసినా కార్మికులు తమ వీరోచితమైన సమ్మెను కొనసాగించడం, సమరశీల చైతన్యం ఇంత పెద్దఎత్తున వ్యక్తం కావడంతోప్రశ్నించే ప్రతి ఒక్కరినీ అనుమానించడం ప్రారంభమయింది.

ఆర్టీసీ కార్మికుల నుంచి వారిని దూరం చేసే కుట్రలు ప్రారంభించింది. ఆర్టీసీ సమ్మెలో మావోయిస్టులున్నారనే పేరుతో ప్రశ్నించే గళాలన్నిటి మీద కత్తికట్టింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రశ్నించేవారు, ప్రజలకు చైతన్యం కలిగించేవారు, ప్రజలను సంఘటితం చేసి పోరాటాలలోకి నడిపించేవారు ఉండగూడదని మొత్తం రాష్ట్రాన్నే పోలీసు రాజ్యంగా మార్చివేశారు పాలకులు.

కార్పొరేట్ల ప్రయోజనం కోసం వేగంగా అభివృద్ధి చేస్తున్న మెట్రోరైలు సర్వీసులకు ప్రయాణీకుల రద్దీని పెంచడం, ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడం అనే రెండు లక్ష్యాలతో కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం రచించిన పథకం ఫలించకపోవడంతో అహం దెబ్బతిన్న కేసీఆర్ ప్రజలపై వెయ్యి కోట్ల రూపాయలు ఆర్‌టిసి ఛార్జీల భారాన్ని (కిలో మీటర్‌కు 20 పైసలు) పెంచి, కొత్త ఎత్తుగడతో ముందుకు వచ్చాడు. మరోసారి తన ప్రజా వ్యతిరేక స్వభావాన్ని చాటుకున్నాడు.

హైకోర్టు, గవర్నరు, కేంద్రమంత్రి చెప్పినా కేసిఆర్ వినలేదు. 50 వేల ఆర్టీసి కార్మికుల కుటుంబాల కన్నీళ్లను, కడగండ్లను, భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తూ ఆర్‌టీసిని ప్రైవేటుపరం చేయడం అంటే విద్యా, ఆరోగ్య రంగాలను ప్రజల నుండి దూరం చేసినట్లే ఆర్టీసిని కూడా ప్రజల నుండి దూరం చేయాలనే దురుద్దేశం తప్ప మరేంకాదు.

52 రోజుల తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్టీసి కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరడానికి వెళితే పోలీసులు, ఆర్టీసి యాజమాన్యం అడ్డుకున్నారు. ఎక్కడైనా సమ్మె చేస్తే నిషేధాజ్ఞలు వుంటాయి. కానీ, కేసీఆర్ పాలనలో సమ్మె విరమిస్తే నిషేధాజ్ఞలు అమలు చేశారు. విధుల్లోకి రాకపోతే అరెస్టులు చేస్తారు. కానీ, ఇక్కడ విధుల్లో చేరతామన్నందుకు అరెస్టులు చేశారు. సమ్మె విరమిస్తే కూడా తొలగిస్తామంటున్నారు. కేసీఆర్ రాజకీయాలను ఈ విధంగా రివర్స్‌లో కూడా ప్రయోగించి తన అహాన్ని కాపాడుకోవాలని అనుకుంటున్నాడు.

పడిపోయిన తన ప్రతిష్టను తిరిగి ప్రతిష్ఠించుకునేందుకు వేసిన కొత్త ఎత్తుగడలో భాగంగా కేసీఆర్ సూచన మేరకు ఎంపిక చేసిన కార్మికులను పిలిచి ప్రశ్నించకూడదని హెచ్చరించి, కేసీఆర్‌ను పొగడాలని తర్ఫీదునిచ్చి మేనేజర్లు పంపగా వచ్చిన 97 డిపోలకు చెందిన ఆర్‌టిసి కార్మికులతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి తెలంగాణా ఆర్టీసికి కేసీఆర్ వరాలు ప్రకటించాడు. దీనికి ప్రగతి భవన్ వేదికగా ఆర్టీసీ కార్మికులతో "ఆత్మీయ సమావేశం" అని పేరు పెట్టాడు. కేసీఆర్ మాట వింటే ఏడాదిన్నరలో ఆర్టీసి సంస్థ

## సార్కెన్‌గూడ నరమేధం
## పోలీసుల ఏకపక్ష కాల్పుల ఫలితమని తేల్చిన కమీషన్

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సార్కెన్‌గూడ గ్రామం, సుకుమా జిల్లా జేగుర్‌గుండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిలింగేర్, చిమ్మెల్ పెంట గ్రామాల సరిహద్దుల్లో 2012 సంవత్సరం జూన్ నెల 28 తేదీ నాటి రాత్రి నరమేధం జరిగింది. ఈ ఘటనలో పాల్గొన్న పోలీసు అధికారులకి, ఎస్‌పిఓ గూండాలకి బిజెపి ప్రభుత్వం కానుకలు, అవుట్ ఆఫ్ టర్న్ ప్రమోషన్లు ఇచ్చింది. జూన్ 28 నాటి రాత్రి ఆ మూడు గ్రామాలకు ఆనుకుని వున్న అడవి మధ్యన ఆరు బయలు ప్రదేశంలో ప్రజలు విజ్జ పండుగ కోసం జమకాగా అకస్మాత్తుగా సాయుధ పోలీసులు ఆ గుంపును చుట్టుముట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అక్కడికక్కడే 15 మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోగా, 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆ మరునాటి ఉదయం పోలీసులు ఇల్లిల్లు తిరిగి మరో ఇద్దరిని పట్టుకొని కాల్చి చంపారు. ఆ రకంగా 28, 29 తేదీల నాటి మారణహోమంలో మొత్తం 17 మంది ఆదివాసీలను ఊచకోత కోసారని బాధిత కుటుంబాలు, ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చేసారు.

పోలీసు దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని, అందులో భాగంగా ఆనాటి రాత్రి ఆ అడవుల్లో సంచరిస్తుండగా, చీకట్లను చీల్చుకుంటు నక్సలైట్లు మాపై కాల్పులు జరిపారని, ఆ కాల్పుల్లో మా జవాన్లు 6 మంది గాయపడ్డారని, ఆత్మరక్షణ కోసం మేము తిరిగి కాల్పులు జరపగా ఆ కాల్పుల్లో 17 మంది నక్సలైట్లు మరణించారని పోలీసుల కథనం.

ఈ సమస్యపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం జస్టిస్ వి.కె. అగర్వాల్ సభ్యులుగా ఏక సభ్య విచారణ సంఘాన్ని నియమించింది. జస్టిస్ అగర్వాల్ ఏడు సంవత్సరాల తర్వాత తన నివేదికను 2019 సెప్టెంబర్ 30న ప్రభుత్వానికి సమర్పిస్తూ పోలీసులవన్నీ కట్టుకథలేనని తేల్చారు. ఆ ఘర్షణలో నక్సలైట్ సంస్థలకు చెందిన వారు పాల్గొన్నారని గాని, అసలు అక్కడ వారున్నారని, సాయుధ రక్షణ దళాలతో జరిగిన ఘర్షణలో వారున్నారని గాని చెప్పడానికి సంతృప్తికరమైన ఆధారాలేమీ లేవని స్పష్టం చేశారు. నిజానికి ఆ సాయుధ రక్షణ దళానికి నాయకత్వం వహిస్తున్న కమాండర్ గాని, డిప్యూటి కమాండర్ గాని ఒక్క తూటా కూడా పేల్చలేదంటే ఇది విస్మయం కలిగించే విషయమనీ, నమ్మశక్యంగా లేదని కమిషన్ తేల్చి చెప్పింది. కాల్పులలో గాయపడ్డామని చెప్పుకున్న జవాన్ల విషయంలో కూడా కమిషన్ తన అనుమానాలు వ్యక్తం చేసింది. ఒక జవాను ఎడమకాలి బొటనవేలుకు గాయం అయ్యిందని అఫిడవిట్‌లో రాస్తే, డాక్టర్ తన రిపోర్ట్‌లో కుడికాలి బొటనవేలు అని పేర్కొన్నాడు. జవాన్లు బోర్లా పడుకొని కాల్పులు జరిపిన సందర్భంలో వెనుక భాగాన ఉన్న కాలి బొటనవేలుకు ఎలా గాయం అవుతుందని తన సందేహం వ్యక్తపరిచింది కమిషన్. మరొక జవాను కుడి దవడలోకి బుల్లెట్ చొచ్చుకుపోయిందని డాక్టర్ తన నివేదికలో పేర్కొంటే విచారణలో ఆ జవాన్ మరొక చోట ఎక్కడో గాయం అయిందని తడబడుతూ చెప్పాడు. ఇలాంటి అవకతవకలు కమిషన్ దృష్టికి వచ్చాయి. పోలీసులు ఏక పక్షంగా, విచక్షణా రహితంగా, అడ్డదిడ్డంగా జరిపిన కాల్పుల్లో పోలీసులకు కూడా గాయాలయ్యి ఉండవచ్చునని కమిషన్ నిర్ధారించింది.

---

వెయ్యి కోట్లు లాభంతో నడుస్తుందని అన్నాడు. రెండేళ్ల పాటు ఆర్టీసిలో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించేది లేదని స్పష్టం చేశాడు. దాని బదులు కార్మిక సంక్షేమ బోర్డు పెట్టుకుందామన్నాడు.

ఆ తరువాత కేసిఆర్ ''దయ''తో కార్మికులకు వరాలు ప్రకటించాడు. 56 రోజుల కార్మికుల సుదీర్ఘ పోరాట ఫలితంగా వచ్చిన హక్కుల్ని యిలా చెప్పి తన దొరతనాన్ని చాటుకోవాలని అనుకుంటున్నాడు. పదవీ విరమణ వయసును 60 ఏళ్లకి పెంచడం, మహిళలకు ప్రసూతి సెలవు 90 రోజులు మంజూరు చేయడం, మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం మరియు రెండు లక్షల నష్టపరిహారం, సమ్మె కాలానికి వేతనం చెల్లించడం, ఇంక్రిమెంట్లు కొనసాగించడం, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి బడ్జెట్‌లో ఆర్టీసికి వెయ్యి కోట్లు కేటాయించడం, ఉద్యోగుల పిఎఫ్ బకాయిలను, సిసియస్‌కు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించడం లాంటి హామీలతో పాటు మహిళా కార్మికులు కోరుకున్నరంగులో యూనిఫాంకు అనుమతి యిచ్చి, మహిళా సమస్యల పరిష్కారానికి సూచనలు చేసే కమిటిని ఏర్పాటు చేస్తానని అన్నాడు.

జేఏసీ డిమాండ్‌లు చాలా వరకు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ ముందుగానే వాటిని అంగీకరించి ఉన్నట్లైతే రెండు నెలల కాలం 50 వేల కుటుంబాలు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేయవలసిన అవసరం ఉండేది కాదు. కేసీఆర్ నిరంకుశ వైఖరి కారణంగానే ఇంత ఘర్షణ, ఆ కుటుంబాలకు మానసిక వేధన, ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు కలిగాయి. ఇప్పుడు ఆర్టీసీ చార్జీలు పెంచి కార్మికుల సమ్మె కారణంగా వచ్చిన ఆర్టీసీ నష్టాన్ని పూడ్చడానికి చార్జీలు పెంచుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. నిజానికి ఆర్టీసీకి బడ్జెట్‌లో కేటాయింపు, డీజిల్‌పై సెస్ చార్జీలు మినహాయింపు, ఆర్టీసీకి ఇవ్వాల్సిన రాయితీల సొమ్ము ఇచ్చినట్లైతే ప్రజలపై చార్జీలు పెంచి, వెయ్యి కోట్ల రూపాయల భారాన్ని మోపవల్సిన అవసరం ఉండదు. ఆర్టీసీలో యూనియన్‌లు ఉండవద్దని అంటున్న కేసీఆర్ వైఖరి అప్రజాస్వామికమైనది.

ఆర్టీసీ కార్మికుల పోరాట పటుత్వం, సకలజనుల మద్దతు అన్నీ కలిసి కార్మికుల ఉద్యమానికి రాజకీయ, నైతిక విజయాన్ని చేకూర్చాయి. ఆర్టీసీ కార్మికుల చారిత్రక పోరాటానికి జేజేలు పలుకుదాం. ★

# పోడుభూముల్ని కాపాడుకోవడంకోసం ఆదివాసీ ప్రజలకు పోరాటమొక్కటే మార్గం

ప్రపంచీకరణలో భాగంగా బహుళజాతి సంస్థలు తీవ్రవేగంతో తెస్తున్న నూతన ఆర్థిక విధానాలలో భాగంగా అడవులు, సహజ వనరులు, ఖనిజ సంపదలన్నీ కూడ ప్రైవేటీకరించేందుకు పాలకవర్గాలు పూనుకున్నాయి. ఇందుకోసం ఒక పథకం ప్రకారం పనిచేస్తూ అడవులనూ ప్రైవేటీకరించేందుకు పాలకులు పన్నాగాలు పన్నుతున్నారు. ఇందుకోసం అడవులను ప్రైవేటీకరించే పనిలో భాగంగానే ప్రపంచబ్యాంకు మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో సాముదాయక అటవీ యాజమాన్య పథకం (వియస్సెస్ ) ఏర్పాటు చేసి అడవి నుండి ఆదివాసీలను దూరం చేస్తున్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం నియమించిన అనేక కమిటీల నివేదికలు ఉన్నా అవి ఆచరణలో అమలుకాక ఆదివాసీలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అడవిలో ఆదివాసీలకు మాత్రమే హక్కులు కల్పించే రాజ్యాంగ రక్షణ చట్టాలు, జీఓలు అనేకం ఉన్నా పాలకవర్గం వాటిని కాలరాస్తున్నది.

2018 నవంబర్ నాటికి దేశవ్యాప్తంగా 19.39 లక్షల మంది భూమిహక్కు పత్రాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరించినట్లు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ దగ్గర సమాచారం ఉంది. దీని మూలంగా దేశ వ్యాప్తంగా 20 లక్షల ఆదివాసీల అస్థిత్వం ప్రమాదంలో పడనుంది.

అటవీ హక్కుల చట్టంపై రాజ్యాంగబద్ధతపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే సుప్రీం ఆదేశాలు ఆదివాసీలను నిర్వాసితులు చేస్తున్నాయి. ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు చట్టాలు చేసి ప్రభుత్వాలే వాటిని కార్పొరేట్ మాఫియాకు బలిచేస్తున్నాయి. ఆదివాసీలు సాగుచేస్తున్న పోడు భూముల వల్ల అడవులు నాశనం అవుతున్నాయా, లేక కార్పొరేట్ కంపెనీల వల్ల అవుతున్నాయా అనేది పరిశీలిస్తే ఈ పాలకుల విధానాలు అడవులను ఎంత ధ్వంసం చేస్తున్నారో స్పష్టంగా అర్థం అవుతుంది.

ఈ రోజు ఏజెన్సీ ప్రాంతాలలో 1ఆఫ్70 చట్టానికి విరుద్ధంగా మైనింగ్ మాఫియా, కోల్ మాఫియా, ఇసుక మాఫియా, సింగరేణి ఓపెన్ కాస్టు, విద్యుత్ ప్రాజెక్టులకు అటవీ భూములు కొన్ని వందల, వేల ఎకరాలు బహుళజాతి కంపెనీలకు కేటాయించి ప్రభుత్వం ఆ సంపదపై అతి తక్కువ రాయల్టీ వసూలు చేస్తున్నది.

పోలవరం ప్రాజెక్టు వస్తే పర్యావరణం, అడవి, జీవవైవిధ్యం అన్నీ నాశనం అవుతాయని ఉద్యమించింది ఆదివాసీలే. వేదాంత పోస్కో కంపెనీలకు, బయ్యారం ఉక్కు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమించింది ఆదివాసీలే. అలాంటి ఆదివాసీలను అడవి నుండి దూరం చేయాలని సర్వోన్నతమైన న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం దేనికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం అడవి రక్షణ చట్టాన్ని (ఎఫ్ఆర్ఎ) కుట్రపూరితంగా నీరు గార్చడం ఎవరి ప్రయోజనాల కోసం.

## బహుళ జాతి కంపెనీల కోసమే ఆదివాసులను నిర్వాసితులు చేసే కుట్రలు:

కేంద్ర ప్రభుత్వం చట్టాల సవరణలతో ఆదివాసీల హక్కులను నిరాకరిస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను నెరవేరుస్తున్నది. పాలకులు ఆదివాసులను ఈ ప్రకృతిలో, మానవ సమాజంలో భాగంగా చూడడానికి ఇష్టపడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో 1980 తర్వాత నుండి షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఇతరుల వలసలు విపరీతంగా పెరిగాయి. ఆదివాసుల నివాస ప్రాంతాలన్ని ఆదివాసేతరుల నివాస ప్రాంతాలుగా, వ్యాపార కేంద్రాలుగాను మారిపోయాయి.

తెలంగాణలో అటవీ ప్రాంతాల్లో ఆదివాసులతో పాటు దళితులు, ఇతర పీడిత కులాల ప్రజలు కష్టం చేసి అటవీ భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. దానితో సమస్య రావడం లేదు. భూస్వాములు, కలప వ్యాపారస్తులు, కార్పొరేట్ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండతో ఓపెన్‌కాస్టు గనులు, ఇనుప గనులు, సిమెంట్ ఫ్యాక్టరీలు కోసం గనులు తవ్వుతూ, ఇంకా తదితర అనేక ప్రకృతి వినాశకర కార్యకలాపాలల్లో భాగస్వాములుగా వుంటూ వస్తున్నారు. వీళ్లే అసలైన దురాక్రమణదారులు. కాని 2 శాతం పోడు భూమిని సాగుచేసుకుంటున్న ఆదివాసులను మాత్రమే దురాక్రమణదారులుగా పాలకులు పేర్కొనడం వాళ్ళ దోపిడీ బుద్ధికి నిదర్శనం.

నేడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అభివృద్ధి నమూనా ఆదివాసీల పాలిట శాపంగా మారింది. కార్పొరేట్ సంస్థలు, వ్యాపారులు కలప కోసం, ఖనిజాల కోసం, నీళ్ల కోసం వందల కిలోమీటర్ల అడవుల్ని ఆక్రమించుకొని చేస్తున్న విధ్వంసం కనపడకపోగా, అతిస్వల్ప భూభాగంలో ఆదివాసులు చేసుకునే పోడు భూమి మాత్రమే "ఆధునిక రాజ్యానికి" విధ్వంసకరంగా కనబడింది. అట్లా అది నమ్మబలికి ఆదివాసులను ఆక్రమణదారులను చేసింది. కొన్ని వేల ఏళ్లుగా ఆదివాసులు అడవుల్లో నివసిస్తున్నారు. వారే అడవుల వినాశనానికి కారకులైతే ఇవాళ అడవి వుండేది కాదు. ఆదివాసుల వేట కూడా ఆకలి తీర్చుకోవడానికి తప్ప అమ్ముకోవడానికి కాదు. కార్పొరేట్ల పెట్టుబడిదారుల ఆకలి అపరిమితం. పెట్టుబడిదారులకు దూరంగా వుంచితేనే అడవులు బ్రతుకుతాయి. కాని పెట్టుబడిదారుల కోసం అడవి బిడ్డలను గెంటివేస్తున్నారు. ఇది కార్పొరేట్ కంపెనీల కోసం అడవుల నుండి ఆదివాసులను ఖాళీ చేయించే దుర్మార్గమైన వ్యూహం.

ఇప్పటికే తెలంగాణలో అభివృద్ధి నమూనా బూచిని చూపి భారీ ప్రాజెక్టులు, గనులు వెలికితీత పేరిట ఆదివాసులు, పీడిత ప్రజల నుండి బలవంతంగా భూములను గుంజుకున్నారు. మల్లన్న సాగర్, కాళేశ్వరం, తుపాకుల గూడెం, ఓసీలు, టైగర్‌జోన్‌లు, వన్యప్రాణి అభయారణ్యాలు, పోలవరం ప్రాజెక్టువల్ల లక్షలాది ఎకరాల అటవి, జంతుజాలం అంతరించి పోతున్నాయి. 3వేల ఆదివాసీ గ్రామాలు

జలసమాధి అవుతున్నాయి. మూడు లక్షల మంది ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారు. ఇలా పాలకులే అడవులను విధ్వంసం చేస్తూ ప్రకృతితో మమేకమై బ్రతుకుతున్న అదివాసులను నేడు అడవుల వినాశకారులుగా ముద్రవేసి బ్రతకనీయకుండా చేస్తున్నారు. ఆదివాసులు, పీడిత ప్రజలు, ప్రజాస్వామికవాదులు, పర్యావరణ ఉద్యమ కారులు కలిసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఆ ప్రజల మీద ప్రభుత్వం పాశవికంగా దాడులు చేస్తున్నది.

## ఆదివాసీ గూడాలపై ఫారెస్టు అధికార్లు, పోలీసుల దాడులను ప్రతిఘటిస్తున్న ప్రజలు!

తెలంగాణలో 2018 నవంబర్ 30వ తేది నాటికి 94,360 అటవీ హక్కుల పత్రాలను పంపిణీ చేశారు. వీటిలో 7,54,339 ఎకరాల భూమికి హక్కు పత్రాలు అందాయి. 83,757 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. అంటే 44 శాతం క్లైయిమ్స్ తిరస్కరించారు. ఈ వాస్తవాలు తెలిసి కూడా తెలంగాణ ప్రభుత్వం గత 5 యేడ్లుగా పట్టా భూములను కూడా గుంజుకుంటుంది. భద్రాద్రి కొత్తగూడెం నుండి మొదలు మహబూబ్‌బాద్, ములుగు, జయశంకర్, ఉమ్మడి అదిలాబాద్ మహబూబ్‌నగర్ వరకు భూములను సాగు చేసుకోకుండా భూముల చుట్టూ భారీ కందకాలు తవ్వుతున్నది. అడ్డుకున్న ప్రజలపై కేసులుపెట్టి జైలుకు పంపిస్తున్నది.

ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి అసెంబ్లీ ఎన్నికల్లో పోడు భూములకు పట్టాలిస్తానని నమ్మబలికారు. తీరా యేరు దాటాకా బోడ మల్లయ్య అన్నట్లు ప్రభుత్వం మళ్లీ అదే దౌర్జన్యం కొనసాగిస్తుంది. అదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లి, సులుగుపల్లి, మైసంపేట, బ్రిడ్జిగూడెం, నాయక పోడుగూడెం, జొన్నగూడెం, మర్కగూడెం, ధర్మాజిపేట, మొర్రిపేట, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌బాద్ జిల్లాల్లో కర్ణగండి, వీరాపురం, కోటగడ్డ, ఇల్లందు క్రాస్‌రోడ్, ముత్తారికట్ట, కొండాపురం, ముల్కలపల్లి, లక్ష్మిదేవిపల్లి ఇంకా తదితర వందలాది గ్రామాలలో ఆదివాసులు ఎప్పటినుండో సాగు చేసుకుంటున్న భూములలో ఫారెస్టు పోలీసుల దాడులతో వ్యవసాయం చేయడంలేదు. నిజామబాద్ జిల్లా యాసారం తండా లంబాడాల పట్టా భూమిని గుంజుకున్నారు. సిరికొండ ప్రాంతంలో 30 గ్రామాలలో అనేక పోరాటాల ద్వారా లంబాడీలు సాధించుకున్న 20 వేల ఎకరాల భూమిని ఫారెస్టు శాఖ ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తుంది.

ఆదివాసీ గ్రామాలలో ఆదివాసీ పేద రైతాంగం ఎప్పుడు తమ భూములను ప్రభుత్వం ఆక్రమిస్తుందోనని భయం భయంతో జీవిస్తున్నారు. కొమురం భీం, అసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొలాంగోందు గూడేన్ని ఫారెస్టు అధికారులు 30 ఇళ్ళను కూల్చి ఖాళీ చేయించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కౌశెట్టివాయి శివారు గ్రామం పరికగూడెం వలస ఆదివాసి ప్రజలను గ్రేహౌండ్స్ బలగాలు తీవ్ర చిత్రహింసలకు గురిచేసి వాళ్ళను తరిమివేసి 25 ఇళ్ళను పూర్తిగా కాల్చి వేశారు. ములుగు, భద్రాద్రి జిల్లాల్లో మరో 10 వలస ఆదివాసుల గ్రామాలను ఫారెస్టు అధికారులు కాల్చి వేశారు.

ఛత్తీస్‌గఢ్ నుండి వలస వచ్చిన ఆదివాసులు ఈ దేశ పౌరులే కాదంటు వాళ్ళను తరిమి వేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ హుకుమ్ జారి చేశాడు. కొత్త సారసాల, చలమన్న నగర్, లింగాల, షెట్టుపల్లి, శెంబునిగూడెం వగైరా గ్రామాలలో అటవీ అధికారులతో జరిగిన ఘర్షణల్లో వందలాది మంది ఆదివాసులపై పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైళ్ళో బంధించారు. జంతువులను, ఉడుతలు, ఉడుములను వేటాడుతున్నారని జరిమానాలు విధిస్తూ మరికొంత మందిని జైలుకు పంపించారు.

2019 జూన్ నెల నుండి ఇప్పటి వరకు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌బాద్, ములుగు, జయశంకర్, అదిలాబాద్ జిల్లాల్లో ఆదివాసులను మావోయిస్టులుగా ముద్రలు వేస్తూ వందలాది మందిని అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలకు గురి చేస్తున్నారు. వీరిలో కొందరిపై ఊపా చట్టం మోపి జైలుకు పంపారు. బుగ్గతోగు, రోల్లగడ్డ గ్రామాల వద్ద ఇద్దరు విప్లవకారులను పట్టుకొని గ్రేహౌండ్స్ బలగాలు పోడు భూముల పోరాటాలకు వీరు నాయకత్వం వహిస్తున్నారని బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేశారు.

జలగలంచ గ్రామంలో 200 మంది అటవీ శాఖ సిబ్బంది ఆదివాసులను, మహిళలను చెట్లకు కట్టివేసి కొట్టారు. ఇల్లను, నల్లాలను ధ్వంసం చేశారు. చివరకు ఆదివాసులు బ్రతిమిలాడిన విత్తన మొక్కలను, పొట్టకు వచ్చిన పంటలను జేసీబీ లతో ధ్వంసం చేస్తుంటే ఆదివాసులు ప్రతిఘటించాల్సి వస్తున్నది. షెట్టుపల్లి, శెంబునిగూడెం, గోర్కల మడుగు, గంగారం, మాడగూడెం, లింగాల, కొత్తసారసాల, చలమన్ననగర్, రోలగడ్డలలో ఫారెస్టు అధికారులను తన్ని తరిమారు.

ఆదిలాబాద్ కవ్వాల టైగర్ జోన్‌ను ప్రకటించి 50 వేల మంది ఆదివాసులను గెంటివేయబోతున్నది. ఇటీవలి కాలంలో కవ్వాల అటవి పరిసర గ్రామాలైన చింతగూడెం ప్రజలు తమ పశువులను అడవికి తీసుకొని పోతే పశువులను తోలవద్దని ఫారెస్టు వాళ్లు కాపర్లను కొడితే ఆగ్రహించిన చింతగూడెం గ్రామ ప్రజలు పశు వులను 16వ హైవే రహ దారిపై పెట్టి నిరసన తెలిపారు. ఏటూరునాగారం, కిన్నరసాని, ప్రాణహిత, శివ్వారం అటవి ప్రాంతాలను కూడా వన్యప్రాణి అభయారణ్యాలుగా ప్రకటించి సీ.సీ కెమెరాలు పెట్టారు.

హరితహారంలో భాగంగానే ఆదివాసులను అడవులలోకి రావద్దని వస్తే కేసులు పెడతామని హుకుమ్ జారి చేస్తున్నారు. "హరిత హారం" పేరుతో ఆదివాసీ ప్రజలను భూముల నుండి గెంటివేస్తున్నారు.

తెలంగాణ కొత్త రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయి అటవీ హక్కుల చట్టాన్ని నిలిపివేసి 2015లో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి ఆదివాసుల పాలిట శాపంగా మారింది. పంట చేళ్ళను ధ్వంసం చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని దౌర్జన్యంగా కొనసాగించింది.

*(మిగతాది **19**వ పేజీలో...)*

# తెలంగాణలో 23 ప్రజా సంఘాలపై నిర్బంధం

1996 నుండి జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజలతో కలిసి ఈ ప్రజాసంఘాలన్నీ పాల్గొన్నాయి. రాజకీయ పార్టీలు మౌనంగా వున్నప్పుడు కూడా తెలంగాణ ప్రజలు నిరాశ చెందకుండా ఉద్యమ చైతన్యాన్ని ఈ ప్రజాసంఘాలే నిలబెట్టాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నిరుద్యోగం, దళితులపై దాడులు, ఆదివాసుల్ని భూనిర్వాసితుల్ని చేయడం, మహిళల, ముస్లింలపై దాడులతో సహా ఎన్నో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈ ప్రజాసంఘాలు పోరాడాయి. ప్రజాస్వామిక గొంతును నిర్బంధించడానికి వ్యతిరేకంగానూ, ధర్నా చౌక్ పరిరక్షణ కోసం పోరాడాయి. ప్రజల వైపు నిలబడిన ప్రజాసంఘాలను, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తిచూపుతున్న వారిని మావోయిస్టుల పేరు మీద భయపెట్టడం పాలకులకు అలవాటయ్యింది. ప్రజా జీవితంలో భాగంగా వివిధ రకాల ప్రజా సమస్యల మీద పోరాడుతున్న ప్రజాసంఘాలను ఎలాంటి ఆధారాలు లేకుండా నిషేధిత సంఘాలంటూ పోలీసులు దుష్ప్రచారం చేస్తున్నారు.

అక్టోబర్ 12న ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ తెలంగాణలో పనిచేస్తున్న ఇరవై మూడు ప్రజా సంఘాల జాబితాను పత్రికల వారికి అందజేశాడు. ఆ జాబితాలో ఉన్న పేర్లు: 1. ఆదివాసి విద్యార్థి సంఘం. 2. అమరుల బంధుమిత్రుల సంఘం. 3. చైతన్య మహిళా సంఘం. 4. సివిల్ లిబర్టీస్ కమిటీ. 5. కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ ది పొలిటికల్ ప్రిజనర్స్. 6. డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్. 7. గిరిజన ఐక్య వేదిక. 8. హ్యూమన్ రైట్స్ ఫోరం. 9. కుల నిర్మూలన పోరాట సమితి. 10. పేట్రియాటిక్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్. 11. పీపుల్ అగెనెస్ట్ పోలవరం ప్రాజెక్ట్. 12. భూనిర్వాసితుల కమిటీ. 13. ప్రజా కళా మండలి. 14. తెలంగాణ డెమొక్రటిక్ ఫోరం. 15. తెలంగాణ అసంఘటిత కార్మిక సమాఖ్య. 16. తెలంగాణ ప్రజా ఫ్రంట్. 17. తెలంగాణ రైతాంగ సమితి. 18. తెలంగాణ విద్యార్థి సంఘం. 19. తెలంగాణ విద్యార్థి వేదిక. 20. తెలంగాణ యూత్ ఫోరం. 21. తుడుం దెబ్బ. 22. విప్లవ రచయితల సంఘం. 23. విస్థాపన విరోధి జన వికాస్ ఆందోళన్. నిజానికి వీటిలో ఏ ఒక్క సంస్థా నిషేధానికి గురైనది కాదు. ప్రభుత్వం ఒక సంస్థను నిషేధించాలంటే జరగవలసిన చట్టబద్ధమైన ప్రక్రియ ఏదీ వీటిలో ఏ ఒక్క సంస్థ విషయంలోనూ జరగలేదు.

వీటిలో కేవలం విప్లవ రచయితల సంఘంను మాత్రం 2005 ఆగస్ట్‌లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిషేధించగా, చట్టబద్ధంగా ఏర్పడిన ముగ్గురు న్యాయమూర్తుల పర్యవేక్షణ కమిటీ ఆ నిషేధాన్ని కొట్టివేసింది. అలా 2005 నవంబర్‌లోనే ఆ నిషేధాన్ని ఎత్తివేశారు.

వ్యక్తిగత స్వేచ్ఛకి భంగం కలిగించేలాగా పోలీసు స్టేషన్‌కి వచ్చి 33 ప్రశ్నలతో వున్న నమూనా పత్రం నింపాలని పోలీసులు వత్తిడి చేస్తున్నారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు వుంటాయని బెదిరిస్తున్నారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కి తీసుకుని వెళ్లి వేధిస్తున్నారు. ఇదే విషయంలో చైతన్య మహిళా సంఘం కార్యదర్శులు హైకోర్టులో పిటిషన్ వేశారు.

ఇటువంటి భయభీతావహ పరిస్థితి, అబద్ధ ప్రకటనలు, బెదిరింపులు, సోదాలు, అరెస్టులు, తప్పుడు ఒప్పుదల ప్రకటనలు, మెడ మీద నిరంతరం కత్తి వేలాడుతుండడం కలగలిసిన ఈ మొత్తం కుటిల పథకపు లక్ష్యం ఒకటే– తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రశ్నించేవారు, మాట్లాడేవారు, విశ్లేషించేవారు, ప్రజలకు చైతన్యం కలిగించేవారు, ప్రజలను మేల్కొలిపేవారు, ప్రజలను సంఘటితం చేసి పోరాటాలలోకి నడిపించేవారు ఉండగూడదని మాత్రమే.

ఆర్టీసీ కార్మికుల సమరశీల చైతన్యం ఇంత పెద్దఎత్తున వ్యక్తం కావడం వెనుక విప్లవోద్యమమో, విప్లవోద్యమ సానుభూతిపరులో, ప్రజా సంఘాలో ఉన్నాయని పాలకులు, పోలీసులు అనుమానించడం ప్రారంభించారు. సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న మిగిలిన వాళ్లందరినీ ఏదో విధంగా ఎదుర్కోవచ్చు గాని, మావోయిస్టు ఉద్యమమో, వారి సానుభూతిపరులో సమ్మె వెనుక ఉంటే వారి ప్రభావాన్ని అడ్డుకోవడం కష్టమని పోలీసుల అంచనా.

ఆర్టీసీ కార్మికులసమ్మె మొదలైన అక్టోబర్ 5 నుంచి గడిచిన ఆరు వారాలలో మూడు కొత్త కేసులు బనాయించి, వాటిలో 64 మందిని నిందితులుగా చూపారు. మూడు కేసులలోనూ ఉమ్మడిగా ఉన్నాయి. ఐదారు పేర్లు అజ్ఞాత నాయకుల, కార్యకర్తల పేర్లు ఉన్నాయి. ఇంకా కనీసం యాభై మంది తెలంగాణ ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను, ప్రజాస్వామిక ఉద్యమాలలో పాల్గొంటున్న, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న తెలంగాణ బిడ్డలను ఇలా అక్రమ కేసుల్లో ఇరికించారు.

కేసీఆర్ ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రజా సంఘాల రాష్ట్ర నాయకత్వాన్ని అరెస్టులు చేయిస్తూ, జైళ్ళో పెడుతూ, క్రింది కార్యకర్తలను కౌన్సిలింగ్ చేస్తూ సంఘాలలో పని చేయవద్దని, చేస్తే జైళ్ళో పెడతామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. ప్రజా సంఘాలలో కోవర్టులను చొప్పించి రహస్యాలను సేకరిస్తూ నష్ట పరుస్తున్నారు.

నిర్బంధం ప్రతిఘటనను పెంచుతుంది. విప్లవ సంక్షోభాన్ని తీవ్రం చేస్తుంది. ★

## అట్టెపాడి అమరులకు జోహార్లు

కేరళం రాష్ట్రంలోని పలక్కడ్ జిల్లా పూదూర్ పంచాయితీలోని మంజఖండి వద్ద పోలీసులతో జరిగిన ఎదురుకాల్పులలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కార్యకర్తలు నలుగురు అమరులయ్యారు. 2019 అక్టోబర్ 28 నాడు జరిగిన ఈ ఘటనలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్స్ మణివాసగం (అప్పు), గణేష్ (డీవీసీఎం), అరవింద్ (ఏసీ కార్యదర్శి), పార్వతి (ఏసీఎం) అమరులు కాగా, కాల్పులలో గాయపడిన రాష్ట్ర కమిటీ సభ్యుడు దీపక్ (రాములు కోర్సా) తప్పుకున్నాడు. కానీ, తర్వాత ఆయన్ని కోయంబత్తూర్ ఆసుపత్రి నుండి పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా గత పదేళ్లకు పైగా నూతన భారత ప్రజాతంత్ర విప్లవోద్యమాన్ని పురోగమింప చేసే కర్తవ్యంలో నిమగ్నమై పశ్చిమ కనుమలలో (కేరళం–కర్ణాటక–తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం–ట్రైం జంక్షన్) ప్రజల మధ్య పని చేస్తున్నారు. ఆ ప్రజల మధ్యే, పోలీసులతో తుదివరకు పోరాడి అసువులు బాసిన అమరవీరులకు మధ్య రీజనల్ బ్యూరో వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తోంది.

పోలీసుల ఘాతుకాన్ని బూటకపు ఎన్‌కౌంటర్‌గా ఖండిస్తూ కేరళంలోని విద్యార్థులు, మేధావులు, వామపక్షాల కార్యకర్తలు ప్రదర్శనలు చేశారు. వామపక్ష కూటమిలోని సీపీఐ పోలీసు ఎన్‌కౌంటర్ బూటకమని ఖండించింది. హక్కుల కార్యకర్తలు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు ఎదురుకాల్పులు బూటకం అని స్పష్టం చేశారు. పోలీసు కాల్పులను ఖండిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ (ఎం) అనుబంధ విద్యార్థి సంఘ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్‌ను సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.ఏ. బేబీ కూడా ఖండించాల్సి వచ్చింది. విద్యార్థులపై ఊపా మోపడాన్ని అనేక సంస్థలు ఖండించాయి.

గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాములు కోర్సా (దీపక్) ను కోయంబత్తూర్ నుండి పీసీఆర్ తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ హక్కుల సంఘాల నాయకుడు కోర్టుకు వెళ్లి నిరోధించగలిగారు. కానీ, ఆ తర్వాత ఆయన్ని అదే స్థితిలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు తమ రాష్ట్రం తీసుకెళ్లారు. కామ్రేడ్ దీపక్ అరెస్టును మధ్య రీజనల్ బ్యూరో ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండిస్తున్నది.

ట్రై జంక్షన్ ప్రాంతంలో గత ఏడేళ్లుగా కొనసాగుతున్న విప్లవోద్యమంపై మూడు రాష్ట్రాల బలగాలు నిరంతరం దాడులు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉద్యమం కాలూనుకోకుండా, బలపడకుండా చేయడానికి తీవ్రమైన రాజ్యహింసను ప్రయోగిస్తున్నారు. అయినప్పటికీ ఆ ఉద్యమాన్ని కాపాడుకోవడానికి అక్కడి ప్రజలు, విద్యార్థులు, మేధావులు, వామపక్షాల కార్యకర్తలు చేస్తున్న కృషి అభినందనీయం. వారు ఆ ప్రాంతంలోని దోపిడీ వర్గ రాజకీయ పార్టీల వాస్తవ స్వభావాన్ని ఎండగడుతూ, రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీల కుమ్మక్కును బహిర్గతపరుస్తూ ప్రజా ఉద్యమాన్ని కాపాడుకోవడానికి మరింత దృఢంగా, పెద్దఎత్తున ముందుకు రావాలనీ సీఆర్‌బీ విజ్ఞప్తి చేస్తోంది. కా. దీపక్ విడుదలకు హక్కుల కార్యకర్తలు తమ కృషిని ముమ్మరం చేస్తారని కోరుతోంది.

---

## భాకపా (మావోయిస్టు) 15వ వార్షికోత్సవ వేడుకలను
## చైనా విప్లవ 70వ వార్షికోత్సవ వేడుకలనూ
## ఘనంగా జరుపుకున్న దండకారణ్య ప్రజలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మా–లె) 50వ వార్షికోత్సవం, భాకపా (మావోయిస్టు) 15వ వార్షికోత్సవం మరియు చైనా విప్లవ 70వ వార్షికోత్సవం వేడుకల్ని దండకారణ్యంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దండకారణ్యం స్పెషల్ గెరిల్లా జోన్‌లోని ఉత్తర సబ్ జోన్‌లో ఒక ప్రాంతంలో పది వేల మందికి పైగా ప్రజలతో రెండు రోజుల పాటు కార్యక్రమం జరిగింది.

స్థానిక పార్టీ కమిటీలు, ఆర్‌పిసిలు, ప్రజాసంఘాలు, మిలీషియా, ప్రజలూ కార్యక్రమానికి కొద్ది రోజుల ముందు నుంచి ఏర్పాట్లు చేశారు. ప్రజాసంఘాల కార్యకర్తలు కార్యక్రమం గురించి కరపత్రం, పోస్టర్, బ్యానర్స్, బుక్‌లెట్స్, సాంస్కృతిక కళా ప్రదర్శనల ద్వారా ప్రచారం చేశారు. ఏరియాలో ఆర్‌పీసీలల్లో సభలు నిర్వహించారు. వివిధ ఆర్‌పీసీల నుంచి సుమారు 300 మంది సిఎన్‌ఎమ్ కళాకారులకు డీకెసిఎన్‌ఎమ్ నాలుగు రోజుల పాటు పాటలు, నాటికలు మొదలయిన సాంస్కృతిక అంశాలలో శిక్షణ ఇచ్చింది.

కార్యక్రమం ప్రారంభమయ్యే రోజు విశాలమైన గ్రౌండ్‌లో ఎర్రజెండాలు, బ్యానర్లు, పోస్టర్లు అమర్చారు. వీటితో పాటుగా మార్క్స్–ఏంగెల్స్–లెనిన్–స్టాలిన్–మావోల పెద్ద పెద్ద ఫోటోలు పెట్టారు. సభా ప్రాంగణమంతా వేలాదిగా తరలి వచ్చిన విప్లవ ప్రజలతో రాజకీయ వాతావరణం తొణికిసలాడింది. ఉపన్యాసాలు, కళా ప్రదర్శనల కోసం పెద్ద వేదికను ఏర్పాటు చేశారు. వేదికను మూడువైపులా ఎర్రటి గుడ్డతో అలంకరించారు. అమరవీరుల స్థూపానికి ఎర్రరంగు వేసి, తెల్లటి సిల్వర్ పెయింట్‌తో అమరవీరుల పేర్లు రాశారు. నాలుగు వైపులా ఎర్రటి గుడ్డతో అమరుల స్థూపాన్ని నిర్మించారు.

సభా కార్యక్రమం మొదటి రోజు సాయంత్రం ప్రజలు తమ సాంప్రదాయకమైన వాయిద్యాలు డోలు, కుండోడ్ వగైరాలతో సామూహిక నృత్యాలు చేశారు. ఈ ప్రదర్శనలు తరతరాల

సంస్కృతినే కాకుండా నూతన విప్లవ సంస్కృతిని ప్రతిబింబించాయి. గత 50 సంవత్సరాల పార్టీ విజయాల్ని ప్రజలు ఆట పాటలతో సాంప్రదాయమైన వాయిద్యాలతో కొనియాడారు. తెల్లవార్లు జరిగిన ఈ కార్యక్రమం ఉదయం ఆరు గంటల తర్వాత ముగిసింది.

ఏరియా జనతన సర్కార్ సభా ప్రాంగణంలో 'ప్రజావైద్య శిబిరం' ఏర్పాటు చేసింది. ఈ శిబిరం వేలాదిమంది ప్రజలకు సేవలందించింది. ఏరియా జనతన సర్కార్ల నుండి స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, టీచర్స్ కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. స్కూలు పిల్లలు కూడా తమ ఆట పాటలతో, కళా ప్రదర్శనలతో ప్రజల్ని రంజింపజేశారు. ఏరియా జనతన సర్కార్, పంచాయితి స్థాయి జనతన సర్కార్లు ప్రజలకు తిండి ఏర్పాట్లు చేశాయి. రెండో రోజు మధ్యాహ్నం సుమారు ఒంటి గంటకు ర్యాలీ ప్రారంభమయ్యింది. ప్రజలు, కళాకారులు, విద్యార్థులు, మహిళలు, చిన్నా, పెద్ద వయస్సు వాళ్లు రెండు వరుసలుగా బారులు తీరారు. వందల బ్యానర్లు, జెండాలతో, సిఎన్ఎమ్ కళాకారుల పాటలతో, పెద్ద వాయిద్యాల ధ్వనులతో, నినాదాలతో ప్రజాసంద్రంలా ర్యాలీ సాగింది. అది గంటన్నర కొనసాగి అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుంది. అక్కడ రెండు గంటల పాటు కళా ప్రదర్శన సాగింది.

ఆ తరువాత డివిజనల్ కమిటీ, ఏరియా జనతన సర్కార్ కమిటీ, ఏరియా సైనిక కమాండ్, స్థానిక జనతన సర్కార్ నాయకులు ఉపన్యాసాలు ఇచ్చారు. ఏరియా బాధ్యులయిన డీవీసిఎమ్ పార్టీ సంస్థాపక వార్షికోత్సవాలకు హాజరయిన ప్రజలకు, విప్లవాభినందనాలు తెలియజేసి భాకపా(మావోయిస్టు) పుట్టిన నేపథ్యం గురించి వివరించారు.

నక్సల్బరీ పోరాటం నుంచి నేటి వరకు పార్టీ నాయకత్వంలో జరిగిన పోరాటాలను గురించి చెబుతూ శతృవు తలపెట్టిన అనేక అభియాన్లను ఓడించడం ప్రజా విజయమన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'వ్యూహాత్మక సమాధాన్' సైనిక దాడి తీవ్రత గురించి, హిందూ ఫాసిస్టు భాజపా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించి విజయాలను మరింత ముందుకు తీసుకువెళ్లవలసిన అవసరం ఉందన్నారు. ఈ ఉపన్యాసం ముగిసిన తరువాత సిఎన్ఎమ్ కార్యకర్తలు నక్సల్బరీ పోరాట పాట, బుర్కపాల్ దాడి గురించిన పాటలు పాడారు.

ఏరియా జనతన సర్కార్ కమిటీ అధ్యక్ష కామ్రేడ్ జనతన సర్కార్ నాయకత్వంలో సల్వాజుడుంను ఎదుర్కొన్నామని, అందుకే ఏరియాలో సల్వాజుడుం విస్తరించలేదని అంటూ నాటి నుంచి శత్రు నిర్బంధ క్యాంపెయిన్ల మధ్య ఉద్యమం మునుముందుకే సాగుతున్నదన్నారు. తరువాత సిఎన్ఎమ్ కార్యకర్తలు బోల్షివిక్ పాట పాడి వర్తమాన రాజకీయాలపై నాటిక ప్రదర్శించారు. కాంగ్రెస్‌పార్టీ, భాజపా పార్టీతో సహా దేశంలో వున్న బూర్జువా, రివిజనిస్టు పార్టీలన్ని ఓట్ల పార్టీలేనని, జనతనసర్కార్ల నాయకత్వంలో ప్రజారాజ్యం కోసం ఉద్యమించాలని సందేశం ఇచ్చిన నాటిక ప్రజల్ని బాగా ఆకట్టుకుంది.

పార్టీ వార్షికోత్సవాలులో భాగంగా చైనా విప్లవ 70వ వార్షికోత్సవ సభ జరిగింది. మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రజలు, సైన్యం చేసిన అనన్య త్యాగాల ఫలితమే నూతన చైనా ఏర్పడిందని, అది ప్రజలు అజేయులుగా నిలిచిన రోజు అనీ ఉపన్యాసకులు చైనా విప్లవ చరిత్రను, భారత విప్లవానికి అది అందించిన అనుభవాన్నీ వివరించారు. ప్రస్తుతం చైనా సామ్రాజ్యవాద దేశంగా ప్రపంచ ప్రజల శతృవుగా మారింది. చైనా సోషల్ సామ్రాజ్యవాద విధానాన్ని వ్యతిరేకిస్తూ చైనా ప్రజలు, ప్రపంచంలోని మావోయిస్టు పార్టీలు ముందుకు వస్తున్నాయన్నారు. 'ప్రజలే చరిత్ర నిర్మాతలనే' మావో బోధనలు ముమ్మాటికి నిజమని రోజురోజుకు దేశంలో, ప్రపంచంలో ప్రజ్వరిల్లుతున్న ప్రజాపోరాటాలే చాటి చెబుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో డికెసిఎన్ఎమ్ తాడిబల్ల అమరవీరుల వీడియో పాటలు, దక్షిణ బస్తర్ డివిజన్ సిఎన్ఎమ్ విడుదల చేసిన అమరవీరుల వీడియో పాటలు, 'విప్లవ తరంగం' సినిమాను (సంక్షిప్తంగా కోయలో అనువాదం చేస్తూ ) చూపించింది.

ఉపన్యాసాలు, పాటలు, నాటికలూ ప్రజల్లో అవగాహనను, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. అంతిమంగా వేలాదిమంది ప్రజలు, పిఎల్‌జిఏ సైనికులు కలిసి నినాదాలు ఇవ్వడంతో సభా ప్రాంగణమంతా విప్లవోత్తేజాన్ని పొందింది. ★



# "పీడిత రైతాంగ విప్లవ ధృవతార" - చారుబాబు

నక్సల్‌బరీ నిర్మాత, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) నిర్మాత, నాయకుడు అయిన చారుమజుందార్ జూలై 16వ తేదీ తెల్లవారుజామున అరెస్టు కాబడి ఒక పన్నెండు రోజులైనా గడవక ముందే, జూలై 28వ తేదీ ఉదయం 4.50 గం॥లకు కలకత్తాలోని ఒక హాస్పటల్లో మరణించారని పోలీసు అధికారులు ప్రకటించారు. చారుమజుందార్ ఈ ఆకస్మిక మరణవార్త దేశ ప్రజలను ఆసాంతం దిగ్భ్రాంతికి గురిచేసింది. 26వ తేదీన మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినప్పుడు మామూలుగా క్షేమంగా ఉన్న చారుమజుందార్ ఆరోగ్యం 27వ తేదీ రాత్రి 7.30 గం॥లకు పరిస్థితి విషమించిందని పోలీసు అధికారులు గుర్తించిన తర్వాతనే హాస్పటల్లో చేర్చటం జరిగింది. అప్పటికే అతని పరిస్థితి చేయిదాటిపోయిందనీ, "మగత"లో అపస్మారకంలో ఉన్నాడనీ, తాము చేయాల్సిన సర్వప్రయత్నాలు చేశామనీ ఆఖరి దశలో అతనిని పరీక్షించిన వైద్యనిపుణులు ప్రకటించారు. 12 రోజులుగా పోలీసు కస్టడీలో, ఎవరినీ కలుసుకోనియ్యకుండా ఉంచబడిన చారుమజుందార్ హఠాత్తుగా "గుండెపోటు"తో మృతిచెందాడని ప్రకటించిన వార్తలో ఫౌల్ ప్లే (హత్య అనే అనుమానం) జరిగిందనటానికి ఆస్కారముందని, సరియైన న్యాయవిచారణ, అత్యున్నత న్యాయమూర్తి చేత జరిపించాలని దేశంలోని వివిధవర్గాలకు చెందిన పలువురు ప్రముఖులు తమ ఆందోళన వెలిబుచ్చుతూ విజ్ఞప్తి చేశారు. అయితే ఇలాంటి అభిప్రాయాన్ని వెల్లడించినవారందరూ, చారుమజుందార్ ప్రబోధించిన సిద్ధాంతాలలోకాని, ఆయన అనుసరించిన పంథాయెడలగానీ ఎలాంటి సానుభూతి, సదాభిప్రాయం లేకపోగా, పూర్తిగా వైషమ్య పూరితమైన, ప్రతికూలతగల్గిన విరోధులే కావటం గమనించదగింది. అంతెందుకూ భారత దళారీ పెట్టుబడిదారుల యొక్క ఆంగ్ల దినపత్రిక "టైమ్స్ ఆఫ్ ఇండియా" ఆగస్టు 3వ తేదీ సంచికలో ఏం రాసిందో గమనిస్తే చారుమజుందార్ మృతిలోని నిగూఢత బట్టబయలవుతుంది.




చారుమజుందార్ మరణవార్తను ఇవ్వటంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఎందుకు భయపడిపోవాల్సి వచ్చింది. నక్సలైట్ నాయకుడు కలకత్తాలోని ఒక ఆస్పత్రిలో 28వ తేదీ ఉదయం 4.50 గం॥లకు చనిపోయాడు. ఎనిమిది గంటలకల్లా దాదాపుగా విలేఖరులందరికి ఈ వార్త తెలిసింది. అంతెందుకు కలకత్తాలోని కొన్ని వీధుల గోడలపైన బెంగాలీ భాషలో అప్పుడే 9 గం॥లకు ముందే కొన్ని పోస్టర్లు వెలిశాయి. "చారుబాబు హత్యచేయబడ్డాడు" అని (స్టేట్స్ మన్ పత్రికలోని వార్త). పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పోస్టర్లను వెంటనే తొలగించ మని దొడ్డ సలహా ఇచ్చింది. ఏదేమైనా దీని తర్వాత కూడా కొన్ని గంటల పర్యంతం వరకూ మృతి వివరాలను విలేఖరులకు అందజేయకుండా ఎందుకు తొక్కిపట్టాల్సి వచ్చింది?

"మజుందార్ ఏ పరిస్థితులలో చనిపోయాడో ఆ కథకు సంబంధించిన నివేదికలను 8 గం॥ల తర్వాత కూడా వివరించ లేదు. కాకపోగా, "ఔను చారుమజుందార్ చనిపోయారు. కాని ఆ వివరాలను మీరు ముఖ్యమంత్రిగారినే అడగాల్సి ఉంది." అని ఆస్పత్రికి వచ్చినవారితో పోలీసు అధికారులు మృదువుగా చెప్పారు. ఫోటోలను తీసుకోవడానికి అభ్యంతరం తెలిపారు. వాస్తవం చెప్పాలంటే, నక్సలైట్ నాయకుని శవాన్ని దహనస్థలానికి తీసుకవెళ్లేటప్పుడు ఆస్పత్రిలోని దీపాలన్నిటినీ ఆర్పివేశారు. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చింది? నిజంగా ఇవన్నీ అవసరమేనా?

అన్నిటికంటే ఘోరమైన సంగతేమిటంటే చారుబాబు మరణవార్తను శనివారం ఉదయం ఆరు గంటలవరకు (అంటే చనిపోయిన తర్వాత 25 గం॥ల వరకు) రేడియో ప్రసారం చేయవద్దని అధికారులకు సలహా ఇవ్వబడింది. మిగతా రేడియో ఏజెన్సీలు ఈ వార్తను అప్పుడే సంగ్రహించినవనియు. బీబీసీ (ఇంగ్లాండ్ రేడియో) కానీ, లేక బంగ్లాదేశ్ రేడియోకానీ తప్పక ప్రసారం చేస్తాయని రేడియో అధికారులు మొరపెట్టుకొన్న విజ్ఞప్తులను పెడచెవిన పెట్టటం జరిగింది. కేవలం న్యూఢిల్లీ యొక్క జోక్యం వలన మాత్రమే, ఆలిండియా రేడియోవారు ఆఖరికి ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంట బులిటెన్‌లో ఆ వార్తను ప్రసారం చేయగల్గారు"

సంశయాస్పద పరిస్థితులలో జరిగిన మృతి, అరెస్టయిన దగ్గర నుంచీ మరణ ప్రకటన వరకు అలుముకొన్న నిగూఢ వాతావరణ పరిణామాలు చారుమజుందార్ మృతి సహజమైన కారణాలవలన

జరుగలేదని, దీని వెనుక పెద్ద స్థాయిలో, ఆలోచించి పన్నిన పన్నాగం ఉండవచ్చునని, ఇది హత్య అని అనుమానించటానికి ఆస్కారముందని సర్వత్రా భావిస్తున్నారు. అందుకే ఎ.కె. గోపాలన్, జార్జి ఫర్నాండెజ్ లాంటివారు కూడా విచారణ జరపాలంటున్నారు.

జనసంఘంలాంటి మితవాద, మతవాద అభివృద్ధి నిరోధక పక్షాల నాయకుల నుండీ, సోకాల్డ్ ప్రగతిశీల, వామపక్షాల నాయకులు పలువురు చారు సహజ పరిస్థితులలో మృతిచెందలేదని, దీని వెనుక ఏదో ఒక పన్నాగం ఉండవచ్చునని వాసనపట్టి, హైకోర్టు లేక సుప్రీంకోర్టు జడ్జి ఆధ్వర్యంలో వెంటనే దర్యాప్తు జరిపించాలనీ కోరారు. ముఖ్యంగా భావనగర్ (బీహార్) లోని మితవాద కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు పార్టీ, రిపబ్లికన్, సోషలిస్టు పార్టీలు సమావేశమై బహిరంగ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చారుబాబు అనారోగ్యంవల్ల మరణించలేదనీ, ఆయన హత్య చేయబడ్డాడనీ సోషలిస్టు పార్టీ మాజీ అధ్యక్షుడు పాట్నాలో మాట్లాడుతూ ఉద్ఘాటించారు. తమకూ, చారుమజుందార్‌కు సిద్ధాంత పరమైన విభేదాలున్నప్పటికీ ఆయన మృతితో దేశం స్వార్థం ఏరుగని సమర్థుడైన ఒక గొప్ప విప్లవకారుణి కోల్పోయిందని జోహార్లర్పించారు.

ఇటీవలి సంవత్సరాలలో పోలీసు కష్టడీలలో తరచుగా సంభవిస్తున్న మరణాల పరంపరలలో ఇది మరొకటి. ఈ "చావులన్నీ ప్రేరేపించబడి కల్పించబడ్డాయా" అనే అనుమానం చారుమజుందార్ మరణం రేకెత్తించింది. సహజమైన కారణాల వలననే ఆయనకు చావు దాపురించిందనడంలో చాలా అనుమానంవుందని ప్రముఖ సోషలిస్టు పార్టీ నాయకుడు జార్జిఫెర్నాండేజ్ ఉద్ఘాటించారు. వీరే కాక వాజ్‌పాయి, నంబూద్రిపాద్, ఎ.కె. గోపాలన్, ఎన్.జి.గోరేలు చారుమజుందార్ మృతికి సంతాపం వెలిబుచ్చుతూ బహిరంగ న్యాయవిచారణ జరిపించాలని అన్నారు. నక్సల్బరి నాయకుడు కానూ సన్యాల్ విశాఖలో మాట్లాడుతూ, చారుబాబు అరెస్టు దగ్గర నుంచి మృతివరకూ "అతి నిగూఢంగానే ఉందని అన్నారు.

నక్సలైట్లను పట్టుకొని, కాల్చివేసి, పోలీసులతో జరిగిన "ఘర్షణ"లలో చనిపోయాడని ప్రకటించే ఆనవాయితీకి భిన్నంగా సంక్లిష్ట పరిస్థితులలో పట్టుకున్న చారుబాబును మెజిస్ట్రేట్ ముందు వెంటనే హాజరుపరచటం, గుండెకు సంబంధించిన ఉబ్బసపువ్యాధితో దీర్ఘకాలంగా బాధపడుతున్న మజుందార్‌కు అన్ని రకాల వైద్య సౌకర్యాలు సమకూర్చగలమనియు యధావిధిగా ప్రశ్నలపరంపరలతో వేధించమనియు, బెదిరింపులు,చిత్రహింసలు లాంటి ప్రక్రియలను ప్రయోగింపమని ముందుముందే ఎవ్వరూ అడుగకుండానే హామీలు, సౌకర్యాలు సమకూర్చడం చాలా వింతగొల్పే విషయం. తమకు తామే కల్పించుకొని ఇన్ని మర్యాదలు ఎందుకు చేయాల్సివచ్చింది? మజుందార్ ఎడల ఈ అతిమర్యాదలతో పాటు, పట్టుకున్న దగ్గర్నుంచీ ఎవరినీ కలుసుకోనీయకపోవడం, మాట్లాడనీయకపోవటం, ఏకాంతంగా నిర్బంధించి ఉంచటం, జబ్బు మనిషి అని తెలిసి తగిన చికిత్సకోసం వెంటనే అన్ని సౌకర్యాలుగల హాస్పటల్లో ఉంచే బదులు అన్నిరోజులూ పోలీసు కష్టడీలోనే నిర్బంధించటం, సరియైన మందులు సకాలంలో ఇవ్వనందున రోగతీవ్రత పెరిగి విషమించి చేయిదాటి పోయేంత వరకు మెదలకుండా వూరుకొని, ఆఖరిదశలో స్మారకం తప్పినాకనే 7.30 గంllలకు గత్యంతరంలేక హాస్పటల్లో చేర్చటం,అక్కడ వైద్యనిపుణులు పెదవి విరవటం తెల్లవారేకల్లా చనిపోవటం, తర్వాతి ఘటనలన్నిటిని పూసగుచ్చి చూస్తే ప్రజానీకంలో సర్వత్రా వ్యాపించిన భయాందోళనలు చారు మరణం వెనుక దుర్మార్గపు పన్నాగం ఉందనే అనుమానాలు దృఢపడ్డాయి. సకాలంలో తగిన చికిత్స సమకూర్చకుండా నిరాకరించడమో లేక జాప్యం చేయడమో చాలదా. గుండెజబ్బుతో బాధపడుతున్న ప్రాణం గుటుక్కుమనడానికి? అది ఉద్దేశపూర్వకమైన హత్య అనబడదా?

**విప్లవకారుల శ్రద్ధాంజలి**

తమ ప్రియతమ నాయకుడు. అత్యంత సన్నిహిత సహచర కామ్రేడ్ విప్లవమార్గ దర్శకుడు, మావో ఆలోచనా విధానాన్ని మన దేశానికి అన్వయించిన గొప్ప తాత్వికుడు, "వర్గశత్రు నిర్మూలన" సిద్ధాంత సృష్టికర్త, గొప్ప ఆచరణవాది, ఒక నక్సల్‌బరీ నిప్పురవ్వను దేశవ్యాప్త దావానలంగా మార్చిన మూల పురుషుడైన చారమజుందార్ హఠాత్ మరణవార్తను విన్నప్పుడు విశాఖపట్నం సెంట్రల్‌జైల్లో ఉన్న మార్క్సిస్టు-లెనినిస్టులు అందరూ దిగ్భ్రాంతి చెందారు. ఆ సాయంత్రం మార్క్సిస్టు-లెనినిస్టులు చారుబాబు స్మారకసభను జైల్లో జరుపుకొన్నారు. ఆ సభలో కానుసన్యాల్ మార్క్సిస్టు-లెనినిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. చారుమజుందార్ మరణం వలన దేశంలో సాయుధ రైతాంగ పోరాటం ఆగిపోదనియు, తమ రాజకీయ సిద్ధాంత వైఖరులను మార్చుకోవాల్సిన అవసరం లేదని ఉద్ఘాటిస్తూ, చారు ప్రబోధించిన సైద్ధాంతిక వెలుగుబాటలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామనివారు దృఢ దీక్షవహించారు.

ఆ తర్వాత, పార్వతీపురం 'కుట్రకేసు' విచారణ సందర్భంగా ఆగస్టు 1న కోర్టుకు తీసుకొని రాగా, కోర్టులో కాను సన్యాల్ మాట్లాడుతూ చారుబాబు మృతితో విప్లవ పోరాటం సమసిపోయినట్లేనని పాలకవర్గాలు చంకలు బాదుకొంటున్నాయి. కాని పోరాటమెన్నటికీ విరమించేదిలేదని అన్నారు.

"చారు నిర్దేశించిన వర్గశత్రు నిర్మూలన కార్యక్రమం ఇక ముందుకూడా కొనసాగగలదని'' కేయన్. మహదేవన్ ప్రకటించారు. "ఒక్క చారు చనిపోతే వేలాది చారుబాబులు ప్రభవిస్తారు.''

(1972 జూలై 28న కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం గురించిన వివరం రాసిన 16-8-1972 నాటి **పిలుపు** పక్ష పత్రికలో ప్రచురించిన వ్యాసాన్ని క్రాంతి పాఠకుల కోసం అందిస్తున్నాం - సంపాదకవర్గం.) ★

(....48వ పేజీ తరువాయి)

ఎమ్ఎల్ఏ భీమా మండావితో పాటు ఐదుగురు పోలీసుల నిర్మూలన, ఉత్తర గఢ్‌చిరోలీలో జాంబుర్‌ఖేడా వద్ద 15 మంది సీ-60 కమాండోలను నిర్మూలించిన సాహసిక ఆంబుష్, ఉత్తర బస్తర్‌లోని మహలా వద్ద నలుగురు బీఎస్ఎఫ్ జవాన్ల నిర్మూలన, 15 మంది పోలీసులను గాయపరచడం, పశ్చిమ బస్తర్‌లోని మురుదొండ వద్ద ఎమ్‌పీవీ వాహనాన్ని పేల్చివేసిన ఘటన, కేశ్‌కుతుల్ ఆంబుష్ వంటివి పెద్ద చర్యలు కాగా, మిగతావి చిన్న, మధ్య రకం చర్యలు.

ఈ సంవత్సరం బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియాలో మన పీఎల్‌జీఏ గెరిల్లా బలగాలు మే-జూన్ నెలల్లో సాగించిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ (టీసీఓసీ) విజయవంతం అయ్యింది. ఇందులో దుమ్కా జిల్లా, సరండ ప్రాంతంలోని సరైకేలా-ఖరసవా జిల్లాలలో దుమ్కా, తిర్‌డీహ్ వంటి ఆంబుష్‌ల్లో సుమారు 10 మంది పోలీసులు నిర్మూలించబడి 32 మంది పోలీసులు గాయపడ్డారు. చాలా రోజుల తరువాత దుమ్కా, సరండా మొదలైన ప్రాంతాలలో తిరిగి టీసీఓసీ కొనసాగి విజయవంతం కావడం విప్లవ శ్రేణుల్లో, ప్రజల్లో ఉత్తేజాన్ని కలిగించింది.

ఏఓబీలో గెరిల్లా బలగాలు కొన్ని చిన్న చర్యలు, సాబోటేజీ చర్యలు నిర్వహించడంతో పాటు కొంతమంది ఇన్‌ఫార్మర్లను నిర్మూలించాయి.

ఒడిశాలో పరిమిత సంఖ్య, అనేక పరిమితులు ఉన్నప్పటికీ శత్రు సాయుధ బలగాలపై కొన్ని ఆంబుష్‌లు/యుద్ధ చర్యలు నిర్వహించడం మంచి పరిణామం.

తెలంగాణ, డీకే గెరిల్లా బలగాలు కలిసి సరిహద్దు ప్రాంతంలో జాయింట్ ఆపరేషన్‌లో పాల్గొని శత్రుదాడిని నిలువరించేందుకు కృషి చేసాయి. డీకేలో విజయవంతమైన కొన్ని సాయుధ చర్యల్లో తెలంగాణ బలగాలు భాగమైనాయి.

ఈ కాలంలో ఉద్యమ ప్రాంతాల్లో ప్రజా శత్రువులైన ఇన్‌ఫార్మర్లపై, దోపిడి రాజకీయ నాయకులపై, విప్లవ ప్రతీఘాతకులపై, విప్లవ ద్రోహులపై మన పీఎల్‌జీఏ ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలు, ప్రజలు కలిసి దాదాపు 94 చర్యలు నిర్వహించి 75 మందిని నిర్మూలించాయి.

దండకారణ్యంలోని కిరందూల్-బైలదిల్లా పర్వత శ్రేణుల్లోని 11బీ డిపాజిట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత బడా కార్పొరేట్ కంపెనీ-అదానీకి లీజ్‌కు ఇవ్వడాన్ని నిరసిస్తూ నంద్‌రాజ్ పర్వతాన్ని కాపాడుకోవాలని నినదిస్తూ ప్రజలు పోరాడుతున్నారు. ఉద్యమ ప్రాంతాలంతటా దెబ్బతిన్న ప్రజా నిర్మాణాల పునర్నిర్మాణం-కన్సాలిడేషన్ కొనసాగుతోంది. దండకారణ్యంలో పితృస్వామ్య వ్యతిరేక క్యాంపెయిన్, బీజే, తూ.బి.-ఈ.ఝా.ల్లో, ఒడిశా, ఎమ్ఎమ్‌సీల్లో బోల్షివీకరణ క్యాంపెయిన్, తెలంగాణలో ప్రజాసంఘాల దిద్దుబాటు క్యాంపెయిన్ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా పార్టీ కన్సాలిడేషన్ క్యాంపెయిన్ మొదలయింది. సెంట్రల్ రీజియన్‌లో పీఎల్‌జీఏ బలగాల్లో కంబాట్ స్కిల్స్-టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించడానికి పలు విషయాలపై ట్రైనింగ్ కొనసాగుతోంది. స్థానిక స్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు వ్యతిరేక ఐక్య ఉద్యమాల నిర్మాణం ప్రారంభమైంది.

**విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడిని ఓడించేందుకు సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేద్దాం. ఈ వర్గ పోరాటాల ద్వారా ప్రజా పునాదిని పెంచుకుంటూ, పార్టీనీ, పీఎల్‌జీఏనూ పటిష్టపరుచుకుంటూ గెరిల్లాయుద్ధాన్ని విస్తృతం-తీవ్రతరం చేద్దాం.**

2017 మేలో మొదలయిన 'సమాధాన్' దాడి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి మరింత తీవ్రంగా అమలవుతోంది. విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్నా, కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ప్రాంతీయ పార్టీలైన టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, బీజూ జనతాదళ్, టీఎమ్‌సీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 'సమాధాన్' దాడి తీవ్రంగానే కొనసాగుతోంది.

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఆగస్టు 26నాడు ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన మావోయిస్టు ఉద్యమ ప్రభావిత 10 రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూపీఏ కాలంలో (2009-13) మావోయిస్టు ఉద్యమ తీవ్రతను, ఎన్‌డీఏ-1 కాలంలో (2014-18) మావోయిస్టు ఉద్యమ తీవ్రతను పోల్చి విశ్లేషించి ప్రస్తుత స్థితిని సమీక్షించారు. ఈ సమీక్ష ఆధారంగా 2018 చివరి నాటికి 'వామపక్ష తీవ్రవాదం' దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లోని 60 జిల్లాలకు మాత్రమే పరిమితమయ్యిందనీ, అందులోనూ మూడింట రెండొంతుల ఘటనలు 10 జిల్లాల్లో మాత్రమే జరిగాయని అంచనా వేశారు. అలాగే ఈ సంవత్సరం మొదటి ఐదు నెలల్లో 310 మావోయిస్టు సంబంధిత ఘటనలు జరిగాయని అంచనా వేశారు.

ఈ సమీక్షపై, అంచనాపై ఆధారపడి రానున్న మూడేళ్ళ కాలంలో 'నక్సల్స్ లేని నవ భారతాన్ని' నిర్మించే 'కార్యాచరణ పథకాన్ని' కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించాడు. 2017 మేలో రూపొందించిన 'సమాధాన్' వ్యూహాత్మక దాడిలో భాగంగానే ఆగస్టు 26నాటి పై ఢిల్లీ సమావేశం కార్యాచరణ పథకాన్ని (యాక్షన్ ప్లాన్‌ను) రూపొందించింది. ఇందులో భాగంగానే మావోయిస్టులకు నిధులు అందకుండా చేయడం; పట్టణ నెట్‌వర్క్ పేరుతో ప్రజాసంఘాల నాయకత్వంపై దేశద్రోహ నేరం కింద క్రిమినల్ కేసులు మోపి

జైళ్లలో పెట్టడం; విప్లవోద్యమ ప్రభావిత ప్రాంతాల్లో మరింత ఎక్కువగా రోడ్లు, సెల్ టవర్లు నిర్మించడం; రోడ్ల నిర్మాణంలో స్థానిక యువతకే ప్రాధాన్యతనీయడం; సెల్ టవర్ల నిర్మాణంలో ప్రైవేట్ కంపెనీలకు ప్రాధాన్యతనీయడం; ప్రభుత్వాల నగదు బదిలి పథకాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు, ఆదివాసీలు సులభంగా ఉపయోగించుకునేందుకు వీలుగా మరిన్ని బ్యాంకులు, ఏటీఎంలు, పోస్టాఫీసులు ఏర్పాటు చేయడం; 'ఏకలవ్య' నమూనాలో పాఠశాలలు ఏర్పాటు చేయడం; ఉద్యమ ప్రభావిత రాష్ట్రాల్లో పారా మిలిటరి బలగాలను పెంచడం; దండకారణ్యంలోని మాడ్ ప్రాంతాన్ని దిగ్బంధించడానికి ఏడు బెటాలియన్లను కేటాయించడం వగైరాలతో కూడిన బహిరంగ (ఓవర్ట్) 'కార్యాచరణ పథకాన్ని' ఢిల్లీ సమావేశం రూపొందించింది. దీనిలో భాగంగానే అత్యంత రహస్యమైన (కోవర్ట్) ఫాసిస్టు అణచివేత చర్యలకు సంబంధించిన కార్యక్రమాలను కూడా రూపొందించింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా రూపొందించిన ఈ పథకంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని పథకాలు రూపొందించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మాడ్‌లో ప్రజలకు నివాస భూములకు పట్టా కల్పించే మోసపూరిత పథకాల్ని ప్రకటించింది. ఒకేసారి 18వేల పోలీసులను భర్తీ చేసుకుని విప్లవోద్యమాన్ని తిరిగి తలెత్తకుండా చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం పోలీసు భర్తీని ప్రకటించింది. అది మావోయిస్టుల అణచివేతకు ఆరు బెటాలియన్ల పారామిలటరీ బలగాలను డిమాండ్ చేస్తున్నది. సెప్టెంబర్‌లో విశాఖ జిల్లా, సీలేరు ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరిట పొట్టన పెట్టుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మావోయిస్టు అణచివేతలో తాము కేంద్రం లాగే కఠినంగా వ్యవహరిస్తామని ఆచరణపూర్వకంగా తెలియజేసింది. బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలలో సైతం తుపాకి రాజ్యమే అమలులో ఉంది. అలాగే మిగతా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విప్లవోద్యమ అణచివేతకు కేంద్రం రూపొందించిన 'సమాధాన్' దాడి పథకాన్ని అమలు చేయడం కోసం మరిన్ని స్థానిక పథకాల్ని రూపొందించాయి.

మన పార్టీ 50వ వార్షికోత్సవాల సందర్భంగా మన కేంద్రకమిటీ యావత్తు పార్టీ ముందుంచిన పార్టీ సంఘటితీకరణకు (కన్సాలిడేషన్‌కు) మొదటి ప్రాధాన్యతనీయాలి.

దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాలంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక, బడా బూర్జువా వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాల్ని, సామాజిక ఉద్యమాలను తీవ్రతరం చేయాలి. ఉద్యమ ప్రాంతాల్లోని పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో ప్రజల దైనందిన, మౌలిక సమస్యలపై పోరాటాలు చేపట్టాలి. ప్రజా పోరాటాలే/వర్గ పోరాటాలే నూతన శక్తుల సమీరణకు వనరు అనే అవగాహనతో ప్రజలు పోరాటాల్లో కదిలే చోటికి వృత్తి విప్లవకారులను, ఆర్గనైజర్లను పంపి నూతన పోరాట రంగాలను సృష్టించాలి. వృత్తి విప్లవకారులు, ఆర్గనైజర్లు 'విత్తనాల్లాగా' పని చేస్తూ ప్రజా పోరాటాల్లోని పురోగామి శక్తుల్లో నుండి వృత్తి విప్లవకారులను తయారు చేయాలి. పట్టణ, మైదాన ప్రాంతాల్లో కేవలం సాధారణ ప్రచార, ఆందోళనలకు పరిమితం కాకుండా మిలిటెంట్ పోరాటాలు నడుపుతూ నూతన శక్తులతో అత్యంత రహస్య పద్ధతుల్లో పార్టీని నిర్మించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. నూతన శక్తులతో నిర్మాణమయిన పార్టీ శక్తుల నుండే నూతన పార్టీ కమిటీలను నిర్మించాలి.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రావడంతో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టుమూకల దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. గోరక్షకుల పేరుతో దాడులు చేయడమే కాకుండా, జై శ్రీరాం నినాదంతో దేశవ్యాప్తంగా దళితులపై, ఆదివాసులపై, మతమైనారిటీలపై చేస్తున్న దాడులు, మహిళలపై అత్యాచారాలు పెచ్చరిల్లుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ దాడులు మరింత తీవ్రతరమవుతాయి. ఈ స్థితిలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా ఒకవైపు భావజాల, రాజకీయ రంగాల్లో దీర్ఘకాలిక పథకంతో, తగిన నిర్మాణాలను ఏర్పరచుకుని పోరాడుతూనే మరోవైపు హిందూ ఫాసిస్టుల్ని తన్ని తరమండి, దేశాన్ని కాపాడండి (హిందూ ఫాసివాదియోంకో మార్ భగావో, దేశ్‌కో బచావో) అనే నినాదంతో మిలిటెంట్ ప్రతిఘటనా దాడులు చేసి బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు మూకల్ని తన్ని తరమాలి. ఈ మిలిటెంట్ ప్రతిఘటనా దాడులు పీడిత ప్రజల రక్షణకు మార్గంగానే కాకుండా దేశవ్యాప్త పార్టీ విస్తరణకు వనరుగా కూడా మారుతాయి.

బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు వ్యతిరేక పోరాటాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటంలో విడదీయరానిభాగంగా నేటి ప్రధాన రాజకీయ కర్తవ్యంగా గుర్తించి మిలిటెంట్‌గా నడపాలి. ఉద్యమ ప్రాంతాల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు సంస్థల (ఆరెస్సెస్, బీజేపీ, ఏబీవీపీ, బీజెవైఎమ్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్, వగైరా) విస్తరణను అడ్డుకోవాలి. ఈ విస్తరణను అడ్డుకోవడానికి భావజాల, రాజకీయ రంగాల్లో దీర్ఘకాలిక పథకంతో కృషి చేయడానికి అవసరమైన పోరాట, నిర్మాణ రూపాల్ని ఎంచుకోవాలి. సంఘ్ పరివార్ భావజాలం పీడిత వర్గాలకూ, మహిళ, దళిత, ఆదివాసి, మత మైనారిటీలకు, ప్రజాస్వామ్యానికి ఎంతటి బద్ధ శతృవో నిరంతరం వైవిధ్యభరితమైన రూపాల్లో విప్పిచెప్పేలా చట్టబద్ధ, బహిరంగ పోరాట, నిర్మాణ రూపాలను ఉపయోగించుకుంటూనే మరోవైపు మిలిటెంట్ ప్రజా ప్రతిఘటనా పోరాటాలు చేపట్టి దాని విస్తరణను అడ్డుకోవాలి. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా స్థానిక స్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు విశాల ప్రాతిపదికన మిత్ర శక్తులతో ఐక్యం కావాలి. ఈ విషయంలో ఒంటెత్తుపోకడను జాప్యం లేకుండా అరికట్టాలి.

ఆయా ప్రాంతాల పీడిత ప్రజల పోరాట సంసిద్ధత ఆధారంగా ప్రజలను చట్టబద్ధ, చట్ట వ్యతిరేక; బహిరంగ-రహస్య పోరాట, నిర్మాణ రూపాల్లో కదిలించి సంఘటితం చేయాలి.

గత రెండు సంవత్సరాలుగా జూన్ మధ్య భాగం నుండి ఆగస్టు మధ్య భాగం వరకు శత్రువు చేసిన దాడుల్లో మన బలగాలు ఎక్కువగా నష్టపోయాయి. ఈ కాలంలో మన బలగాల పని పద్ధతుల్లోని లోపాలను సరిదిద్దేలా నాయకత్వ శక్తులు సన్నిహితంగా ఉంటూ తగిన గైడెన్స్‌ను అందించాలి.

సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాల్లో విశాల ప్రజానీకాన్ని సమీకరించి, అందులో కదిలే క్రియాశీల, సమరశీల శక్తులను మన ప్రజా సంఘాల్లో, ఇతర నిర్మాణాల్లో సంఘటితం చేసుకుని, మన ప్రజా పునాదిని బలోపేతం చేసుకోవాలి. ఈ ప్రజా పునాది ఆధారంగా పార్టీని, పీఎల్‌జీఏను పటిష్టవంతం చేసుకోవాలి.

పీఎల్‌జీఏను రాజకీయంగా-మిలిటరిపరంగా-నిర్మాణపరంగా సంఘటితం (కన్సాలిడేషన్) చేసుకోవాలి. పీఎల్‌జీఏను సంఘటితం చేసుకోవడానికి గత కొంత కాలంగా మనం చేస్తున్న కృషి వల్ల పాజిటివ్ ఫలితాలు సాధిస్తున్నాం.

**సెంట్రల్ మిలిటరి కమిషన్ పిలుపు :**

అంతర్జాతీయంగా, దేశీయంగా మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్న ఫలితంగా విప్లవానుకూల పరిస్థితులు పెంపొందుతున్నాయి.

పెట్టుబడిదారీ/సామ్రాజ్యవాద వ్యవస్థలో మున్నెన్నటికంటే తీవ్రస్థాయిలో గత సంవత్సరం అమెరికా-చైనా సామ్రాజ్యవాద దేశాల మధ్య బద్దలైన వాణిజ్యయుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ సంవత్సరం జూన్‌లో జపాన్‌లో జరిగిన జి-20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కలిసి ఇరువైపులా పెంచిన వాణిజ్య సుంకాలను ఉపసంహరించుకోవడానికి చర్చలు జరపాలని, తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించుకున్నప్పటికీ ఈ వాణిజ్యయుద్ధం తీవ్రంగా కొనసాగుతున్నది. అది చైనాకు వ్యతిరేకంగా తైవాన్, హాంగ్‌కాంగ్‌ల్లో జరుగుతున్న అల్లర్లను ఎగదోయడానికి ప్రయత్నిస్తున్నది. దీంతోపాటు గతంలో 80వ దశకంలో అమెరికా, రష్యాల మధ్య కుదిరిన న్యూస్టార్ట్ (నూతన వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం-న్యూ స్ట్రాటజికల్ ఆర్మ్స్ రిడక్షన్ ట్రీటి) ఒప్పందపు గడువు 2021కి ముగిసిపోనుంది. ఆ గడువును పొడిగించడానికి అమెరికా సిద్ధపడడం లేదు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల దూకుడును ధీటుగా ఎదుర్కొంటామని చైనా తన రక్షణ శ్వేతపత్రంలో హెచ్చరించింది. మరోవైపు ఇప్పటివరకు "ఉగ్రవాదంపై పోరుకు" ప్రాధాన్యతనిచ్చిన అమెరికా తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాల కోసం ఇక చైనా, రష్యాలతో పోటీకీ, అవసరమైతే సంఘర్షణలకు దిగాలని నిశ్చయించుకుంది.

యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల్లో పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్య వైరుధ్యాలు తీవ్రతరమవుతున్న ఫలితంగా అక్కడ ప్రజా పోరాటాలు చెలరేగుతున్నాయి. ఈయూలోని దాదాపు అన్ని దేశాల్లో సామాజిక సంక్షేమ పథకాలను, భద్రతను నీరుకారుస్తూ కార్మిక హక్కులను హరించే చట్టాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం, మధ్యతరగతి వర్గం పోరాటాలు చేస్తున్నాయి. ఈ మధ్య కాలంలో జర్మనీ, పోర్చుగల్, బెల్జియంలలో కనీస వేతనాల కోసం సమ్మెలు జరిగాయి. ఫ్రాన్స్‌లో 'యెల్లో వెస్ట్' ఆందోళనకారుల ఉద్యమం కొనసాగడంతో పాటు, పెట్రోల్ ధరల తగ్గింపు కోసం సమ్మెలు జరిగాయి. పోలెండ్‌లో ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేశారు. హంగేరిలో ఓవర్ టైం పనికి చెల్లింపుల కోసం సమ్మె జరిగింది.

పశ్చిమాసియాలో సౌదీ అరేబియాపై ఆధారపడి మరోమారు యుద్ధాన్ని రగిలించడం కోసం అమెరికా బరితెగిస్తున్నది. జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించడం ద్వారా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి మరింత తీవ్రతరమైంది. సిరియాలో అంతర్యుద్ధాన్ని ఆరనివ్వకుండా రగిలిస్తూనే ఉంది. లెబనాన్, ఇరాన్‌లలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టేందుకు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వెనిజూలాలో పాలకవర్గాల మధ్య ఘర్షణను సాకుగా చేసుకొని అమెరికా అనుసరిస్తున్న జోక్యందారీ విధానం, రష్యా, చైనా సైనిక బలగాలు ఆ దేశంలో తిష్ట వేయడం ద్వారా అంతర్యుద్ధ ప్రమాదం తీవ్రతరమైంది. తాజాగా ఈ సంవత్సరం (2019) మే నెలలో యూరోపియన్ యూనియన్‌లోని పలు ప్రముఖ దేశాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందాన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించాడు. ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తూ ప్రకటించిన వెంటనే ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించింది. దానిని దిగ్బంధించడానికి అమెరికా యుద్ధనౌకను హార్ముజ్ జలసంధికి పంపించాడు. ఇరాన్‌తో అణు ఒప్పందం నుండి వైదొలగి దాని చమురు ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షల వల్లా ప్రపంచ చమురు మార్కెట్ అల్లాకల్లోలమవుతోంది. చైనాతో అమెరికా వాణిజ్యయుద్ధంతో ప్రపంచ మార్కెట్ కుదిపివేయబడుతున్నది.

పీడిత జాతి విముక్తి పోరాటాలలో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల పోరాటం, యెమెన్‌లో హూతీ తిరుగుబాటు, కుర్దు జాతి విముక్తి పోరాటం మొదలైనవి మరింత మిలిటెంట్‌గా మారుతున్నాయి. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లోని పీడిత సాంఘిక సముదాయాలయిన అల్ప సంఖ్యాక జాతులు, మతమైనారిటీలు, ఉపాధి కోసం వలస వెళ్ళిన, యుద్ధగ్రస్త దేశాల నుండి వలస వెళ్లిన కార్మికులు-ఉద్యోగులు, మహిళలు, ఆదివాసులు/మూలవాసులు వగైరాలపై వర్గ దోపిడీతో పాటు సాంఘిక అణచివేత, హింస తీవ్రతరమవుతున్న ఫలితంగా ఆ సెక్షన్లు కూడా పోరాడక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి.

దేశీయంగా చూస్తే, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మే నెలలో రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే 2022 నాటికి బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు రాజ్యాన్ని నెలకొల్పే ఎజెండాను

వేగంగా అమల్లోకి తేవడానికి దూకుడుగా ప్రయత్నాలు చేస్తోంది. తమ ప్రభుత్వ దుర్మార్గాల గురించి, అవినీతి గురించి ప్రజలకు తెలియకుండా ఉండేలా సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చేలా సవరించింది. జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల సంఘాలను బలహీనపరచేలా మానవ హక్కుల చట్టాన్ని సవరించింది. ప్రజల మీద, భిన్నాభిప్రాయాలు ఉన్న వారి మీద విరుచుకపడడానికి, తన ప్రత్యర్థులను, మావోయిస్టుల పేరుతో ప్రజా ఉద్యమ కార్యకర్తలను తప్పుడు కేసుల్లో ఇరికించడానికి, ఘోరమైన శిక్షలు విధించడానికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారాల్ని పెంచుతూ ఎన్ఐఏ చట్టాన్ని సవరించింది. వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించడానికి వీలు కల్పించేలా దేశంలోని దళిత, ఆదివాసి, మతమైనారిటి, హక్కుల పోరాటకారులను, మావోయిస్టులను ఉగ్రవాదులుగా ప్రకటించడానికి వీలు కల్పించేలా చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (ఉపా) సవరించింది. తమ రాజకీయ ప్రత్యర్థుల మీద, భిన్నాభిప్రాయాలు ప్రకటించిన వారిమీద, సంఘ్ పరివార్ వ్యతిరేకుల మీద మొత్తంగా ప్రగతిశీల, ప్రజాస్వామిక, విప్లవ శక్తుల మీద అణచివేతను మరింత ఫాసిస్టు పద్ధతుల్లో తీవ్రతరం చేసే వ్యూహంలో భాగమే ఈ చట్ట సవరణలు.

మధ్యతరగతిని, నిరుద్యోగ యువతను, విద్యార్థి–యువజనులను భ్రమల్లో ముంచెత్తడానికి, 2024 నాటికి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని, తద్వారా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామని, అపుడు దేశంలో పేదరికం ఉండదని మోదీ ప్రభుత్వం తెగ ఊదరగొడుతోంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభపు ప్రభావం తోడై దేశంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, అన్ని రకాల వస్తువుల కొనుగోల్లు తగ్గిపోయిన ఫలితంగా ఆటోరంగంలో మొదలైన ఉద్యోగుల తొలగింపులు అన్ని రంగాలకు విస్తరిస్తున్నాయని దీంతో ఉత్పాదక రంగం (మాన్యుఫాక్చరింగ్ రంగం)లో వృద్ధి తగ్గి దేశంలో ఆర్థికమాంద్యం తాండవిస్తోందని బూర్జువా ఆర్థికవేత్తలు సైతం విశ్లేషిస్తుంటే దేశంలో ఆర్థికమాంద్యం లేదని వృద్ధి మందగించడం (స్లో డౌన్) మాత్రమే ఉందని మోదీ ప్రభుత్వం బుకాయిస్తోంది. నిజానికి అది నాలుగు విడతలుగా ఉద్దీపన పథకాలను ప్రకటించినప్పటికీ దాని నుండి బయటపడే మార్గం కనపడడం లేదు.

మోదీ ప్రభుత్వం మున్నెన్నడూ లేనిస్థాయిలో తన ప్రభుత్వ సైనిక–పారామిలటరి బలగాలను మోహరించి, కర్ఫ్యూ–నిషేధాజ్ఞలు విధించి వేలాది మందిని జైళ్లలో కుక్కి, జమ్ము–కశ్మీర్ రాష్ట్రాన్ని దిగ్బంధించి ఆగస్టు 5నాడు జమ్ము–కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్‌ను, 35ఎ ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్ జాతి ప్రజలపై ఫాసిస్టు దాడి చేసి, ఈ పోరాటాన్ని అణచివేయడానికి పూనుకుంది. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్‌షిప్ (ఎన్ఆర్‌సీ) పేరుతో అసోంలో ఎపుడో–ఎన్నో తరాల ముందు వలస వచ్చిన లక్షలాది ముస్లిములను బంగాలీలను, రోహింగ్యాలను తీవ్ర అభద్రతా భావానికి ఎనలేని కష్టాలకు గురి చేస్తోంది. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం, ఎన్ఆర్‌సీ పేరుతో దేశవ్యాప్తంగా ప్రజలను భయాందోళనలకు, అభద్రతకు గురి చేయడమే కాకుండా రానున్న రోజుల్లో దేశంలోని పీడిత జాతుల అస్థిత్వాన్ని రూపుమాపడానికి అన్ని జాతులపై హిందీ భాషను రుద్దడానికి సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా కాలంచెల్లిన హిందుత్వ ఫాసిస్టు దృక్పథంతో నిండిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రూపొందించారు.

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో వన్య ప్రాణుల సంరక్షణ పేరుతో అడవిలో మూడు తరాల నుండి నివాసం ఉంటున్నట్టు నిరూపించుకోలేని ఆదివాసులను అడవుల నుండి బేదఖల్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీంతో దేశంలోని 16 రాష్ట్రాల్లోని 11 లక్షల ఆదివాసులకు జీవన్మరణ సమస్య ఎదురయ్యింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆదివాసులు పోరాడడంతో సుప్రీంకోర్టు ఆ ఉత్తర్వును తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే సుప్రీంకోర్టు తీర్పును మించి దేశంలోని అడవి ప్రాంతాల్లో నివాసముంటున్న 11కోట్లకు పైగా ఆదివాసులతోపాటు తరతరాలుగా అడవిలో నివాసముంటున్న ఆదివాసేతర ప్రజా సముదాయాల్ని అడవి నుండి తరిమివేసి, అడవుల్ని దేశీ, విదేశీ కార్పోరేట్ కంపెనీలకు, దళారీ నిరంకుశ ప్రభుత్వ సంస్థలకు, మిలటరీ–పారామిలటరీ బలగాలకు అప్పగించడానికి నూతన అటవీ ముసాయిదా సవరణ చట్టం 2019ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. దీంతో అటవి ప్రాంతాల్లోని ఆదివాసీ, గైరాదివాసీ ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

దేశంలో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడి, పీడనలను నిర్మూలించి నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించడం కోసం, దేశాన్ని హిందూ ఫాసిస్టుల నుండి కాపాడడం కోసం విస్తృతంగా కదలాలని, సమైక్యం–సంఘటితం కావాలని, సమరశీలంగా పోరాడాలనీ పెద్దఎత్తున పీఎల్‌జీఏలోకి భర్తీ కావాల్సిందిగా సీఎమ్‌సీ దేశ ప్రజలకు పిలుపునిస్తోంది.

విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడిని ఓడించడానికి గత సంవత్సర కాలంగా మన వీర పీఎల్‌జీఏ సాధించిన గెరిల్లాయుద్ధ విజయాలను ప్రజల్లో, పార్టీ కాడర్లలో, పీఎల్‌జీఏ యోధుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలనీ, డిసెంబర్ నెలలో చేపట్టే రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలనీ పార్టీ కమిటీలకు, పీఎల్‌జీఏ కమాండ్లకు సీఎమ్‌సీ పిలుపునిస్తోంది.

**విప్లవాభినందనలతో,**

**సెంట్రల్ మిలిటరి కమిషన్,**

**సీ.పీ.ఐ. (మావోయిస్టు)**

సీఎంసీ సందేశం

*డిసెంబర్ 2 నుండి 8 వరకు*

# పీఎల్‌జీఏ 19వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

## భారత విప్లవోద్యమ నిర్మూలనకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఆత్మరక్షణా యుద్ధం ద్వారా తిప్పికొట్టండి!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

డిసెంబర్ 2, భారత విప్లవోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు. మన పార్టీ సంస్థాపకులు, ఉపాధ్యాయులు, భారత విప్లవోద్యమ నిర్మాతలు, అమరులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హయ్ చటర్జీల దిశా నిర్దేశంలో, అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీల స్మృతిలో, వేలాది అమరుల కలలను సాకారం చేయడానికి 2 డిసెంబర్, 2000నాడు పీఎల్‌జీఏ నిర్మాణమయింది. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య దోపిడి, పీడనల నుండి మన దేశాన్ని విముక్తి చేసి అంతిమంగా సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో ఏర్పడిన మన వీర పీఎల్‌జీఏకు రానున్న డిసెంబర్ 2 నాటికి 19 ఏళ్ళు నిండుతాయి. ఈ సందర్భంగా యావత్తు పార్టీ కమిటీలకు, కమాండ్లకు, పార్టీ సభ్యులకు, పీఎల్‌జీఏ కమాండర్లకు, యోధులకు, విప్లవ ప్రజా ప్రభుత్వాల, ప్రజా సంఘాల నాయకులకు-కార్యకర్తలకు, ప్రజా మిలీషియా సభ్యులకు, విప్లవ ప్రజానీకానికీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎమ్‌సీ), సీపీఐ (మావోయిస్టు) విప్లవాభినందనలు తెలియజేస్తోంది.

అమరులు ఆచరించిన కమ్యూనిస్టు జీవన విలువలను, శతృవుకు తలవంచని వారి ధీరోదాత్తతను, చావుకు వెరువని, అలుపెరుగని పోరాట శైలిని, ప్రజల పట్ల వారి అంకిత భావాన్ని ఆదర్శాలుగా తీసుకుని ఆచరిద్దాం. వారి ఆశయ సాధన కోసం, వారి కలల సాఫల్యం కోసం చివరి వరకు పోరాడుదామని శపథం చేద్దాం.

దేశవ్యాప్తంగా సాగిన గెరిల్లాయుద్ధ చర్యల్లో గాయపడ్డ కామ్రేడ్స్ త్వరగా కోలుకొని సమరోత్సాహంతో సమర రంగంలోకి దూకుతారని సీఎమ్‌సీ విశ్వసిస్తోంది.

డిసెంబర్ 2 నుండి 8 వరకు దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాలంతటా గ్రామాల్లో, పట్టణాల్లో పీఎల్‌జీఏ 19వ వార్షికోత్సవాన్ని విప్లవోత్సాహంతో, విప్లవ పట్టుదలతో జరపాల్సిందిగా యావత్తు పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ యూనిట్లకు, విప్లవ ప్రజా ప్రభుత్వాలకు, ప్రజా సంఘాలకు, విప్లవ ప్రజానీకానికి సీఎమ్‌సీ పిలుపునిస్తోంది. శతృవు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఓడించే లక్ష్యంతో పీఎల్‌జీఏను సంఘటితం చేయడం కోసం దేశవ్యాప్తంగా డిసెంబర్ నెలంతా రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్‌ను చేపట్టాలనీ సీఎమ్‌సీ పిలుపునిస్తోంది.

సంవత్సర కాలంలో అమరులైన (2018 డిసెంబర్ నుండి 2019 సెప్టెంబరు వరకు) దేశవ్యాప్తంగా 128 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు, వారిలో జోనల్/డివిజనల్/జిల్లా కమిటీ/సీవైపీసీ సభ్యులు ఐదుగురు; ఏసీ/పీపీసీ సభ్యులు 25 మంది; పార్టీ/పీఎల్‌జీఏ (ప్రధాన, ద్వితీయ బలగాలు) సభ్యులు 67 మంది; విప్లవ ప్రజా ప్రభుత్వాల (ఆర్‌పీసీ), ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు 7 గురు; మిలీషియా కమాండర్లు, సభ్యులు 13 మంది; విప్లవ ప్రజానీకం 11 మంది ఉన్నారు. వీరిలో 36 మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు.

### విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడిని ఓడించేందుకై దేశవ్యాప్తంగా మనం సాగించిన రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి ఫలితాలు

డిసెంబర్ 2018 నుండి 2019 సెప్టెంబర్ వరకు గడిచిన 10 నెలల కాలంలో మన పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ వివిధ గెరిల్లా జోన్లల్లో, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల్లో దాదాపుగా 360 చర్యలు నిర్వహించింది. శతృ సాయుధ బలగాలపై సుమారు 70 చర్యల్ని నిర్వహించింది. ఇందులో కొన్ని పెద్ద చర్యలు కాగా, అత్యధికం చిన్న, మధ్యరకం చర్యలు. సుమారు 130 ఎన్‌కౌంటర్లలో పోలీసు-పారామిలటరీ-కమెండో బలగాలతో పీఎల్‌జీఏ బలగాలు తలపడ్డాయి.

దండకారణ్యంలో నవంబర్ 2018లో జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణ సమయంలో సాగించిన టీసీఓసీతో పాటు ఈ సంవత్సరం జనవరి నుండి జూన్ వరకు సాగిన టీసీఓసీలో గెరిల్లాయుద్ధ చర్యల్లో 75 మంది పోలీసు, పారా మిలిటరి, కమాండో బలగాలను నిర్మూలించి, 147 మందిని గాయపరిచి, 13 ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నాం. దండకారణ్యంలో చేసిన గెరిల్లాయుద్ధ చర్యల్లో- దంతెవాడ

*(మిగతాది **44**వ పేజీలో...)*